16-2Pg1exHMNWJQE 1 VJA_16-2Pg1exHMNWJQE.qxd 16/Feb/26 12:15 AM Page 1

ఆదివారం
గత వారంలోని ముఖ్య విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 16 పేజీలు: 12 వెల: 6.50

ఆధార్‌తో మరింతగా వ్యక్తిగత భద్రత

9లో

రేపు బంగ్లాలో కొత్త సర్కార్



## పాక్ చిత్తు చిత్తు

టి-20 వరల్డ్ కప్‌లో భారత్ ఘన విజయం

61 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8కి చేరిన భారత్ జట్టు

ఆట లో

# స్టూడెంట్లకు 'నీట్' శిక్షణ



ఆదివారం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు తదితరులు

ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు

సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి

బంజారాలలో చైతన్యం తెచ్చిన సేవాలాల్

గిరిజన ప్రాంతాల్లో మరిన్ని మౌలిక సౌకర్యాలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** నీట్, ఐఐటీల్లో సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుల్లో ముందుంటున్నారని, ఉన్నత కొలువులు సాధించాలనే పట్టుదల వారిలో పెరిగిందన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకుంటారనడంలో ఎటువంటి సందేహం లేదని అభిప్రాయపడ్డారు. సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. రూ.50లక్షలు కేటాయించి సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్రపండుగగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ప్రసంగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, గుత్తి మండలం, రామ్‌జీ నాయక్ తండాలో భీమా నాయక్, ధర్మణి మాత దంపతులకు సంత్ శ్రీ సేవాలాల్ జన్మించారు. సేవాలాల్ దూరమై శతాబ్దాలు గడుస్తున్నా బంజారాల గుండెల్లో ఆరాధ్యదైవంగా నిలిచారు. బంజారాలలో సేవాలాల్ చైతన్యాన్ని తీసుకొచ్చారు. ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శంగా ఉంటాయి. దేశమంతా తిరిగి బంజారాలాను ఒకతాటిపైకి తీసుకొచ్చారు. సేవాలాల్ సేవలను నెమరువేసుకునే బాధ్యత >>2



శ్రీశైలంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల ప్రభోత్సవం దృశ్యం

# 'హరోంహర' నామస్మరణతో వైభవంగా మహాశివరాత్రి

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



2లో

విజయవాడలో శివరాత్రి సందర్భంగా పున్నమి ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



## చేనేతలకు ఉచిత విద్యుత్

ఏప్రిల్ 1 నుంచి అమలు: మంత్రి సవిత

**విజయవాడ,ఫిబ్రవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేత వృత్తిలో కొనసాగే వారందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నామన్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది. పోగును వస్త్రంగా మార్చి మనుష్యుల ఆత్మగౌరవాన్ని కాపాడే మహనీయులు నేతన్నలని కొనియాడారు. చేనేతలకు అన్న ఎన్టీఆర్ తొలుత అండగా నిలుస్తే, 2014-19లో సీఎం చంద్రబాబు నాయుడు పాలన నేతన్నలకు స్వర్ణయుగంలా గడిచిందని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నామన్నారు. చేనేతవృత్తిలో ఉన్న వారందరూ ఉచిత విద్యుత్‌కే అర్హులేనన్నారు. మగ్గం నేసే నేతన్నలకు 200యూనిట్ల అందజేయ బోతున్నామని,దీనివల్ల ఆయా నేతన్నల >>2

# కృత్రిమ మేధకు కొత్త అడ్రస్

దేశంలో మొదటి ఎఐ డేటా నగరంగా విశాఖ

ప్రపంచ ఎఐ రేసులో ప్రస్తుతం అమెరికా, చైనా ముందంజ

విశాఖ నుంచి 100 కి.మీ మేర సమగ్ర డేటా అభివృద్ధికి సర్కార్ నిర్ణయం



**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరమైన విశాఖపట్నం భారతదేశ కృత్రిమ మేధస్సు ఆశయాలకు కేంద్రంగా మారనుంది. దేశంలో మొట్టమొదటఏఐ కేంద్రీకృత డేటా నగరాన్ని ఇక్కడ అభివృద్ధి చేయడానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ ఇంటర్నెట్ కనెక్టివిటీ కారణంగా ఈ సముద్ర తీరప్రాంత నగరం వ్యూహాత్మకంగా ముఖ్యమైనదిగా మారబోతుంది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026ఈ దిశలో బలమైన పునాది వేయగలదని నిపుణులు భావిస్తున్నారు.ప్రపంచ ఏ ఐ రేసులో అమెరికా, చైనాలు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏఐ ని స్వీకరించాలా !వద్దా?అనేది కాదు, భారతదేశం ఎంత త్వరగా ముందుకు సాగగలదనేదే అని ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టంగా పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కి ముందు ఒక ప్రకటన చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సీఈఓలు, దేశాధినేతలు పాల్గొంటున్నారు. తత్ఫలితంగా, విశాఖపట్నంలో జరిగే ఈ ప్రాజెక్ట్ ప్రపంచ >>2



## నేడు అమరావతికి బిల్ గేట్స్ రాక

ముఖ్యమంత్రితో భేటీ

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:**మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈనెల 16న రాష్ట్రానికి రానున్నారు. తన గేట్స్ ఫౌండేషన్ తరపున రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్ని సందర్శించడంతో పాటు ప్రభుత్వ పెద్దలతో భేటీ కానున్నారు. బిల్‌గేట్స్ రాకకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదలచేసింది. ఇందులో ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న సంజీవని ప్రాజెక్టును కూడా బిల్ గేట్స్ పరిశీలిస్తారు. 16 తేదీ ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ అమరావతిలోని రాష్ట్రసచివాలయానికి రానున్నారు. అక్కడి ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్సు విధానాలు, ఫలితాలను బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి >>2

# 'కల్తీ నెయ్యి'లో అధికారులే కీలకమా!

గత బోర్డు పెద్దలు నిమిత్తమాత్రమేనా?

అన్నీ తమపై నెట్టేస్తున్నారని ఉద్యోగుల ఆవేదన



**తిరుమల,ఫిబ్రవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు 235కోట్ల రూపాయల విలువైన 60లక్షల కిలోల కెమికల్స్ వాడారనే కల్తీనెయ్యి వివాదంలో కర్త, కర్మ, క్రియ టిటిడి అధికారులేననే పెద్ద దుమారం ఇప్పుడు సంచలనంగా మారింది. కల్తీ నెయ్యి సరఫరా అయినా వినియోగించేందుకు తొమ్మిదిమంది టిటిడి ఉద్యోగులు సహకరించారనే అభియోగంతో కొందరు ఉద్యోగులకు షాక్ తగిలిందనే దుమారం టిటిడిలో గుప్పుమంటోంది. ధార్మికసంస్థ టిటిడిలో బోర్డు పెద్దలు పాలన ఉన్నంత కాలం సుప్రీమ్ బోర్డునేననేది జగమెరిగిన సత్యం. ఇలా 2019-2024 మధ్యకాలంలో తిరుమల లడ్డూలకు అవసరమైన ఆవునెయ్యి సరఫరాకు టెండర్లు పిలవడం, టెండర్లు ఖరారుచేయడం వంటివి కూడా పూర్తిగా అప్పటి బోర్డు పెద్దల ఆదేశాల మేరకే జరిగిందనేది అధికారులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు గత బోర్డు పెద్దలు కొందరు ఏకంగా కల్తీనెయ్యి అభాండాలు ఉద్యోగులపై నెట్టేసేలా ప్రచారం మొదలుపెట్టారని ఉద్యోగవర్గాల సమాచారం. కల్తీనెయ్యిలో అధికారుల పాత్రేనని చెబుతున్న గత బోర్డు పెద్దలు తమ ప్రమేయం నామమాత్రమేనని పొక్కడం ఎంతవరకు సమం జసమని అధికారులు బోరుమంటున్నారు. ఇప్పటికే ఈ కేసులో మొత్తం 36మంది నిందితులుగా సిబిఐ సిట్ పేర్కొనగా అందులో 12మంది టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ కమిటీ విభాగంలో జిఎంలు, సీనియర్ అసిస్టెంట్‌లు, కొందరు ఉద్యోగులు కీలకమనేది సిట్ నివేదికలు. ఏడుగురు టిటిడి అధికారులు సీనియర్ ,జూనియర్ అసిస్టెంట్‌లు కల్తీ నెయ్యి వ్యవహారంలో జోక్యముందనేది సిట్ నివేదిక. వీరివెనుక కీలకంగా కడూరు చిన్నఅప్పన్న ఆర్థికలావాదేవీలు నడిపారనేది కూడా ప్రధానంగా పేర్కొంది. డెయిరీ విభాగంకు సంబంధించి మాజీ జిఎం పేరూరు జగదీశ్వర్‌రెడ్డి, పి.వెంకటరామ సుబ్రమణ్యం, పి.మురళీకృష్ణ ,టిటిడి ఎస్వీగోశాల మాజీ డైరెక్టర్ డాక్టర్ హరినాథరెడ్డి, డెయిరీ టెక్నాలజీ నిపుణులు డాక్టర్ ఎం.మహేందర్, డాక్టర్ వి.వెంకటసుబ్రమణియన్, ఎం.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తులసురేంద్రనాథ్, డాక్టర్ కె.జయరాజారావును దోషులుగా పేర్కొంది. అయితే ఇదిలా ఉండగా ఇప్పుడు ఈ వివాదంలో టిటిడి డిప్యూటీ ఇఒ పద్మావతి,వివిఎస్ సురేశ్‌కుమార్, జ్యోతీశ్వరుడు, పార్థసారధి, మురళి, వెంకటరమణ పేర్లు గుప్పుమంది. నెయ్యికొనుగోళ్ళ సమయంలో గోడన్లలో విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించారనేది ప్రధాన ఆరోపణ. వీరిపై కూడా సిట్ నివేదికల్లో శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేయడంతో >>2

## ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే ఒక భరోసా.. నమ్మకం

విద్యా మంత్రి లోకేష్



**విజయవాడ,ఫిబ్రవరి 15.ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ ట్రస్ట్‌అంటే ఒక భరోసా, నమ్మకమని.. ఏపీ విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి ద్వారా ఈ ట్రస్ట్ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు.ఈ ట్రస్ట్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తోందని వివరించారు.సామాజిక సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఆదివారంతో 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ట్రస్ట్‌కు లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారాయన. ఇదే సామాజిక మాధ్యమంలో మరో పోస్టులో ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు మంత్రి లోకేశ్. భోళా శంకరుడు లింగోద్భవం చెందిన పవిత్రమైన రోజు ఈ మహా శివరాత్రి అని ఆయన పేర్కొన్నారు. ఉపవాసం, జాగరణతో నీలకంఠుడి కృపకు ప్రజలు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

# పేషెంట్లను పిప్పి చేస్తున్న రిఫరల్ దందా

ఆసుపత్రుల్లో హద్దులు దాటుతున్న కమీషన్లు

ప్రైవేటు పిడికిలిలో రోగులు విలవిల

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 15:** ఏ వ్యాపారానికైనా కమీషన్లు ఉండడం సహజమైనప్పటికీ మనిషి అనారోగ్యాన్ని తగ్గించి ప్రాణాలను కాపాడే వైద్య వ్యవస్థలో కూడా ఈ కమీషన్లు హద్దులు దాటడంతో రోగులు ఆర్థికంగా తట్టుకోలేక వీధిపాలవుతున్నారు. ప్రాణభయం ఉన్నప్పటికీ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లడానికి భయపడే పరిస్థితిలోకి రోగులు చేరుకున్నారంటే ఇందుకు దారి తీసిన అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ల్యాబ్ పరీక్షలు, చికిత్స, సర్జరీల ధరలు ఆసుపత్రి గోడల మీద బోర్డు మీద రాసిన దానికి, వసూళ్ళు చేస్తున్న మొత్తానికి సంబంధం లేకుండా ఉంటున్నాయి. దీనికి కారణాలు అనేకమని, ముఖ్యంగా వైద్య కిట్లు రేట్లు పెరిగాయని వైద్యులు చెబుతున్నప్పటికీ ఖి రిఫరల్స్ ఖి ప్రధాన కారణమనే ప్రచారం ఉంది. రిఫరల్స్ పేరుతో రోగులను ఆసుపత్రికి పరిచయం చేసిన వ్యక్తులకు 30 నుంచి 40 శాతం వరకూ చెల్లించడం అనేది ఉభయ గోదావరి జిల్లాల్లో సర్వసాధారణం అయిపోయింది. ఆధునిక వైద్యం ఆశించి ప్రైవేటు మినీ కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే రోగుల దగ్గర నిర్దాక్షిణ్యంగా అధిక బిల్లులు వసూలు చేసి దాని నుంచి వారిని ఆసుపత్రికి సిఫార్సు చేసిన వ్యక్తికి అధిక మొత్తంలో కమీషన్లు ఇవ్వడం తెలిసి కూడా వైద్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం పలు



విమర్శలకు దారితీస్తుంది. గ్రామీణ వాతావరణం నుంచి వచ్చే రోగుల వద్ద ఒక్కోసారి 50 కూడా అదనంగా వసూలు చేసే సంబంధిత ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లకు ముట్ట చెప్పడం ఆ వ్యవస్థలో ఉన్న దోపిడీని అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా దీనివల్ల అనవసర టెస్టులు, ఆపరేషన్లు పెరుగుతున్నాయని గుర్తించిన వైద్యశాఖ కొన్ని ఆసుపత్రులకు నోటీసులు కూడా జారీచేసిన సంఘటనలున్నాయి. నగరాల్లో వెలిసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో అయితే ఒక ఆసుపత్రి నుంచి >>2

16-2Pg2exHNWMJQE 2_16-2Pg2exHNWMJQE.qxd 16/Feb/26 12:19 AM Page 1





ఆదివారం శ్రీశైలం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## 'హరోంహర' నామస్మరణతో వైభవంగా మహాశివరాత్రి

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హర.హర మహాదేవా. శంభోశంకరా అంటూ శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పరమ శివున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి.పలు క్షేత్రాల్లో నదీ స్నానాల అనంతరం గట్టుననున్న శివలింగాలకు స్వయంగా అభిషేకాలు నిర్వహిస్తున్నారు., రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిర్వహిస్తున్నారు. ఆలయ పరిసరాలను అధికారులు విద్యుత్ దీపాలు, పూలతో అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తజనం తరలివచ్చింది. భక్తులతో శ్రీశైలం మహా క్షేత్రం కిక్కిరిసింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా పోలీస్, రెవెన్యూ, దేవాదాయ శాఖలతో పాటు వివిధ శాఖల సమన్వయంతో శివ క్షేత్రంలో మునుపెన్నడూ లేని విధంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శ్రీశైలం దేవస్థానం సమీపంలో 626 కెమెరాల ద్వారా ప్రతి కదలికనూ ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించనున్నారు. పంచారామ శైవ క్షేత్రమైన పల్నాడు జిల్లా అమరావతి అమరేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మూడు గంటలకు బిందె తీర్థంతో తొలి పూజ మహోత్సవం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. విశేషాలంకరణలో అమరేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ రుత్వికులు, అర్చకులు బాలచాముండికా సమేత అమరేశ్వరుని విశేషంగా అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, మహారుద్రాభిషేకం, విశేష పూజలు శాస్త్రోకంగా నిర్వహించారు. కృష్ణానదిలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి క్షేత్ర పాలకుడైన బాల చాముండికా సమేత అమరేశ్వరుని దర్శనానికి భక్తులు బారుల తీరారు. సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. భీమేశ్వరస్వామి, బాలత్రిపురసుందరి అమ్మవారికి అర్చకులు అభిషేకాలు, పూజలు చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో శివరాత్రి సందర్భంగా విజయవాడ నగరంలోని కృష్ణానది తీరంలో భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు చేసి, ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరుని దర్శించి పూజలుచేసారు.కూడలి సంగమేశ్వరాలయంలో మూడు ఉపనదులు సంగమించే ప్రాంతంలో స్నానాలు చేసిన అనంతరం పూజులు జరిపారు.ఇబ్రహీంపట్టణం గోదావరి- కృష్ణ సంగమ స్థలి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.రాజమహేంద్రవరం, ధవళేశ్వరంమహాశివరాత్రి వేళ శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవిని దర్శించుకునేందుకు వేకువజామున 2 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయానికి చేరుకునే భక్తులకు ఉపయుక్తంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అధికారులు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఆలయంలో శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. సోమ స్కంద మూర్తి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి శేష , యాలి వాహనాలపై భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వర్ణాభరణాల అలంకరణలో ఉన్న దేవతామూర్తులు స్వర్ణ వాహనాలపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి తొలిపూజ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. తెల్లవారుజామున 12గంటల 30నిమిషాలకు త్రికోటేశ్వరునికి పలు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. త్రికోటేశ్వరునికి నిర్వహించేఅభిషేకాల వేడుకను తిలకించేందుకు భక్తులు శనివారం రాత్రి నుంచే ఆలయంలో బారులు తీరారు. తొలిపూజ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు.

## తమిళ బిజెపి నేత నైనార్ నాగేంద్రన్‌పై సత్వరం సస్పెన్షన్ వేటు వేయాలి

### - జాతీయ సిపిఐ నేత నారాయణ డిమాండ్



చిత్తూరులో విలేకరులతో మాట్లాడుతున్న జాతీయ సిపిఐ నాయకులు నారాయణ

**చిత్తూరు, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్ర బిజెపి నాయకుడు నైనార్ నాగేంద్రన్‌పై కేంద్ర బిజెపి నాయకత్వం సత్వరం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని జాతీయ సిపిఐ కంట్రోల్ ఛైర్మన్ నారాయణ డిమాండ్ చేశారు. చిత్తూరులో ఆదివారం జాతీయ సిపిఐ కంట్రోల్ ఛైర్మన్ నారాయణ విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు టివికే అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని నైనార్ చేసిన వాఖ్యలను నారాయణ తీవ్రంగా ఖండించారు. తమిళనాడు టివికే అధినేత విజయ్‌పై రాజకీయంగా తగాదాలు పెట్టుకోవచ్చు కానీ వ్యక్తిగతంగా దూషణలు చేయడం సమంజసం కాదన్నారు. టివికే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంను ప్రస్తావిస్తే అతనికి సినిమా హిరోయిన్‌తో సంబంధాలు వున్నాయని చెప్పడానికి నైనార్ నాగేంద్రన్ ఎవరని ప్రశ్నించారు. నైనార్ చేసిన వాఖ్యలు మహిళలను కించపరిచే విధంగా వున్నాయన్నారు. రాజకీయ విమర్శలు చేయాల్సిన చోట నటుడిపై వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం తగదని ఆయన మండిపడ్డారు. బిజెపి అధిష్టానం నైనార్ నాగేంద్రన్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## చేనేతలకు ఉచిత విద్యుత్

>> కుటుంబాలకు నెలకు రూ.720లు, ఏడాదికి రూ.8,640లు ఆదా కానుందన్నారు. మర మగ్గం నేసే నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయనున్నామని, దీనివల్ల ఆయా కుటుంబాలకు రూ.1,800లు, ఏడాదికి రూ.21,600 ఆర్థికంగా మేలు చేకూరనుందన్నారు. 2014- 19 మాదిరిగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత కూడా త్రిఫ్ట్ ఫండ్ నిధులు అందజేస్తున్నామన్నారు. గతంలో చేనేత సహకార సంఘాలకు పెట్టిన బకాయిలు కూడా చెల్లిస్తున్నామని వెల్లడించారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత నేతన్నలకు ఇచ్చే పెన్షన్ల మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని, నేటి వరకూ రూ.495 కోట్లు పెన్షన్ల రూపంలో అందజేశామని వెల్లడించారు.

## నేడు అమరావతికి బిల్ గేట్స్ రాక

>> చంద్రబాబు వివరిస్తారు. అనంతరం గేట్స్ బృందంతో సీఎం, మంత్రులు, వివిధ శాఖల అధికారులు సమావేశమవుతున్నారు. ఇందులో స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలపై ముఖ్యమంత్రి ప్రజంటేషన్ ఇస్తారు.మెడ్ టెక్, డయాగ్నస్టిక్స్ సేవలు, సంజీవని తదితర ప్రాజెక్టుల గురించి సీఎం చంద్రబాబు గేట్స్ కు వివరిస్తారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు గురించి ఆయనకు వివరిస్తారు. అనంతరం అమరావతిలో ఉండవల్లి గ్రామం వద్ద ఓ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లనున్న బిల్ గేట్స్ బృందం, అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహకారంతో చేపట్టే సాగు విధానాన్ని పరిశీలిం చనున్నారు. అక్కడితో గేట్స్ టీమ్ పర్యటన పూర్తవుతుంది.

## స్టూడెంట్లకు 'నీట్' శిక్షణ

>> మనందరిపై ఉంది. ఆయన మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టం. చిన్నతనం నుంచే సేవాలాల్ సామాజిక సేవతో మెలిగారు. ఎవరైనా ఆకలితో ఉంటే ఆయన వద్దునున్న ఆహారాన్ని పక్కవారికి ఇచ్చి ఆకలి తీర్చిన గొప్ప వ్యక్తి. జంతుబలిని వ్యతిరేకించారు. జంతువులను బలివ్వాలనుంటే ముందు నన్ను బలి ఇవ్వండని చెప్పారు. కానీ ఈ రోజుల్లో ఫోటోలకు జంతువులను బలిఇచ్చి హింసను సమర్థించుకునంటున్నార్తు అని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళా సమానత్వం గురించి మనం ఇప్పుడు మాట్లాడుకుంటన్నాం. ఆనాడే స్త్రీ సమానత్వ ఆవశ్యకతను సేవాలాల్ చెప్పారు. తన జీవితాన్ని అరణ్యవాసులు, సంచార జాతులకోసం కేటయించారు. సంచార జీవనం కాకుండా తండాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించారు. సాయం చేయడం, ప్రకృతిని ప్రేమించడంతో పాటు ధర్మాన్ని పాటించాలని హిత బోధ చేశారు. ఆయన అందరికీ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారు. అదే విధంగా పేదల కోసం పని చేసిన వ్యక్తి ఎన్టీఆర్. గిరిజన పిల్లలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి ఉన్నత విద్యను అందించాలని గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేశారు. ఆ తర్వాత తండాలను అభివృద్ధి చేయాలని ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాం. గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చేసేందుకు వారి ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నాం. అరకు కాఫీ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించింది. గిరిజన ప్రాంతాల్లో వనరులకు కొదవలేదు..వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసుతలు కల్పిస్తున్నాం. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించాం. సంత్ శ్రీ సేవాలాల్ లాంటి మహనీయుణ్ని నిత్యం తలచుకుని సమాజ హితం కోసం ప్రతి ఒక్కరం పని చేయాల్ని అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషా దేవి, తోయక జగదీశ్వరి, చిర్రి బాలరాజు, గిరిజన నేతలు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శివరాత్రికి ఒక రోజు అదనంగా శెలవు సదుపాయం కల్పించింది.మహా శివరాత్రి పర్వదినం ఆదివారం వచ్చింది. ఆ మరుసటి రోజు సోమవారం ప్రభుత్వం ఉద్యోగులకు ఆప్షనల్( ఐచ్ఛికశెలువు) హాలిడేగా ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈమేరకు సాధారణ పరిపాలనా శాఖ ఇవాళ జీవో విడుదల చేసింది. శివరాత్రి భక్తులు జాగారం చేయనున్న కారణంగా మరునాడు సెలవు తీసుకునేలా కూటమి ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది.హిందువులు పెద్ద పండుగల్లో శివరాత్రి ఒకటి. ఈ రోజును హిందువులు అత్యంత ఘనంగా జరుపుకుంటారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి. పార్వతీదేవిని శివుడు పెళ్లాడిన రోజునే ఈ పండుగగా చెబుతుంటారు. ఈ రోజున శివుడిని భక్తి, పూజలతో కొలిస్తే అంతా మంచి జరుగుతుందని నమ్ముతారు. ఈ ఏడాది అలాంటి పవిత్రమైన రోజు ఫిబ్రవరి 15న వచ్చింది. శివరాత్రి రోజున రాత్రి జాగారం చేస్తుంటారు. అందువల్ల మరునాడు సెలవు తీసుకునేలా ప్రభుత్వం ఈ అవకాశాన్ని కల్పించింది.

## ఒడిశా ఆర్టీసి బస్సు బోల్తా ఏడుగురికి తీవ్ర గాయాలు

**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా) :** ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :సాలూరు పట్టణ సమీపంలో ఒరిస్సా రాష్ట్రం నవరంగ్ పూర్ నుండి విజయవాడ వెళ్తున్న ఒరిస్సా ఆర్టీసీ బస్సు గత రాత్రి తెల్లవారుజాము 4 గంటల సమయంలో బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ఆ వివరాలు పట్టణ సీఐ అప్పలనాయుడు తెలియజేస్తూ ఈ ప్రమాద సమయంలో ఆర్టిసి డ్రైవర్ కండక్టర్ తో పాటు 31మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. అలాగే ఇందులో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని హుటాహుటి న 108 వాహనంలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.అంతేకాకుండా ఇంకా ఇందులో ఒరిస్సా నుండి విశాఖకు భవన నిర్మాణ పనులకు వెళ్తున్న కూలీలలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## జాతీయ రహదారిపై బైక్ రైడర్ దుర్మరణం


### బాపట్ల ఈవెంట్‌లో పాల్గొని హైదరాబాద్ వస్తుండగా పెద్ద కాపర్తి వద్ద బైక్‌ను ఢీకొన్న వాహనం

**చిట్యాల రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సెలవు దినాల్లో దూర ప్రాంతాలకు బైక్ రైడింగ్ చేస్తూ తమ అభిరుచిని పంచుకుంటున్న బైక్ రైడర్స్ గ్రూప్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన స్థానికంగా కలచివేసింది. చిట్యాల మండలం పరిధిలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్ రైడర్ దుర్మరణం చెందాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ కు చెందిన చదురుప్పల రితీష్ రెడ్డి (40) ఏపీలోని బాపట్లలో హార్లే డేవిడ్సన్ మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌కు హైదరాబాద్‌కు చెందిన ముప్పై రెండు మంది బైక్ రైడర్స్‌తో కలిసి రెండు రోజుల క్రితం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపుకు వస్తుండగా పెద్దకాపర్తి గ్రామ శివారులోని 7 హోటల్స్ సమీపంలో గుర్తుతెలియని వాహనం రితీష్ రెడ్డి ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రితీష్ రెడ్డికి తలకు, శరీరానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. రూ. 25 లక్షల విలువ గల బీఎండబ్ల్యూ బైక్‌పై ప్రయాణిస్తున్న రితీష్ రెడ్డి హెల్మెట్ ధరించినప్పటికీ ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణాలను కోల్పోయాడు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ, నియమిత వేగంతోనే ప్రయాణించాలని సూచించారు.

## మాజీ ఎంఎల్‌సి ఐలాపురం వెంకయ్య మృతి

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి నేత, సీనియర్ రాజకీయవేత్త, మాజీ ఎంఎల్‌సీ ఐలాపురం వెంకయ్య అనారోగ్యంతో కన్నుమూసారు.సుదీర్ఘకాలం కాంగ్రెస్‌పార్టీ నేతగా విజయవాడ నగరంలో పలు ఉద్యమాలకు వెంకయ్య సారథ్యం వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన సన్నిహితునిగా పేరుపొందారు.రాజకీయంగా ఆయన కాంగ్రెస్ వాదిగా వ్యవహరించిన సందర్భంలోను ఇతర పార్టీల నేతలు, ప్రముఖులతో సత్సం బంధాలు కలిగి ఉన్నారు.1999లో విజ యవాడ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పతేడా ఓడిపోయారు.బిసి ఉద్యమాల్లో వెంకయ్య అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. విజయవాడలో స్టార్ స్థాయి గుర్తింపుగా పొందిన ఐలాపురం హోటల్‌ను వెంకయ్య నిర్మాణం చేసారు.ఆయన కు మారుడు రాజా సమాచార హక్కు చట్టం కమీషనర్‌గా పనిచేసారు. ఐలాపురం వెంకయ్య మృతి పట్ల మాజీ సీఎం జగన్,జనసేన ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్,ప్రజాశాంతి పార్టీ నా యకుడు కెఏపాల్ కాంగ్రెస్‌నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, గుర్నాధంతదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.



ఐలాపురం వెంకయ్య (ఫైల్)

**ఐలాపురం వెంకయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి:** మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పనిచేశారని ముఖ్యమంత్రి అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడు పుతూ, అందరితో సత్సంబంధాలు కలిగిన వెంకయ్య మృతికి చంద్రబాబు సంతాపం తెలిపారు. వెంకయ్య కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఐలాపురం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు.

## పేషెంట్లను పిప్పి చేస్తున్న రిఫరల్ దందా

>> మరొక ఆసుపత్రికి వైద్యులు చేస్తున్న రెఫరెన్స్ ద్వారా 10 నుంచి 30 శాతం వరకూ కమిషన్లు ఇస్తూ ఉండగా, గ్రామీణ ప్రాంతంలో మటుకు 30 శాతం నుంచి 50 శాతం వరకు కమీషన్లు ఇస్తున్నారు. సాధారణంగా ఒక రోగికి అయ్యేఖర్చులో పిఎంపి, ఆర్ఎంపీలకు ఇచ్చే కమిషన్ సొమ్మును అదనంగా చేర్చి వసూలు చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలకు ప్రతి ఆసుపత్రికి ఒక పిఆర్ఓఉంటారు. ఆసుపత్రుల పబ్లిసిటీబోర్డుల మీద సోషల్ మీడియాలో సైతంపిఆర్ఓల నంబర్లు మాత్రమే పొందుపరుస్తారు. గతంలో పీఎంపీలు మాత్రమే రిఫరెన్స్ ఇస్తూ ఉండగా గత పదేళ్ల నుంచి సమా జంలో గుర్తించబడిన కీలక వ్యక్తులు కూడా తమ సర్కిల్లో ఉన్న రోగులను రిఫరెన్స్ గాపంపించడం ద్వారా రోగులనుంచిసొమ్మును అడ్డంగా దండుకుంటున్నారు.

**పరీక్షలకు 40 శాతం కమీషన్:** గతంలో అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన రోగిని వైద్యులు పలు విధాలుగా పరీక్షి ంచి మెడిసిన్ రాసేవారు, అయితే ప్రస్తుత కాలంలో చిన్న అనారోగ్యానికి సైతం సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ అంటూ అత్యధిక ధరగల టెస్టులను రాసి వాటి నుంచి 40 శాతం వరకూ కమీషన్ సొమ్మును సంబంధిత రిఫరల్ కు ఇస్తున్నారని పలువురు సిబ్బంది బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వ వైద్యులు కూడా ప్రైవేటుగా ప్రాక్టీసు చేసుకోవచ్చు అనే షరతులకు లోబడిన స్వేచ్ఛ ఉన్న కారణంగా కొందరు వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను తమ ప్రైవేటు ఆసుపత్రికి తరలించుకోవడం అందరికీ తెలిసిన వాస్తవమే అంటున్నారు.

**కంప్యూటర్ వైద్యం:** చిన్న నలత వచ్చినా పరీక్షల మీద ఆధారపడుతున్న వైద్యులు 90శాతం వరకూ ఉన్నారని, వచ్చిన రిపోర్టుల ఆధారంగా అప్పటికే సిస్టంలో పొందుపరిచిన మందుల రకాలు రాసివ్వడం చాలాచోట్ల జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ల్యాబ్ టెస్టుల్లో వాల్యూల ఆధారంగా మందులు రాసిచ్చే సాఫ్ట్వేర్ అని కూడా కొందరు వైద్యులు కలిగి ఉన్నారనే ప్రచారం కూడా జరగటం గమనార్హం. ఇటీవల భీమవరంలో రిఫరల్ దందా మీద చిన్నపాటి ఉద్యమమే జరిగినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారికి అందాల్సిన ముడుపులు ఆసుపత్రుల నుంచి పి ఆర్ ఓ ల ద్వారా కవర్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.భీమవరంలో ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్య శ్రీ) ద్వారా అనవసర ఆపరేషన్లు ఎక్కువ జరిగినట్లుగా కొందరికి నోటీసులు అందాయి వాటిలో ముఖ్యంగా హిస్టరెక్టమీ ( గర్భాశయం తీసివేసే సర్జరీలు) ఆపరేషన్లు అవసరం లేకుండానే 70 శాతం వరకు జరిగినట్లుగా లెక్కల్లో తేలాయి. ఎన్ ఎఫ్ హెచ్ ఎస్ సర్వే ద్వారా సుమారు 8 శాతం మహిళలు తమ 25 నుంచి 49 వయసు మధ్యలో ఈ సర్జరీ చేయించుకున్నారని తేలింది. ఇదంతా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ సొమ్మును దోచేయడమే కాకుండా సంబంధిత రిఫరల్స్ కు ఆదాయం కోసమేనని అభిప్రాయాలు ఉన్నాయి. వైద్యంలో కమిషన్లు ఇవ్వడం, అనవసర సర్జరీలు, టెస్టులు చేయడం వంటి చర్యలు చట్టపరంగా నేరమైనప్పటికీ యదేచ్ఛగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిపై విచారణ జరిపి స్థానిక డిఎంహెచ్వో , నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు విచారణ జరిపి ఈ కమీషన్లను అరికట్టాలని కోరుతున్నారు.





ఆదివారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఆ పార్టీ కీలకనేత, డీసీఎం పవన్

## ప్రజల మధ్య ఉండి పనిచేస్తామనే నమ్మకమే 'జనసేన' పురోభివృద్ధికి కీలకం

### పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

### పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించిన జనసేన అధినేత

### రూ.2 కోట్లు విరాళం ఇచ్చి, తొలి సభ్యత్వం స్వీకరించిన పవన్

**విజయవాడ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల మధ్య ఉండి పనిచేస్తామనే నమ్మకమే జనసేన పార్టీ పురోభివృద్ధికి కీలకమని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొణిదెల స్పష్టం చేసారు.జెఎస్పీ కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలన్నారు.జనం మధ్య నుండి వారి సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారానికి శ్రమించాలన్నారు.,జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభించారు. సభ్యత్వ నమోదుకు రూ.2 కోట్లు విరాళం అందించి, తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకొని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ఎవరైతే ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకుంటారో వారిని "ఉద్యమి"గా, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీ సిద్ధాంతాలకి ఆకర్షితులను చేసి సభ్యత్వ నమోదు చేసేవారిని "సాధక్"గా, జనసేన పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి పరోక్షంగా తమ వంతు సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేథా సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని " ప్రదాత"గా ఇక నుంచి పిలుస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు.

150 మందితో పార్టీని ప్రారంభించాం. 2021లో మొదటి విడత క్రియాశీలక సభ్యత్వం ప్రారంభించినప్పుడు 90 వేలు నమోదు చేశాం. ఎన్నికల ముందు ఆ సంఖ్య ఆరు లక్షలకు చేరింది. ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించాం. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారి నుంచి కూలి పనులు చేసుకునే వారు, చదువుకున్న వారు ఎంతో మంది ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యామన్నారు.

## 'కల్తీనెయ్యి'లో అధికారులే కీలకమా!

>> ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తుతోంది.

**ఏకసభ్యకమిటీ రాకముందే దుమారం:** రాష్ట్రప్రభుత్వం కూడా టిటిడి కల్తీనెయ్యి కేసును సీరియస్‌గానే తీసుకోవడంతో ఏకసభ్యకమిటీతో విచారణ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ఏకసభ్యకమిటీ నియామకం కాకముందే ,దర్యాప్తు మొదలుపెట్టకముందే మరింతమంది టిటిడి ఉద్యోగులు తెరపైకి వస్తుండటంతో అందరిలోనూ ఆందోళనకలిగిస్తోంది. అదేగాక తిరుమల లడ్డూలకు 2019-24మధ్యకాలంలో నెయ్యిసరఫరా టెండర్లు దక్కించుకుని చివరకు కల్తీనెయ్యి పంపిన కేసు విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయనే సంచలన వ్యాఖ్యలు ఎక్కడకు దారితీస్తుందనేది ఉద్యోగ వర్గాలు కలతచెందుతున్నారు.

ఈ వ్యవహారంలో పాత్రధారుల్ని తేల్చేసిన సిట్ సూత్రధారులను గుట్టువిప్పేసుంటే ఈ రాద్ధాంతం ఉండదనేది ఉద్యోగులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి సరఫరా వివాదంలో పూర్వ టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌పై బదలీ వేటువేసిన ప్రభుత్వం టిటిడి ఎఫ్ఎసిఎఒ ఓ.బాలాజీపై చర్యలు తీసుకోకముందే ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్ళిపోయారు.

అయితే దేశం వదలి వెళ్ళకముందే ఆయన్ను అదుపులోకి తీసుకుని ఆయన నుండి మరింత ఆర్థిక లావాదేవీలు, నెయ్యిసరఫరా గుత్తేదారులకు బిల్లులు మంజూరుచేయడం వంటి కీలక సమాచారం రాబట్టి అసలు దోషులను తేల్చాలని ఉద్యోగుల వాదన. కాగా టిటిడి ఎఫ్ఎసిఎఒగా అదనపు బాధ్యతల్లో అదనపు ఎఫ్ఎసిఎఒ రవిప్రసాద్ నిర్వర్తిస్తున్నారు.

### వారం - వర్జ్యం

16-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
చతుర్దశి సా.5.30
శ్రవణ రా.8.44
వర్జ్యం : రా.12.48-2.26
దు.మ.12.46-1.32
2) మ.3.05-3.51
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి. రహస్యచర్చలు ఫలిస్తాయి. ఇతరులను ఆదుకుంటారు.

**వృషభం:** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. అనుకోని ఆహ్వానాలు అందుతాయి. వాహనసౌఖ్యం.

**మిథునం:** ఎంతో శ్రమిస్తేగాని ఫలితం దక్కదన్న సత్యాన్ని తెలుసు కుంటారు. రాజకీయత్నాలు ఫలిస్తాయి.

**కర్కాటకం:** దైవం తోడు ఉంటే కాలం కలిసివస్తుందని సమయం కోసం వేచి ఉంటారు.శ్రమ అధికంగా వుంటుంది.

**సింహం:** సంతాన అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు. పూర్వంకన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. వస్తువులు కొనుగోలుచేస్తారు.

**కన్య :** దైనందిన జీవితంలో మార్పులు చేస్తారు. ఆ మార్పులు కలిసివస్తాయి. సొంత ఆలోచనలు మేలుచేస్తాయి.

**తుల :** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గతంలో వద్దనుకున్న అవకాశాలు తిరిగి అనుకూలం చేసుకుంటారు.

**వృశ్చికం:** పలు విషయాలలో అభిప్రాయ భేదాలు వాగ్వివాదాలు సంభవించడం చికాకు కలిగిస్తుంది.

**ధనుస్సు:** ఆరోగ్యపరంగా తీసుకునే జాగ్రత్తలు మంచి ఫలితాలనిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు.

**మకరం:** కలిసివచ్చిన, పొదుపుచేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది.శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** మీ కృషివల్ల మీరు సుఖపడక పోయినా మీవాళ్ళు సౌఖ్యంగాఉంటారు. ఇతరులకు సాయంచేసి విరోధి అవుతారు.

**మీనం:** వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

16-2P g3exHMNWJQE 3_16-2P g3exHMNWJQE.qxd 15/Feb/26 10:58 PM Page 1



## టెన్త్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

### ఏప్రిల్ 4 నుంచి 10వ తరగతి మూల్యాంకనం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. అయితే విద్యాశాఖ తాజాగా ఈ పరీక్షల షెడ్యూల్‌లోనూ ఓ మార్పు చేసింది. ఉగాది, రంజాన్ పండుగల కారణంగా ఇంగ్లీష్ పరీక్షను మర్చి 21కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది షెడ్యూల్ ప్రకారం ప్రతీ పరీక్ష తర్వాత ఒకరోజు విరామం వచ్చింది. దీంతో విద్యార్థులు ఎంతగానో సంతోషిస్తున్నారు. ఇది వారికి ఎంతో ప్రయోజనకరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫీజిక్స్, జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టులు అన్నింటికీ మధ్యలో విరామం ఉండేలా షెడ్యూల్ రూపొందించారు. దీని వల్ల ప్రతి పరీక్ష పూర్తి అయ్యాక విద్యార్థులు తదుపరి సబ్జెక్టు పై దృష్టి పెట్టేందుకు సమయం దొరుకుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్ వంటి సబ్జెక్టులను మళ్లీ చదువుకోవడానికి, చదివిన వాటిని మర్చిపోకుండా ఉండేందుకు ప్రాక్టీస్ చెయ్యడానికి ఈ విరామం ఎంతోగానో ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.

ఇక 10వ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా విద్యాధికారులకు పలు సూచనలు చేసింది. మూల్యాంకనంపై ఏప్రిల్ 4న నిర్వహించే అవగాహన కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొంది. ఈ ఏడాది నుంచి మూల్యాంకనం కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.



## గ్రామీణ పేదరిక నిర్మూలనకు రూ.1,872.23 కోట్లు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,872.23 కోట్లు కేటాయించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.143 కోట్లు అధికంగా కేటాయించడం, స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారిత, గ్రామీణ జీవనోపాధుల పురోగతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ప్రభుత్వం సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు, గ్రామ సంఘాల సహాయకులకు గౌరవ వేతనాలు, అలాగే సెర్ప్, డిఆర్‌డిఎ కార్యాలయాల నిర్వహణ కోసం మొత్తంగా రూ.464.99 కోట్లు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా దీనదయాల్ అంత్యోదయ యోజన- జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రూ.818 కోట్లు, స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రైజ్ ప్రోగ్రామ్ కింద రూ.30 కోట్లు, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ.15 కోట్లు కేటాయించారని తెలిపారు. దీనదయాల్ అంత్యోదయ యోజన - జాతయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రాష్ట్రానికి లభించే వాస్తవ వేటాయింపుల ఆధారంగా అదనంగా రూ.1200 కోట్లు వరకు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి తెలిపారు. దీంతో 2026-27 సంవత్సరంలో మొత్తం రూ.3000 కోట్ల వ్యయంతో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధుల మెరుగుదల, ఆదాయ వృద్ధి మరియు స్థిరమైన ఉపాధి అవకాశాల సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త మహత్తర లక్ష్యసాధ్యనలో భాగంగా సుమారు 5లక్షల మహిళలను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడం, అలాగే రైతు ఉత్పత్తి సంస్థలు ను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా అధిక బడ్జెట్ కేటాయించడమే కాకుండా, దీనదయాల్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా లభించే నిధుల ఆధారంగా మొత్తం వ్యయాన్ని రూ.3000 కోట్ల వరకు విస్తరించేందుకు దృఢ నిశ్చయంతో ముందుకు వస్తున్న ముఖ్యమంత్రికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుమల సమాచారం



### క్షేత్రపాలకుడు రుద్రుడికి విశేష పూజలు

తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం కొండల్లోని తిరుమలక్షేత్ర పాలకుడు రుద్రుడు కొలువై పూజలు అందుకుంటున్నాడు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న రుద్రుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా పర్వదినాన ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు కాలినడకన క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు. కొబ్బరినీళ్ళు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఆ తరువాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం పారుపత్తేదార్ హిమత్‌గిరి, అదనపు ఇఒ కార్యాలయం సూపరింటెండెంట్ రామచంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### భోగితేరుపై భోలాశంకరుడు





తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన భక్తులు భారీగా దర్శనానికి వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి వేడుక కావడంతో ఉదయం నుండి ఆలయం హరహరమహాదేవ శంభోశంకర, నమఃశ్శివాయ నామంతో మిన్నంటింది. మహాశివరాత్రి వేడుకలు కపిలేశ్వరుని ఆలయంలో అధికారులు అత్యంత కన్నులపండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం వాహనసేవలో కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు నిత్య కైంకర్యాలు ముగించుకుని ఆలయంలోపల భోగితేరును అధిరోహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లకు కర్పూర హారతులిచ్చారు. భోగితేరు ఆలయ పురవీదుల్లో భక్తుల ఓం నమః శివాయ నామస్మరణలతో కదిలింది. భజన మండళ్ళ కోలాటలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా సాగింది. ఆత్మ రధికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. అనంతరం స్వామిఅమ్మవార్లకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఉపచారాలు జరిపించారు. రాత్రి అధికార నందివాహనంపై సోమస్కంధమూర్తి అధిరోహించి భక్తులను కటాక్షించారు. నంది స్వామివారికి వాహనం. ఈ వాహనసేవల్లో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర, అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్, ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీవారి అనుగ్రహంతో శుభాలు



తిరుమల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినాన ఆదివారం ఉదయం ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, ఎమ్మెల్యే గ్రీష్మ, ప్రముఖ గాయని డాక్టర్ శోభారాజు కుటుంబంతో కలసి శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వికసిత్ భారత్ నిర్మాణానికి బడ్జెట్ పునాది



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపి బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు. ఎపి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్. సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారు. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. వికసిత్ ఎపి ద్వారా వికసిత్ భారత్ నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోంది అని మాధవ్ అన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గముంటుందన్నట్లుగా నేటి బడ్జెట్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఉంది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈ బడ్జెట్ ను భావించొచ్చు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్లో మైనార్టీలకు పెద్దపీట వస్తోంది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెట్టిపోయిన ఇమాం, మోజన్ల గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి హాజీకి లక్ష రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనార్టీల సంక్షేమానికి రూ.300 కోట్లు మంజూరు అయింది. ఉర్దూ భాషాభివృద్ధి, తదితరవాటికి రూ.7.78 కోట్లు కేటాయించాం. ఉర్దూ ఘర్, ఉర్దూ లైబ్రరీల అభివృద్ధికి రూ. 2.85 కోట్లు కేటాయించాం. మైనార్టీ నిరుద్యోగులకు నిష్ణాతులచే కోచింగ్ ఇప్పించి, వారిని ప్రయోజకులను చేయడానికి రూ.3.97 కోట్లు కేటాయించాం. ఉర్దూని రెండవ మాతృభాషగా ప్రకటించి గాలికొదలేసిన వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఉర్దూను అభివృద్ధి చేయాలి, ఉర్దూ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి, ఉర్దూలో చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉర్దూ అభివృద్ధికి రూ. 7.83 కోట్లు కేటాయించడం జరిగింది. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ.. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనార్టీలకు కేటాయించడం జరిగింది. సామాజిక పెన్షన్ల పంపిణీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నాం' అని వివరించారు.

## కోవా బన్ వలీకి అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, ఫుడ్ జిహాద్ చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతే కాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, "త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురు చూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం" అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సూపర్ సిక్స్ హామీల ప్రస్తావనేదీ?



విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడాయి బడ్జెట్‌గా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధికి సమతుల్యత లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇంకా కదలిక లేకుండా పోయిందని, మిగిలిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారనే ప్రస్తావన లేదన్నారు. నిరుద్యోగులను, మహిళలను, రైతులను, ఉద్యోగులను ఈ బడ్జెట్ మోసగించిందన్నారు. పోలవరం ప్రాజెక్టు 72శాతం పూర్తయ్యిందని గతంలో ప్రకటించుకున్న ప్రభుత్వం ఇప్పుడు 60 శాతమే పూర్తయ్యిందంటూ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చాలా తక్కువన్నారు. ఏ ప్రాధాన్యతా రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదన్నారు. బడ్జెట్ పూర్తిగా రాష్ట్ర ప్రజల ఆశలను ఒమ్ము చేసిందన్నారు.

## బడ్జెట్ అంతా అభూత కల్పనలే

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కొత్త సీసాలో పాత నీరు అన్న చందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. బడ్జెట్ అంతా ఊహాజనితం, అభూత కల్పనలేనన్నారు. ఎపి ప్రభుత్వానికి పేద, మధ్య తరగతి వర్గాలపై ప్రేమలేదన్నారు. వారి సంక్షేమానికి తగిన నిధులు కేటాయించలేదని "ఎక్స్"లో చేసిన పోస్టింగ్‌లో షర్మిల పేర్కొన్నారు. ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, సూపర్‌సిక్స్ హామీలకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. ఇంది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం అని మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వడ్డీలేకుండా రూ.10 లక్షల వరకూ రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కేటాయించలేదని తెలిపారు. 50 లక్షల మంది నిరుద్యోగులను మరోసారి మోసం చేశారని పేర్కొన్నారు.

## కోవా బన్ వలీకి ఎమ్మెల్సీ నాగబాబు రూ.25 వేలు ఆర్థికసాయం

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని చిరు వ్యాపారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు భరోసా ఇచ్చారు. పొట్టకూటి కోసం మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్న వలీ అనే చిరు వ్యాపారిని కొందరు భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి సంఘటనలు సమాజానికి మంచివి కాదని ఆయన హితవు పలికారు. ఈ దాడి ఘటన తర్వాత ఎందరో చిరువ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని నాగబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. దాడి కారణంగా శివరాత్రి నాడు తాను వ్యాపారం చేసుకోలేకపోయానని బాధిత వ్యక్తి వలీ ఆవేదన వ్యక్తం చేయగా, అతనికి వ్యక్తిగతంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించినట్లు నాగబాబు తెలిపారు. వలీ వంటి ఎందరో చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ దాడిని మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, ఎకొండపల్లి శ్రీనివాస్ కూడా ఖండించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు మతపరమైన రంగు పులమవద్దని నాగబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిరువ్యాపారులు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ఏమైనా సందేహాలుంటే, దానిని పరిశీలించడానికి ఫుడ్ సేఫ్టీ అథారిటీలు ఉన్నాయని, సంబంధిత అధికారులను సంప్రదించాలి తప్ప దాడులకు పాల్పడటం సరికాదని సూచించారు. దేశంలో కోట్ల మంది తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో వ్యాపారాలు చేస్తున్నారని గుర్తుచేశారు. పట్టణ ప్రాంతాల్లో 40శాతానికి పైగా పేద ప్రజలు వీరు విక్రయించే ఆహారంపైనే ఆధారపడతారని, అలాంటి వారిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యత అని నాగబాబు వివరించారు.

## కన్నుల పండువగా మల్లన్న పాగాలంకరణ

- కమనీయం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం
- నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవారు
- ఆది దంపతులకు వైభవంగా కల్యాణం



పాగాలంకరణతో మల్లన్న ఆలయం(ఫైల్ ఫొటో)

శ్రీశైలం ప్రాజెక్ట్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నికదీక్షతో పదకొండురోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఎనిమిదవ రోజైనా ఆదివారంనాడు శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. అనంతరం లోక కళ్యాణం కోసం జపాలు,పారాయణలు చేశారు. అనంతరం మండపారాధనలు పంచావరనార్చనలు, జపాను స్టానాలు. రుద్ర హోమం, చండీ హోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపాను స్థానాలు,రుద్ర పారాయణలు హోమాలు జరిపించబడ్డాయి.

**కమనీయం మల్లన్న ప్రభోత్సవం:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రథోత్సవంలో రథానికి చేసినట్లుగానే ప్రభోత్సవములో కూడా ప్రభకు పలు రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేయడం జరిగింది. ప్రభోత్సవములో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, కేరళ చండీ మేళం, కొమ్ము కొయ్య నృత్యం, ముంబాయి డోల్ తాషా, మహిళ వీరగాసి, కన్నడ జానపద కళా ప్రదర్శన, పురుషులు వీరగాసి కన్నడ కళా ప్రదర్శన, కాలిక నృత్యం, జానపద పగటి వేషాలు, గోరవయ్య నృత్యం, బుట్ట బొమ్మలు, తప్పెటచిందు, బీరప్ప డోలు, నందికోల సేవ, డమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోని, డోలు విన్యాసం, తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయడం జరిగింది, ఆలయ రాజ గోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నందిమండపం, బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు కొనసాగింది. పుష్పపల్లకిపై దర్శనం ఇచ్చిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి మురిసిపోయారు. గ్రామోత్సవములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, అధికారులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

**నంది వాహనాధీశులైన శ్రీ స్వామి అమ్మవార్లు:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వాహన సేవలలో భాగంగా ఆదివారం నాడు శ్రీ స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ మరియు ఆలయ ఉత్సవం నిర్వహించారు. లింగోద్భవ కాల మహారుద్రాభిషేకం: మహా శివరాత్రి పర్వ దినంను పురస్కరించుకొని ఆదివారము నాడు రాత్రి పది గంటల నుండి శ్రీ స్వామివారికి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11మంది అర్చక స్వాములు మహన్యాస పూర్వకంగా రుద్రమంత్రాలను పఠిస్తుండగా దాదాపు నాలుగు గంటలకు పైగా జ్యోతిర్లింగ స్వరూపుడైన శ్రీ స్వామి వారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికా గుండములోని జలంతోనూ, పంచామృతాలతోనూ,పలు ఫలోదకాలతోనూ అభిషేకం చేశారు. పెళ్లి కుమారునికి పాగాలంకరణ: లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభించబడింది. బ్రహ్మోత్సవాలలో జరిగే ఈ పాగాలంకరణ ఎంతో ప్రత్యేకత ఉంది. మన వివాహాల్లో పెండ్లి కుమారునికి తల పాగా చుట్టడం ఒక సాంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైలం ఆలయములో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈపాగ స్వామివారి గర్భాలయ విమాన శిఖరము నుండి ముఖమండపంపై ఉండే నందులను అనుసంధానం చేస్తూ అలంకరించడం జరిగింది.పాగలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేలవించి రోజుకు ఒక మూర చొప్పున సంవత్సరములు 365 మూరల పొడవుతో ఈ పాగాను నేస్తారు. ఈ పాగాలంకారాలను అలంకరించే వ్యక్తి దిగంబరుడై పాగను అలంకరిస్తాడు. దిగంబరుడై పాగను అలంకరించవలసి ఉన్నందున పాగాలంకరణ సమయములో ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. చిమ్మ చీకటిలో పాగ లంకరణ చేయడం ఎంతో నేర్పుతో కూడుకున్న పని. యధావిధిగా రాత్రి 10 గంటల నుండి ప్రకాశం జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృధ్వి వెంకటేశ్వర్లు తనయుడు పృధ్వి సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగతోపాటు ఇతర భక్తులు సమర్పించిన పాగలను కూడా స్వామివారికి అలంకరించారు.

**ఆది దంపతులకు ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం:** రాత్రి గం.12:00 లకు స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం వైభవంగా జరిపించారు. కన్నుల పండుగ జరిగిన ఈ కళ్యాణోత్సవములో స్వామివారు పట్టు వస్త్రాన్ని ధరించి తలపై ఒకవైపు గంగమ్మను, మరోవైపు నెలవంకను, మెడలో రుద్రాక్షమాలలను, నుదుట విభూది రేఖలను, పట్టు వస్త్రాలను ధరించి పెండ్లి కుమారుడుగా ముస్తాబు అయ్యారు. కాగా అమ్మవారు కూడా పట్టు వస్త్రాలను ధరించి నుదుట కల్యాణ తిలకాన్ని బుగ్గన చుక్కను సర్వాభారణాలను ధరించి పెండ్లి కుమార్తె అయి స్వామికి సరి జోడి అనిపించుకున్నారు. మంగళ సూర్యనాదాలతో వేదమంత్రాల నడుమ నేత్రానందంగా ఈ కళ్యాణోత్సవం జరిగింది. అంతకు ముందు కంకణాలను స్వామి అమ్మవారి ఆభరణాలను యజ్ఞోపవీతాన్ని బాషికలను ఊరేగింపుగా కళ్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. ఈ కల్యాణోత్సవములో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా అర్చక స్వాములు కల్యాణోత్సవం సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కల్యాణత్సవం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించబడింది. ఆ తరువాత వృద్ధి అభ్యుదయాల కోసం పుణ్యాహావాచనం చేశారు. తర్వాత స్వామివారికి మధుపర్కం సమర్పించబడి శ్రీ స్వామి అమ్మవార్లకు వస్త్రాలను సమర్పించబడ్డాయి. తరువాత భాషికా ధారణ కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత గౌరీ పూజ జరిపించబడింది. స్వామి అమ్మవార్ల మధ్య తెర సెల్లను ఏర్పరచి మహా సంకల్ప పట్టణం చేయడం జరిగింది. అనంతరం సుముహూర్త సమయములో స్వామి అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పించారు. ఆ తరువాత మాంగల్య పూజలు జరిపించి అమ్మవారికి మాంగల్య ధారణ జరిపించబడింది. తరువాత తలంబ్రాలు బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు ఆశీర్వచనాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ శరణ్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పి.రమేష్ నాయుడు, ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్, ప్రజా ప్రతినిధులు అధికారులు, అర్చక స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హరహర మహాదేవ.. శంభో శంకరా

### శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శివనామస్మరణ



క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్త జనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువ జాము 2గంటల నుంచే ఆలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బారాయుడు, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బంది తిష్టవేసి భక్తులకు సుదర్శనం కోసం ప్రయత్నించారు. డిఎస్పీ నరసింహామూర్తి, ఇక్కడ గతంలో పనిచేసిన పోలీసు అధికారులు తిమ్మయ్య, నాగార్జున్‌రెడ్డి, సంజీవ కుమార్‌లను కంచుగడప వద్ద నియమించటంతో వివాదాలకు అతీతంగా భక్తులు దర్శనానికి వెళ్ళారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సాదాసీదాగా ఓ సామాన్య భక్తుని వలె పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ గర్భగుడిలో ఆగమశాస్త్ర పండితుల సూచనల మేరకు దర్శనాన్ని సుమగమం చేసారు. ఇఓ చొరవ, కలెక్టర్ పర్యవేక్షణలో వచ్చిన భక్తులు శివరాత్రి వేళ స్వయంభువును దర్శించుకున్నారు. భక్తజనం వేకువ జామున సువర్ణముఖి నదిలో చన్నీటి స్నాచమాచరించి 'కామ్యగోపురం ద్వారా భక్తజన కోటి 'కైలాసనాధ కరుణించవయ్యా అంటూ' స్వయంభువుని దర్శించుకున్నారు. 'హర హర మహాదేవ.. శంభో శంకర అంటూ శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.

## ఓంకార జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో...



తిరుపతి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ఆదిదేవుడు పరమేశ్వరుడు మహాశివరాత్రి పర్వదినం ఎంతో విశిష్టమైందని, ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో ఆది వారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదళ్ళచెరువు గ్రామంలో వెలసిన పురాతన ఓంకార జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి భక్తులు అభిషేకించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, వజ్ర ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి బిజెపి జిల్లా నేత, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కుటుంబసభ్యులతో హాజరై స్వామివారికి సారే సమర్పించారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మహాశివరాత్రి పర్వదినాన ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి అలంకారంలో పరమేశ్వరుడ్ని, పార్వతీదేవిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్నారు. భక్తులకు అన్నీ శుభాలు జరగాలని ఆకాంక్షించారు. నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం వేడుకగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణయ్యస్వామి, చంద్రశేఖరస్వామి, సూరా రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, శింగంశెట్టి సుబ్బరామయ్య, లోక ప్రభాకర్ నాయుడు, రెడ్డప్ప, జ్యోతి, అరుణ, చంద్ర, అమారావతమ్మ, లక్ష్మి, కల్యాణి, భక్తులు పాల్గొన్నారు.



## అన్ని ఆలయాలకూ రోడ్డు సౌకర్యం

### - శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విజయవాడ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రధాని మోడీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. "ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆ పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తులందరికీ పవన్ కల్యాణ్ మరోసారి శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమి అని పవన్ కల్యాణ్ కొనియాడారు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం, శ్రీకాళహస్తి వాయులింగ క్షేత్రం, పంచారామ క్షేత్రాల విశిష్టతను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాల పవిత్రతను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41 ప్రముఖ శైవ క్షేత్రాల్లో ప్రభుత్వం అధికారికంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తోందని, ఇది తమ ప్రభుత్వ భక్తి భావానికి నిదర్శనమని డిప్యూటీ సిఎం పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గంలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాం. కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం గిరి ప్రదక్షిణ మార్గం రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు.

డబ్బు ఉన్నప్పుడు ఎడాపెడా ఖర్చు చేయడం, లేనప్పుడు ఇతరుల దగ్గర చేతులు చాచడం వల్ల మన వ్యక్తిత్వం దెబ్బతింటుంది.

-మహాత్మా గాంధీ

# సంస్కరణ వాదానికి జై

బంగ్లాదేశ్ ఏర్పాటులో భారతదేశమే అన్ని విధాలుగా అండదండలుగా ఉన్నా తర్వాత వచ్చిన పరిణామాలు, పాలకులు, వారి వారి విధానాల కారణంగా ఆ రెండు దేశాల మధ్య దూరం బాగా పెరిగిపోయింది. బంగ్లా జాతిపితగా పేరొందిన షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె షేక్ హసీనా పదవీచ్యుతి అనంతరం బంగ్లాదేశ్‌కు భారత్‌కు మధ్యదూరం పెరిగిపోయింది. ఏమాత్రం సఖ్యత లేనేలేదు. షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చామనో, మరెందు చేతనో అక్కడి తాత్కాలిక పాలకుడు నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ భారత్ మీద నిప్పులు కక్కుతున్నారు. ఇటీవల జరిగిన బంగ్లా అల్లర్లలో ముగ్గురు హిందువులను వేర్వేరు సందర్భాల్లో ఉద్యమకారులు చంపేస్తున్నా పాలకులు చోద్యంచూశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకెలాంటి రక్షణ ఉందో ఆయా సంఘటనలే చెబుతున్నాయి. హసీనా హయాంలో భారత్‌తో సన్నిహిత సంబంధాలు ఉండటం వల్లనే ఆమెకు భారత్‌లో ఆశ్రయం దొరికింది. ఇది కూడా తాత్కాలిక పాలకులకు భారత్ మీద కన్నెర్ర చేసేందుకు కారణమై ఉండవచ్చు.తాజాగా హసీనా పార్టీకి పోటీ చేసే అర్హతను లేకుండాచేసి బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిపించారు అక్కడి తాత్కాలిక అధ్యక్షుడు. నిన్నటి ఓట్ల లెక్కింపులో హసీనాతో ఎలాంటి సత్సంబంధాలు లేని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ హవా కొనసాగుతోంది. ఈసార్వత్రిక ఎన్నికలో బిఎన్‌పి అత్యధిక స్థానాలు గెలుచుకోగా, షఫీకర్ రెహమాన్ సారథ్యంలోని జమాత్ ఇస్లామీ కూటమి గెలుచుకున్న స్థానాలు తక్కువే అయినా రెండో స్థానంలో ఉంది. దాదాపు 37 ఏళ్ల పాటు బంగ్లాదేశ్‌ను మహిళలే పాలించారు. తర్వాత తొలిసారి బిఎన్‌పి చైర్మన్ తారిఖ్ రహ్మాన్ బంగ్లాదేశ్ అధికార పీఠమెక్కనున్నారు. జమాత్ ఇస్లామీ కూటమిలో దాదాపు 11పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అయినా ప్రజా బాహుళ్యం బిఎన్‌పివైపే మొగ్గు చూపింది. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటుకు జనం ఎంతగానో ఆసక్తి చూపారని పాల్గొన ఓటర్ల సంఖ్యేచెబుతోంది. ఎందుకంటే హసీనా ప్రభుత్వంపై ఒక్కసారిగా జనం తిరగబడ్డారు. హసీనా తీసుకున్న అనేక నిర్ణయాలు వారికి రుచించలేదు.నిరుద్యోగ సమస్య అవినీతి, బంధుప్రీతి వంటిఅంశాలు హసీనా ప్రభుత్వాన్ని కుదిపేసాయి. ఇండియా ఆశ్రయం పొందాల్సి వచ్చింది. తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, హింసాత్మక ఘటనలతో అట్టుడికిపోయింది. పాలకులు వాటిని అదుపు చేయలేకపోయారు. అవామీలీగ్ వంటి కొన్ని పార్టీలు ప్రాతినిధ్యం పోటీ చేసే అర్హతలను నిషేధించే ఈఎన్నికలు ప్రజాస్వామయుత ఎన్నికలు అయినా కాకపోయినా జనం బిఎన్‌పికి పట్టం కట్టారు. కనుక వారి తీర్పును శిరసావహించాల్సిందే. ఇక్కడ విశేషమేమిటంటే సార్వత్రిక ఎన్నికలతో పాటు దేశ రాజ్యాంగ సంస్కరణలు కోరే 84 ప్రతిపాదనాంశాలతో రెఫరెండం కూడా జతచేశారు. చాలా ముస్లిం దేశాలలో రెఫరెండం వంటి అంశాలు సర్వసాధారణం. ఈ రెఫరెండం పేరు జూలై నేషనల్ చార్టర్. మాజీ మహిళా ప్రధాన మంత్రి దివంగత ఖలీదా జియా పార్టీ 15ఏళ్ల తర్వాత ఆమె వారసుని నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో గద్దెనెక్కుతోందన్నమాట. మొన్నీమధ్యనే ఆమె దివంగతురాలైంది. కనుక ఆమె కుమారుడు తారీఖ్ రహ్మాన్ చేతికే పగ్గాలు లభిస్తాయి. ఒకనాడు దేశ బహిష్కరణకు గురై 15 ఏళ్ల తర్వాత ఈ మధ్యనే తారీఖ్ బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చారు. అవినీతి ఆరోపణలపై 17 నెలలు జైల్లో కూడా ఉన్నాడు.ఐనా ప్రజల్లో వచ్చిన మార్పుతోఆయనకు ఈ ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు. 2002-2006లో ఖలీదా అధికారంలో ఉన్నప్పుడు ఇండియాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు. జలజగడాలుండేవి. వాణిజ్యపరమైన ఒప్పందాలు బెడిసి కొట్టాయి. అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు ఉంది. అయితే తారీఖ్ రహ్మాన్ 'సమ్మిళిత బంగ్లాదేశ్' అనే నినాదం ఎత్తుకున్నారు.ఎన్నికల ప్రచారంలో కూడాఎలాంటి భారత్ వ్యతిరేక ప్రస్తావనలు తేలేదు. ఈ నేపథ్యంలో ఇండియా పాలకులలో విబేధించే పరిస్థితి రాకపోవచ్చు. బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత మనకు ముఖ్యం. కాగా, భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించమనే అభ్యర్థనను తీవ్రతరం చేయవచ్చు. కాగా ఇలాంటి ఆ దేశ అంశాలతో భారత్ కూడా గట్టిపట్టు పట్టకపోవచ్చు. తారీఖ్ ఘన విజయాన్ని భారత ప్రధాని మోడీ స్వాగతించారు. ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాని నరేంద్ర మోడీ భరోసా ఇచ్చారు.ఇవన్నీ భారత్ బంగ్లాదేశ్‌ల మధ్య స్నేహసౌహార్థతను పెంచే అంశాలే. బంగ్లాదేశ్‌కు, తారీఖ్ తొలి పురుష ప్రధాని యువత బిఎన్‌పికి పట్టుగా నిల బడింది. వృద్ధుల్ని సైతం 'బంగ్లా ఫస్ట్' అనే నినాదంతో ఆకట్టుకోవడం విశేషం. బంగ్లాదేశ్ ఈ మధ్యకాలంలో పాకిస్థాన్‌కు అనుకూలవైఖరి అవలంబిస్తూ భారత్ మీద వైషమ్య వ్యాఖ్యలకు అవకాశమిచ్చింది. ఈ నేపథ్యంలోనే అక్కడ హిందూ వ్యతిరేక వైఖరి బలపడింది. ఇలాంటి పరిస్థితులను క్రోడీకరించుకుని బంగ్లాదేశ్‌ను ప్రగతిబాటలో నడిపించే బాధ్యత తారీఖ్ భుజస్కంధాల మీద పడింది. భారత్ వ్యతిరేక జమాతే పార్టీ ఓటమి చెందినందున భారత్‌తో చెలిమికి బంగ్లాదేశ్‌కు ఏమాత్రం అడ్డంకి ఉండబోదు. రెఫరెండానికి 60.25శాతం ఓట్లుపడినందున దేశంలో అస్థిరతలేకుండా చేసి భారీగా ప్రజాస్వామిక సంస్కరణలు తేగలిగితే ఆయన నేతృత్వానికి సంపూర్ణ విజయం చేకూరినట్లే.

చీకట్లోనే నక్షత్రాలు కనబడతాయి. అలాగే కష్టాల్లోనే సత్యాలు గోచరమవుతాయి.



శంకరా చార్యులు

ఏదో ఒక పనిలో నిరంతరం నిమగ్నమైన వారికి కన్నీళ్లకు చోటు లేదు.



బైరన్

# ప్రజావాక్కు



### నిరుద్యోగ సేన ఉద్యమించాలి

నేడు మనదేశాన్ని పట్టిపీడిస్తున్న ముఖ్యమైన సమస్యల్లో మొదటిది సాంప్రదాయక విద్యావంతుల నిరుద్యోగ సమస్య. అన్ని సమస్యలకీ మూలకారణ మైన యువ నిరుద్యోగుల గురించి రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు గట్టిగా దృష్టి సారించటం లేదు.అందుకు కారణం వారు అసంఘటితంగా వుండి, వారిని ఓటు బ్యాంకుగా భావించక పోవటమే.కనుక అడగనిదే, అమ్మైనా పెట్టదు అనే సామెతలా ఎవరో వచ్చి,ఏదోచేస్తారని మోసపోకుండా, నిరుద్యోగులు అందరూ ఏకమై, ఖాళీగానున్న పోస్టులని తక్షణం భర్తీ చేసి,పెరుగుతున్నజనాభాకి తగ్గనిష్పత్తిలో ప్రభుత్వోద్యోగ, పోలీసు నియామకాలు చేపట్టేలా రాజకీయ పక్షాలపైనా, ప్రభుత్వాలపైనా గట్టి ఒత్తిడి తేవాలి. ఉద్యోగులపై నానాటికీ పెరుగుతున్న ఖర్చుల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాలు తగ్గిస్తున్నాయి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### ఆలోచనా శక్తి పెంచాలి

భారత విద్యావ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సినఅవసరం అత్యంత కీలకంగా మారింది.దేశంలో కోట్లాది మంది విద్యార్థులు,లక్షలాది పాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలో జిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది. చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలు వల్లె వేయడం కాదు,ప్రశ్నించడం,అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి. పాఠశాల స్థాయి నుంచే గురువులు విచారణాత్మక పద్ధతులను బోధనా ప్రక్రియలో చేర్చాలి. చిన్నపాటి అన్వేషణా పనులు, పరిశీలన ఆధారిత కార్యాచరణలు నిర్వహించాలి.

- సి.సాయిరుత్విక్, నల్గొండజిల్లా

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో మురికి కాలువలు శుభ్రం చేయడంలేదు.రోడ్లపై గుంతలు ఉన్నాయి. మిషన్ భగీరథ పైప్ లైన్లు పగిలిపోయాయి. వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామ కార్యదర్శులు, అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

-పి. నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### అగ్రస్థానంలో యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా భారత దేశం నేడు అగ్రస్థానంలో ఉంది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం భారత జనాభాలో సుమారు 66 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. ఈ యువశక్తి దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంజిన్‌లామారనుంది.అయితే రాష్ట్రాలవారీగా జనాభా మార్పులు వేర్వేరుగా ఉన్నాయి. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు 2036 నాటికి వృద్ధాప్య రాష్ట్రాలుగా మారనున్నాయని, మరోవైపు ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో పని చేసే వయస్సు గల జనాభా పెరుగుతూనే ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ నివేదికలు చెబుతున్నాయి. ఈజనాభా మార్పులవల్ల దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా, రాజకీయంగా సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు ప్రశంసలు అందాల్సిందిపోయి,కేంద్ర పన్నుల పంపిణీలో నిధుల వాటా తగ్గడం,పార్లమెంటు ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉండటం సమాఖ్య వ్యవస్థలో అసమానతలకు దారితీస్తోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వీధికుక్కల దాడులు

నగరాలు, పట్టణాల్లో వీధికుక్కల దాడులపై ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయనేది వాస్తవమే. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బాధితులవుతున్న సంఘటనలు సమాజాన్ని కలవంపెడుతున్నాయి. అయితే ఈసమస్యకు పరిష్కారం భావోద్వేగాలతో కాకుండా చట్టబద్ధమైన, శాస్త్రీయమైన విధానాల ద్వారా రావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టుగా ఈ తీర్పు తెలియజేస్తోంది. జంతు క్రూరత్వ నిరోధక చట్టం, జంతు జనాభా నియంత్రణ నిబంధనలు ఇప్పటికే అమలులో ఉన్నాయి.వీటిలో మార్పులు అవసరమైతే శాసన, కార్యనిర్వాహకవ్యవస్థల బాధ్యతగా కోర్టుస్పష్టమైన సంకేతం ఇచ్చింది.

- కె. శ్రీనివాస్, వరంగల్‌జిల్లా

### భారత్‌తో బంధం

తారీక్ గెలుపుతో బంగ్లాలో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేవనుంది. ఇన్నాళ్లు చైనా, పాకిస్థాన్‌తో అంటకాగిన తారీక్ ఇప్పుడు గతంలో జరిగిన తప్పులను క్షమించమని కోరుతున్నాడు. నిజానికి కాలీదా జియా మరణం తరవాత అయినా ఆమె అధికార ఆశయం తన కొడుకు రూపంలో అయినా నెరవేరింది. బంగ్లాదేశ్ ఇంత ప్రాముఖ్యత ఉన్న భారత్ తో తన బావి సంబంధాలు ఎలా ఉంటాయి అన్నది చూడవలసిందే.

-భారత అవినాష్, జనగామ

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశంలో 'స్వచ్ఛ' రాజకీయాలు అవసరం

**అంతర్జాతీయంగా కూడా స్నేహం, నైతికతలకు తిలోదకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మనదేశం ఆధ్యాత్మికతకు ఆదర్శప్రాయం గా ఉన్న దేశం నైతిక మార్గాన్ని చూపక తప్పదు.మనదేశం ఈవిధంగా విలువలకు ప్రాతినిధ్యం ఇచ్చే అడుగులు వేయా లంటే మన ఇంట్లోనే అడుగుజాడలు సరిగ్గా ఉండేట్లు చూడక తప్పదు.రాజకీయాలు ఉండకతప్పదు. ప్రజాస్వా మ్యంలో రాజకీయం ప్రధాన పాత్ర వహిస్తుంది. కానీ రాజకీయాలంటే ప్రజల పురోగతి కోసం ప్రజాసేవ కోసం అనుసరించే మార్గం.తిట్లకూ శాపనార్థాలకూ వ్యక్తుల వివాదాలను రాజకీయ వివాదాలుగా మార్చి కుల,మత, ప్రాంతీ యతలను ఆపాదించి,అసలుకే ఎసరు పెట్టటంకాదు. ప్రజల కోసం రాజకీయం స్వచ్ఛంగా చేయాలి. స్వయం సంపాదన కోసం చేసేది రాజకీయం కాదు. అరాజకీయం.**



రావులపాటి సీతారాం రావు

రాజకీయాలు రంగుల రాట్నంగా మారాయి. కుదురుగా ఒక పార్టీలో ఉండే వాళ్లు అరుదయ్యారు. చక్రంలో రంగు ఎటు కనపడితే అటు దూకే పరిస్థితి ఏర్పడింది. కొన్ని సంవత్సరాల క్రిందట దేశంలో స్వతంత్ర గాలులు వీచిన వేళ పార్టీలు మారటం నేరం కన్నా నామర్దాగా భావించేవారు. రాజగోపాలాచారి స్వతంత్ర పార్టీని ఏర్పరిచిన కారణం అప్పటి ప్రధాని అధికారంలో ఉన్న పార్టీ మీద అలిగి కానీ, కోపంతో కానీ కాదు! బలమైన ప్రతిపక్షం ఉంటేనే అధికార పక్షం దారి తప్పదు అన్న ఏకైక సూత్రంతోనే ఆయన పార్టీని పెట్టారని అప్పటి వారు ఆ రోజుల్లో జ్ఞాపకం చేసుకొనేవారు. ఆయన పార్టీ నడిపినంత కాలం ప్రతిపక్షం నిర్మాణాత్మకంగానే వ్యవహరించింది. ప్రతిపక్ష ప్రభావం ఎలా ఉండేదంటే నేను ఏ తప్పు చేస్తానో, చూసి సరిదిద్దడానికి దక్షిణ దేశంలో ఒకాయన ఎప్పుడూ ఎదురు చూస్తూనే ఉంటాడు. నేను మాత్రం సాధ్యమైనంతవరకూ ఆ అవకాశం దక్కనివ్వను అని నెహ్రూ అనేవారని ఆ రోజుల్లోని రాజకీయాల వ్యవహార శైలి తెలిసిన వారు చెప్పేవాళ్లు. అవన్నీ ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటూనే ఉంటారు. (ఓల్డ్ గార్డ్ రూం ఈజ్ ఎంప్టీ నౌ గాడ్ సేవ్ ది నేషన్) జవహర్‌లాల్ నెహ్రూ చనిపోయిన మరుక్షణమే రాజాజీ ఆ విధంగా వాపోయి నివాళులర్పించారు. అదీ వారి సాన్నిహిత్యం! వ్యక్తుల మధ్య స్నేహం అలాగే ఉండేది. సమస్యలు మాత్రమే విబేధాలకు కారణమయ్యేవి. విరోధాలకు కాదు! ఎక్కడో లోక్‌సభలో వెనక బెంచీలో ధారావాహికంగా మాట్లాడుతున్న అప్పటి ప్రతిపక్షంలోని నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పాయ్‌ని చూసి ఎప్పుడో ఒకప్పుడు ఆ యువకుడు ఈ దేశానికి ప్రధాన మంత్రికాగలడు అని అప్పటి ప్రధాని జవహర్‌లాల్ భవిష్యత్ వాణిని వినిపించారట! అన్ని పార్టీలను కూడదీసి, ఎమర్జెన్సీ విధించినందుకు గాను, పెద్ద యుద్ధమే చేసిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ దగ్గరకు ఓడిపోయిన ఇందిరాగాంధీ ఓదార్పు కోసం ఆశ్రయం కోరి అక్కడ కొద్ది కాలం గడిపిందని చరిత్ర చెబుతున్నది. ప్రధాని పి.వి నర్సింహారావు ప్రత్యేకంగా ప్రతిపక్షంలోని వాజ్‌పాయ్‌ను భారతదేశ ప్రతినిధి వర్గానికి నాయకుడిగా, మనదేశానికి ప్రాతినిధ్యం వహించటానికి సగౌరవంగా పంపిన విషయాన్ని ఇప్పటికీ దేశంలోని పార్టీల మధ్య అంశాలను బట్టి విబేధాలు ఉండొచ్చు కానీ విరోధాలు ఉండకూడదు అని అనుకొనే విజ్ఞులు, నెమరు వేసుకుంటూనే ఉంటారు. అంతెందుకు ప్రధానమంత్రి వాజ్‌పాయ్‌కి సెంట్రల్ హాల్‌లో జవహర్‌లాల్ ఫొటో గోడమీద కనపడకపోయేసరికి అంతులేని కోపం వచ్చిందట. ఆ ఫొటోను గోడకు తగిలించేంత వరకూ ఆయన ఊరుకోలేదని లోక్‌సభలోని అధికారులు జ్ఞప్తికి తెచ్చుకుంటారు. ఈ సాంప్రదాయాలు ఎక్కడికి పోయాయి? రాజకీయాలంటే నీచమైన తిట్ల పురాణం విప్పి, మహిళలను కూడా వినరాని, వినలేని పదజాలంతో తిట్టటమేనా? చీటికి మాటికి ప్రజల విషయాలు కాకుండా



నువ్వెంత అంటే నేనంత అని బజారు భాషను జాతీయ భాషగా మార్చి వీధికుళాయి తగాదాలు మాదిరి పవిత్రమైన అసెంబ్లీలలో పార్లమెంట్‌లో కూడా ఉచ్చనీచాలు మరిచి వ్యక్తిగత ద్వేషాలతో తిట్ల వస్త్రాలు ఉతికి నడిబజార్లో ఆరేసుకోవటమేనా? ఆధునిక యుగం డిజిటల్ యుగం, అంతరిక్ష యుగం పరిశోధనలో అత్యంత వేగవంతంగా అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధించామని మనదేశమే కాదు, అన్ని దేశాలు కూడా రొమ్ము విరుచుకొని చెబుతున్న ఈ కాలంలో ఇదెక్కడి వైపరీత్యం? మానవ సంబంధాలలో ఇంత అట్టడుగుకు ఎందుకు దిగజారారు? నైతికతను పాతరేసి అవకాశ రాజకీయాలు, ఎన్నికల రాజకీయాలు సాగించడానికి ఏదో విధంగా గెలుపుగుర్రాన్ని అధిరోహించి ఎన్నుకున్న జనాల మీదనే స్వారీ చేయటానికా? సోవియట్ రష్యా ముక్కలయింది. రష్యా, ఉక్రెయిన్‌ల పోరు మొదలైంది. పాకిస్థాన్ రెండుగా చీలి బంగ్లాదేశ్ ఉద్భవించింది. ఇప్పుడిప్పుడే బలూచిస్థాన్, పాకిస్థాన్‌లోని అంతర్భాగంలో నిప్పు రాజుకొంది. ఒకప్పటి పాకిస్థాన్‌లోని ఈ మూడు ప్రాంతాలలో నిప్పు సెగంటుకొని, జ్వాలలు లేస్తున్నాయి. భారత్ పాకిస్థాన్ విడిపోయిన తర్వాత చరిత్రలోని మలుపు ప్రపంచమంతటా యు.ఎన్.ఓతో సహా అందరికీ తెలిసినదే. అత్యంత సుందర ప్రదేశం కాశ్మీర్‌ను ఇండియాలోని అంతర్భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకోటానికి చేస్తున్న యుద్ధాలు కొత్తగా ఉగ్రవాద అస్త్ర ప్రయోగాలు జగమెరిగిన సత్యమే. తాలిబన్లను దగ్గరకు తీసి ఉగ్రవాదాన్ని ప్రేరేపించిన పాకిస్థాన్‌కు తాలిబన్లే బుద్ధి చెబుతున్నారు. అఫ్ఘానిస్థాన్ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొని పాకిస్థాన్‌పైనే పంజా విసరటానికి సిద్ధంగా ఉన్నారు. హిందీ- చీనీ భాయి,భాయి అన్న చైనా నక్క జిత్తుల ప్రయోగం ఇండియా ముందు పనికి రాలేదు. దొంగచాటుగా, మరో విధంగా సరిహద్దు సమస్యలు సృష్టించి భారత్‌ను చిన్నాభిన్నం చేయాలని ప్రయత్నించిన ఆ దేశానికి భారత్ మింగుడుపడలేదు. చేసేదిలేక ప్రస్తుతం అనుకూల శత్రువుగా మారింది. యుఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండవసారి ఎన్నిక కాగానే టక్కుటమార విద్యల ప్రావీణ్యత ప్రదర్శించటంతో దాదాపు అన్ని దేశాలూ ముక్కున వేలేసుకున్నాయి. అయితే ట్రంప్ తన దేశంలోని అక్రమ వలసదారుల మీద ఉక్కుపాదం పెట్టి తరిమేసే కార్యక్రమంతోపాటు, తమ దేశంలోని ఉద్యోగాలన్నీ ఇతర దేశస్థులు వలసదారులుగా మారి లబ్ధి పొందటంతో తన దేశ బాగుకోసం, కఠినతరమైన నిబంధనలలో, ఆర్థికపరమైన కొత్త నిబంధన 'టారిఫ్' అనే ఆయుధాన్ని వదిలాడు. ఆ దెబ్బకు చాలా దేశాలు దిగొచ్చాయి.పాలస్తీనా, ఇరాన్, మలేసియా, చైనా, భారత్ దేశాలను అనుకూలంగా మార్చుకోటానికో, తన పాలన పటిష్ట పర్చుకోటానికో అనేక రకాల ప్రయోగాలు చేస్తున్న నేపథ్యంలో భారత్ ఒక ఇంటరిం ఎగ్రిమెంట్ కుదుర్చుకొని ఆర్థికంగా కొంత ఊరట పొందే ప్రయత్నంలో ఉన్నది. అంతర్జాతీయంగా కూడా స్నేహం, నైతికతలకు తిలోదకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మనదేశం ఆధ్యాత్మికతకు ఆదర్శప్రాయంగా ఉన్న దేశం నైతిక మార్గాన్ని చూపక తప్పదు.మనదేశం ఈవిధంగా విలువలకు ప్రాతినిధ్యం ఇచ్చే అడుగులు వేయాలంటే మన ఇంట్లోనే అడుగుజాడలు సరిగ్గా ఉండేట్లు చూడక తప్పదు.రాజకీయాలు ఉండకతప్పదు. ప్రజాస్వామ్యంలో రాజకీయం ప్రధాన పాత్ర వహిస్తుంది. కానీ రాజకీయాలంటే ప్రజల పురోగతి కోసం ప్రజాసేవ కోసం అనుసరించే మార్గం.తిట్లకూ శాపనార్థాలకూ వ్యక్తుల వివాదాలను రాజకీయ వివాదాలుగా మార్చి కుల,మత, ప్రాంతీయతలను ఆపాదించి,అసలుకే ఎసరు పెట్టటంకాదు. ప్రజల కోసం రాజకీయం స్వచ్ఛంగా చేయాలి. స్వయం సంపాదన కోసం చేసేది రాజకీయం కాదు. అరాజకీయం. •

# పట్టణ అభివృద్ధికి ప్రజల గ్రీన్ సిగ్నల్


తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాజకీయ పరిపక్వతకు మరో అధ్యాయం చేరింది. తెలంగాణ రాష్ట్రంలో జిహెచ్ఎంసి మినహా 116 మున్సిపాలిటీలకు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా గ్రామీణపట్టణ స్థానిక స్వపరిపాలన వ్యవస్థకు ప్రజలు మరోసారి తీర్పునిచ్చారు. స్థానిక సంస్థలు ప్రజాస్వామ్యానికి పునాది రాళ్లైతే, ఈ ఎన్నికలు ఆ పునాదిని మరింత బలపరిచే ప్రక్రియగా భావించాలి. మున్సిపాలిటీలలో మొత్తం 2582 వార్డులు ఉండగా అందులో 12 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడటం గమనార్హం. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడటం పరిపాలనా సాంకేతిక అంశమే అయినప్పటికీ, మిగతా వార్డులన్నింటిలో పోటీ వాతావరణం నెలకొనడం ప్రజాస్వామ్య ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తుంది. అదే విధంగా ఏడు కార్పొరేషన్లలో 414డివిజన్లు ఉండగా అందులో రెండు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, మిగిలిన 412 డివిజన్లకు ఈ నెల 11న పోలింగ్ జరగడం ప్రజల చైతన్యాన్ని చాటిచెప్పింది. 13వ తేదీన వెలువడిన ఫలితాలు ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా ప్రతిఫలింపజేశాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణ రాజకీయ పోటీ కాదని గుర్తించాలి. ఇవి ప్రజల దైనందిన జీవితానికి నేరుగా సంబంధం ఉన్న పాలనా వ్యవస్థను నిర్ణయించే ఎన్నికలు. తాగునీరు,పారిశుధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, పట్టణ ప్రణాళికలు అన్నీ మున్సిపల్ పాలన పరిధిలోకి వస్తాయి. అందువల్ల ఈఎన్నికల్లో ప్రజలు అభ్యర్థుల వ్యక్తిత్వం,అందుబాటు, సేవాభావం, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 16వ తేదీన ఉదయం 116 మంది మున్సిపల్ చైర్మన్‌లను, 116 మంది వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం జరుగనుంది. అలాగే ఏడు కార్పొరేషన్లకు ఏడుగురు మేయర్లు, ఏడుగురు డిప్యూటీ మేయర్లు ఎన్నికై అదే రోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రక్రియతో కొత్త పురపాలక వర్గాలు అధికార బాధ్యతలు స్వీకరించనున్నాయి. ప్రజలు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ఇప్పుడు ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఉంది. ఎన్నికల ఫలితాలు ఎవరికి అనుకూలంగా వచ్చినా, స్థానిక పాలనలో ప్రధాన ధ్యేయం రాజకీయ ప్రతిష్ట కాదు ప్రజా సేవ. మున్సిపాలిటీలు,కార్పొరేషన్లు అభివృద్ధి యంత్రాంగాలుగా మారాలి. పట్టణాల విస్తరణ వేగంగా జరుగుతున్న ప్రస్తుత సందర్భంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అత్యవసరం. నియంత్రణలేని నిర్మాణాలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, వర్షాకాలంలో ముంపు సమస్యలు వంటి అంశాలు పట్టణాల ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. కొత్తగా ఎన్నికైన నాయకత్వం దీర్ఘకాలిక దృష్టితో ముందుకు సాగాలి. ప్రత్యేకంగా ఆర్థిక నిర్వహణ కీలకం. స్థానిక సంస్థల ఆదాయ వనరులను పెంచడం,పన్నుల వసూళ్లలో పారదర్శకత, ప్రభుత్వ నిధుల సమర్థ వినియోగం ఇవి అన్నీ సమన్వయంతో నడవాలి. ప్రజలకు సేవలు అందించడంలో సాంకేతికతను వినియోగించడం ద్వారా పారదర్శకతను పెంచవచ్చు. ఆన్‌లైన్ సేవలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, ప్రజలతో ప్రత్యక్ష సంప్రదింపులు ఇవి ప్రజా విశ్వాసాన్ని పెంచుతాయి. అదేవిధంగా రాజకీయ విభేదాలు పరిపాలనకు అడ్డంకిగా మారకూడదు. మున్సిపల్ కౌన్సిల్లు,కార్పొరేషన్ సభలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలకు వేదిక కావాలి. ప్రతిపక్షం సూచనలు ఇవ్వాలి. అధికార పక్షం వాటిని సమగ్రంగా పరిగణించాలి. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన వాదోపవాదాలు అవసరం కానీ అభివృద్ధి పనులు నిలిచిపోవడం సమంజసం కాదు. మహిళలకు, పేదలకు, అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనిచ్చే విధానాలు స్థానిక సంస్థల ద్వారా అమలవుతాయి. పట్టణ పేదల గృహవసతి, ఉపాధి అవకాశాలు, చిన్న వ్యాపారాల ప్రోత్సాహం,స్వచ్ఛత కార్యక్రమాలు ఇవి అన్ని కొత్త బోర్డుల కార్యాచరణలో ప్రధాన స్థానాన్ని పొందాలి. పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముఖ్యమైనది. చెట్ల పెంపకం, సరస్సుల సంరక్షణ, ప్లాస్టిక్ నియంత్రణ వంటి చర్యలు పట్టణాల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు ఇచ్చిన సందేశం స్పష్టమైనది. స్థానిక పాలన ప్రభావవంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలి.ఎన్నికైన ప్రతినిధులు ప్రజల మధ్య ఉండాలి.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తేవాలి. ప్రజలు ఐదేళ్లకు ఒకసారి మాత్రమే కాకుండా ప్రతిరోజు పాలననుమూల్యాంకనం చేస్తారు. మొత్తానికి, 16వ తేదీ ప్రమాణ స్వీకారంతో కొత్త పురపాలక వర్గాలు కొలువుదీరనున్నాయి. ఇది కేవలం అధికార స్వీకారంకాదు ప్రజలవిశ్వాసాన్ని నిలబెట్టుకునే సంకల్పం.ప్రజాస్వామ్య పండుగ విజయవంతంగా ముగిసిన ఈ దశలో, అభివృద్ధియుగానికి శ్రీకారం చుట్టే బాధ్యత ఇప్పుడు ఎన్నికైన నాయకత్వంపై ఉంది.వారు సమగ్ర దృష్టితో, పారదర్శక పరిపాలనతో ముందుకుసాగాలి. •

# ఇకనైనా విశ్వవిద్యాలయాల్లోకి ఆచార్యులొచ్చేనా?

డా.పోలం సైదులు

దేశాభివృద్ధిలో విద్య ప్రాధాన్యత గురించి వేరే చెప్పనక్కరలేదు. అందులో ప్రామాణికత కలిగిన ఉన్నతవిద్య ఎంతో అవసరం. అందుకే దేశవ్యాప్తంగా 1338 విశ్వవిద్యాలయాలుంటే అందులో 56 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 416కి పైగా వివిధ రాష్ట్రప్రభుత్వ పరిధిలోగల విశ్వవిద్యాలయాలు, 130కిపైగా డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, 430కిపైగా ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఇంకా పలు జాతీయ, రాష్ట్ర విద్యాసంస్థలు నెలకొనగా అందులో 43 మిలియన్ విద్యా ర్థులు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు.ఒక విశ్వవిద్యాలయం పరిపూర్ణంగా పనిచేయాలంటే దానికి యూనివర్సిటీగ్రాంట్స్ కమిషన్ నుంచి వచ్చేనిధులు, ప్రభుత్వ నిధులు సకాలంలో అందాలి. అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ప్రయోగ వసతులు పూర్తిస్థాయిలో ఉండాలి. వీటితోపాటు విద్యార్థులకు తమ విద్యనభ్యసించుటలో భాగంగా ఏలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో స్కాలర్షిప్స్ ఫెలోషిప్‌లు అందాలి. అందులో భాగంగానే దేశవ్యాప్తంగానున్న విశ్వ విద్యాలయాలల్లో ఖాళీగానున్న ఆచార్య, సహాచార్య కొలు వులభర్తీ ప్రక్రియను మొదలుపెట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ కోరి సంవత్సరాలు గడిచిపోతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపడితే, ఆ తర్వాత 2014లో తెలంగాణ నూతనంగా రాష్ట్రంగా సిద్ధించాక ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో యూనివర్సిటీ కొలువుల రిక్రూట్మెంట్‌కు సంబంధించి1061 పోస్టుల భర్తీకి అనుమతినిస్తే,అప్పటి గవర్నర్ దానిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితేపెండింగ్‌లోకి పడిపోయింది.అప్పటినుండి ఇప్పటివరకు యూనివర్సిటీ కొలువుల నోటిఫికేషన్‌ను నోచుకోలేని పరిస్థితి దాపురించింది. కొలువులొస్తాయనే కోటి ఆశలతో విద్యార్థులు ఉద్యమంలో పాల్గొని సాధిస్తే ముమ్మాటికీ వారిఆశలు నిరాశలే అయ్యాయని చెప్పడంలో ఎలాంటి అనుమానంఅక్కరలేదు. రాష్ట్రంలో అభివృద్ధికని చెప్పుకునే ఎన్ని కార్యక్రమాలు చేపట్టిన,ఎంత పేరు ప్రఖ్యాతులు గావించిన,నియామకాల విషయంలో మాత్రం నిరుద్యోగులపాలిట శాపంగానే మారిపోయిందని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రంలోనున్న 11 యూనివర్సిటీలలో భోదనసిబ్బందికి సంబంధించి 2878 పోస్టులుంటే అందులో కేవలం 753 రెగ్యులర్ సిబ్బంది పనిచేస్తున్నారు. అంటే 2125 పోస్టులు (74శాతం) ఖాళీగా ఉన్నాయి. పరిశోధక విద్యార్థులకు గైడ్‌గా కొనసాగాలన్నా, నాణ్యమైన పరిశోధకపత్రాలను సమర్పించాలన్నా, కేంద్రం నుండి ప్రాజెక్టులు నిధులు రావాలన్న ప్రొఫెసర్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కానీ అన్నీ యూనివర్సిటీలలో



చాలా డిపార్ట్మెంట్‌లలో ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్ లేకపోవడం శోచనీయం. రాష్ట్రంలో అన్నీ యూనివర్సిటీలలో కలిపి 393 ప్రొఫెసర్లకు 212 ఖాళీలు,913 అసోసియేట్ ప్రొఫెసర్లకు 792 ఖాళీలు,1572 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 1114 ఖాళీలున్నాయంటే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నదో అర్థమవుతుంది.పదివేలమంది విద్యార్థులున్న ఆర్జియుకేటిలో 146 సాంక్షన్ పోస్టులుంటే 19మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది పనిచేయడం విడ్డూరమైతే,అందులో సైతం కొందరు సెలవులలో ఉండటం గమనార్హం.ఇంచుమించు మిగతా యూనివర్సిటీలలో కూడా అదేతంతు కొనసాగుతుండడం చూస్తుంటే గత దశాబ్దన్నర కాలంగా యూనివర్సిటీలలో చదివే విద్యార్థులకు ఎలాంటి విద్యను అందిస్తున్నామో అవగతమవుతుంది.ప్రత్యేకంగా యూనివర్సిటీలలో ఆచార్య కొలువులకు అర్హతలెలా ఉండాలో గతంలోనే హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆచార్య ఘంటా చక్రపాణి నేతృత్వంలో నియమించిన కమిటీ పరిశోధించి నివేదికను రచించి అందులో అర్హతలకు సంబంధించి డాక్టర్ అఫ్ ఫిలాసఫీ పూర్తిచేయాలి లేదా నెట్,సెట్,జేఆర్ ఎఫ్క్వాలిఫైడ్ అయ్యివుండి,అకాడమీక్ రికార్డ్,రీసెర్చ్ పెరఫార్మెన్స్,టీచింగ్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ ఆధారంగా నియమించాలని నివేదికను ప్రభుత్వానికి అందించడం జరిగింది. కానీ కాంట్రాక్ట్ సిబ్బంది తమకు న్యాయం చేయాలనే డిమాండ్‌ను తెరమీదకు తేవడంతో నియామకాలు చేపట్టకుండా ఆపివేయశారు.దాదాపు ఈ అర్హతలు సాధించాలంటే 30 నుండి 40 సంవత్సరాలు వయసు పడుతుంది.ఇలాంటి పోస్టులను గతంలో భర్తీచేసి దశాబ్దన్నరకాలం గడిచిన మరల అంతటి అదృష్టాన్ని నోచుకోలేకపోయిందని చెప్పవచ్చు.అంటే అభ్యర్థులకు వారికి పదవీవిరమణ వయసువచ్చిన ఆశ్చర్యపోనక్కరలేదు. ప్రభుత్వాలు తలుచుకుంటే ఇది పెద్దసమస్య కానే కాదు. కానీ కారణాలు మాత్రం సగటు మనిషికి ఒకింత అనుమానాన్ని కలిగిస్తాయని చెప్పవచ్చు.మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొలువుల భర్తీచేస్తే తెలంగాణ ప్రాంతంవారికీ అన్యాయం జరుగుతుందని భావించి, ప్రతివిద్యార్థి ఉద్యమంలో పాల్గొని,తెలంగాణ ఆవిర్భావంలో విద్యార్థులు, నిరుద్యోగులు కీలకపాత్ర పోషించారని యావత్తు ప్రపంచానికి జగమెరిగిన నగ్నసత్యమే. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ముందుగా యూనివర్సిటీలకు శాశ్విత వైస్ ఛాన్సలర్ లేమితో రోస్టర్ సిస్టమ్‌ను త్వరగా చేయడానికి కుదరలేదని తర్వాత కొంతకాలానికి అన్నీ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ లను నియమించి,యూనివర్సిటీలు సక్రమంగా నడవడానికి కృషిచేస్తన్నట్లు,రేపోమాపో భర్తీప్రక్రియ పూర్తవుతుందన్నట్లు దినపత్రికల్లో ప్రకటనలు కాస్తా ఎదురుచూసే అర్హులకు భరోసా ఇచ్చినట్లు కనిపించాయి. కానీ సాంకేతిక పరమైన కారణాలతో ఖాళీల భర్తీకి నోచుకోలేదు. చూస్తుండగానే రెండుసంవత్సరాల వీసీల పదవీకాలం ముగిసి, కొంత కాలం మరల ఇంచార్జ్ ఐఎఎస్ ఆఫీసర్‌లతో నెట్టుకొచ్చారు.రెగ్యులర్ ఉపకులపతులున్నప్పుడే సాధ్యపడని పనులు, ఇంచార్జ్‌ల పాలనలో పనివత్తిడి కారణంగా సరైనదృష్టి కేంద్రీకరించలేకపోయరన్నారు.చూస్తుండగానే రెండు పర్యాయాలు బిఆర్ఎస్ పార్టీ పాలన కొనసాగించింది.రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపకులపతుల నియామకం చేపట్టింది.మరల వారి పదవులు ముగిసేసమయం ఆసన్నమవుతున్నా కాలయాపనే జరుగుతుంది. •

# శంకరమఠంలో లింగోద్భవ అభిషేకాలు



**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కృష్ణలంక,శంకరమఠంలో వేంచేసి యున్న దేవదేవునికి పురోహితులు కప్పగంతుల లక్ష్మీపతిశర్మ(పండు) విశేషాభిషేకాలను నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుండే 4.30 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం,మధ్యాహ్నం,సాయంత్రం అభిషేకాలను నిర్వహించడంతో పాటు రాత్రి 10 గంటలకు పార్వతీ కళ్యాణం నిర్వహించారు. అర్థరాత్రి 12 గంటల నుండి లింగోద్భవ అభిషేకాలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి అభిషేకాలలో పాలుపంచుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు ప్రసాద్ శర్మ,గణపతి తదితరులు పాల్గొని పూజాదికాలను నిర్వహించారు.

## యనమలకుదురు శివాలయంలో ప్రత్యేక పూజాదికాలను నిర్వహించిన సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా యనమలకుదురు శివాలయం నందు సిపి రాజశేఖరబాబు కుటుంబ సమేతంగా దర్శనం చేసుకొని



ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. దర్శన అనంతరం కృష్ణాజిల్లా ఎస్పి విద్యాసాగర్ నాయుడుతో కలిసి యనమలకుదురు శివాలయం,పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్థు ఏర్పాట్లను పర్యవేక్షించి బందోబస్థులో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

**వత్సవాయి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** వత్సవాయి మండలం లింగాల గ్రామంలో మహాశివరాత్రి సందర్భముగా వేలాది మంది భక్తులు మున్నేరులో పుణ్య స్థానాలు ఆచరించి మహా శివుని దర్శనించుకొని ప్రత్యేక అభిషేక భక్తులకు అందుతున్న సౌకర్యాల గురించి పరిశీలించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ



పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో జల్లు స్నానాలు ఆచరించి ఆలయ ఆవరణలో ఉన్న వాయు లింగానికి అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్దన్ ఈ శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణ అంతా తిరుగుతూ ఉత్సాహాన్ని కనపరిచారు. ఇదేవిధంగా మండలంలో వత్సవాం, ఇందుకుపల్లి మక్కపేట కొంగర మల్లయ్య గుట్ట భీమవర, ఖమ్మంపాడు పోలంపల్లి మంగోల్లు తదితర గ్రామాల్లో శివాలయాల్లో ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.

## మక్కా మదీనా మహాయాత్ర యాత్రీకులకు ప్రత్యేక శిక్షణ

**ఎ కొండూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** ప్రపంచంలో అత్యంత పవిత్రమైన మక్కా మదీన మహాయాత్ర కాషానా యె రహమత్



టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 18న 40మంది హజ్ ఉమ్రా యాత్రకు పవిత్ర రంజాన్ నెలలో విజయవాడ భవానీపురం దర్గా నుండి బయలుదేరి శంషాబాద్ విమానాశ్రయం నుండి విమానంలో జిద్దాలో దిగి అక్కడ నుండి మక్కా మదీనా చేరుకొని ఈ ఉమ్రా హజ్ యాత్ర ప్రారంభిస్తారని ఎస్ఎం సల్మాన్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ ఉమ్రా హజ్ యాత్రీకులకు ఆదివారం విజయవాడ గొల్లపూడిలోని కాషానయె రహమత్ కార్యాలయంలో నిర్వాహకులు ఎస్ఎం యజ్దాన్, సూఫీ సేవా సదన్ చైర్మన్ ఎస్ ఎం ఫైజాన్, సల్మానన, డాక్టర్ లుక్మాన్లు పాల్గొని ఆదివారం హజ్ యాత్రీకులకు హజ్ ఉమ్రా యాత్రలో పాటించాల్సిన నియమాలపై వీరికి శిక్షణనిచ్చారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ


నందిగామ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: వాసవి క్లబ్ నందిగామ వారి ఆధ్వర్యంలో కూడలి సంగమేశ్వర స్వామి వారి దేవస్థానం నందు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్ పులిపాటి వెంకటేశ్వరరావు రిబ్బన్ కట్చేసి ప్రారంభించడం జరిగింది. ఈ



సందర్భంగా సుమారు 4500 మందికి మజ్జిగ పంపిణీ చేపట్టడం జరిగినది.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పబ్బతి రాజేష్ కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు ప్రోగ్రామ్ కన్వీనర్ కేతేపల్లి ఆంజనేయులు దుడ్డు నాగేశ్వరరావు మారం అమరయ్య జల్లా రవి, దేవత వెంకటేశ్వరరావు, వందనపు అయ్యప్ప, కోటి సూర్యం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరానికి విశేష స్పందన

**తిరువూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** గత 13 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక తిరువూరు ఆధ్వర్యంలో నాగార్జున పాఠశాలలో నిర్వహిస్తున్న బి.పి, షుగర్, ఫిట్స్ల రెగ్యులర్ వైద్యశిబిరానికి వివిధ ప్రాంతాల నుండి 1000 మంది హాజరయ్యారు. వీరికి రెండు వందల రూపాయలకే రెండు నెలలకు సరిపడ మందులను అందచేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బి.పి, షుగర్లు కేవలం మందులతోనే నియంత్రణలోకి రావని, సరైన ఆహార నియమాలను పాటిస్తూ వ్యాయామం చేయడం ద్వారానే నియంత్రణలో ఉంటాయని, వరి, గోధుమ వంటి వాటిని ఒక పూటకే పరిమితం చేసి రాగులు, జొన్నలు,



సజ్జలు వంటి తృణ ధాన్యాలను వినియోగించాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో వైద్యులు డా.సత్య తేజ డా.రవీంద్ర డా.శివాజీ డా.బి.అనిషా రాయ్ మరియు మదర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ విద్యార్థులు జనవిజ్ఞాన వేదిక నాయకులు వాలంటీర్లుగా పాల్గొన్నారు.

# విజయవాడ వార్త

# భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**నందిగామ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా పేరుగాంచిన నందిగామ మండలం దామలూరు కూడలి శ్రీ సంగమేశ్వర స్వామి



ఆలయంలో మహాశివరాత్రి తిరణాల పురస్కరించుకుని తెల్లవారుజామున మూడు గంటల నుండి కూడలి వైరా కట్లేరు సంగమంలో భక్తులు పుణ్యాస్నానాలు ఆచరించి స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. సంగమేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు దాములూరు శ్రీనివాస్ శర్మ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు అర్చనలు హోమాలు బలిహరణ వేదోక్తంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల పలు ప్రాంతాల నుండి భక్తులు వాహనాల్లో పెద్ద ఎత్తునతరలి రావడం విశేషం కూడలి సంగం వద్ద పితృదేవతలకు పిండ ప్రధానం దేవర్లకు పూజలు జంగమయ్య గంట నాదం శంఖారావం, శివనామస్మరణతో కూడలి ప్రాంతం మారుమోగింది. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కళ్యాణ్ ఆలయ ఈవో నారాయణ నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు ధర్మకర్తల మండలి సభ్యులు సంగమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచినీరు మజ్జిగ పంపిణీ, దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ ఆలయ అధికారులు కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఏసిపి బాలగంగాధర్తిలక్ ఆధ్వర్యంలో ఎస్హెచ్ఓ లచ్చు నాయుడు రూరల్ సీఐ చవన్. పలు ప్రాంతాలపోలసు అధికారులు సిబ్బందితో పాటు రెవెన్యే అధికారులు సిబ్బంది వాహనాల పార్కింగ్ స్థలాలుతోపాటు ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేశారు. ఆదివారం ఉదయం పది గంటల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు సంగమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మండుటెండ లెక్కచేయకుండా క్యూలైన్లో బారులు తీరి స్వామివారిని దర్శించుకన్నారు. నందిగామ మండల పరిధిలోని దామలూరు రాఘవాపురం రామలింగేశ్వర స్వామి ఆలయం, గొల్లమూడి శంభు లింగేశ్వర స్వామి ఆలయం, సోమవరం సోమేశ్వర స్వామి ఆలయం మునీడి తీరానగల విజ్ఞాన నందీశ్వర స్వామి దేవాలయం భవానీ శంకర్ స్వామి దేవాలయాలలో స్వామివారికి పంచామృత అభిషేకాలు పుష్ప బిల్వ అర్చన పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

# శివనామస్మరణతో మారుమ్రోగిన యనమలకుదురు

**పెనమలూరు ఫిబ్రవరి15,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఓం నమ:శివాయ అని భక్తుల శివనామస్మరణతో యనమలకుదురు గ్రామమంతా మారుమ్రోగింది.శ్రీశ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణప్రభ మహోత్సవం సందర్భంగా లక్షలాది మంది భక్తులు శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఆలయంలో ఉదయం 5గంటల నుండే ప్రత్యేకపూజలు నిర్వహించారు.చరిత్ర కలిగిన రామలింగేశ్వరస్వామి ఆలయానికి పరశురాముడు వేయిమునులతో కలసి వచ్చాడని కృష్ణానది ఏటితీరాన వారితో తపస్సు చేసాడని కనుకనే వేయిమునులకుదురుగా ప్రసిద్ధి అయితే కాలక్రమేణా అది యనమలకుదురుగా మారిపోవడం గమనార్హం.భక్తులందరూ ఆలయంలో నిర్వహించే పూజలకు హాజరై కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకొని పవిత్ర స్నానమాచరించుకున్నారు.మహాశివరాత్రి జాగరణ ఆధ్యాత్మికకోణంలో రాత్రంతా కార్యక్రమాలతో అలరించనున్నారు.రాత్రికి శివయ్య ప్రభోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆకాశాన్నంటే ఎత్తున్న రంగవల్లుల ప్రభలు, కోటి తేజోమయ దివ్యకాంతులుతో విరాజిల్లుతున్న ప్రభవెలుగులు రాత్రి జాగరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ జాతర జాగరణలో విచిత్రవేషధారణలు, పలురకాల డప్పువాయిద్యాలు,



కోలాటాలు,సాంప్రదాయ నృత్యాలు,సినీగీతాలు జాతరలో ఉత్సాహానిచ్చాయి.ఆలయనిర్వాహకులు ఉర్పాటుచేసిన క్యూలైన్లలో బారులుతీరి ప్రశాంతంగా దర్శనం కావించారు.ఎస్పీ విద్యాసాగర్నాయుడు నేతృత్వంలో 750మంది సారథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ ఎటువంటి ఘటనలు జరగకుండా శివరాత్రి జాగరణ మహోత్సవం జరిగింది.ప్రతిఒక్కరు కుటుంబసమేతంగా వచ్చి శివరాత్రి తిరునాళ్ళను ఆస్వాదించారు.

# మహా శివునకు వీణావాద్య నీరాజనాలు

**విజయవాడ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నిర్వహించిన దశమ వార్షిక కచ్ఛపీ మహోత్సవంలో వర్ధమాన పేరు గడిస్తున్న పేరు గడించిన వైణిక విద్వాంసులు సరస్వతీ మాతకు మహాశివరాత్రి సందర్భంగా మహాదేవులకు వీణావాద్యాలతో నీరాజనాలర్పించి శ్రోతలకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మరుసటి ఉదయం 8 గంటల వరకు హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై ప్రారంభమైన ఈ అఖండ కచ్ఛపీ మహోత్సవంలో సుప్రసిద్ధ వైణిక విద్వాంసులు ఈమని శంకరశాస్త్రి, చిట్టిబాబు, సంగమేశ్వరరావు, వాసా కృష్ణమూర్తి, అయ్యగారి సోమేశ్వరరావు, పప్పు సోమేశ్వరరావులను స్మరించుకుంటూ శారదా మాతకు వీణా వాద్య స్వరహారతులందించారు. సమితి ప్రధాన కార్యదర్శి సివి రావు నేతృత్వంలో చిట్టా రామలక్ష్మి తదితరులు పర్యవేక్షణలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు వంద మందికి పైగా వైణికులు పలువురు వాగ్గేయకారుల కృతులను భక్తి రస ప్రవాహంగా వాయించి వినిపించారు. 40 మంది కళాకారులు, విద్వాంసులు మృదంగం, ఘటం, కంజర, మోర్సింగ్ వాద్యాలతో వైణికుల వీణా వాద్యానికి సహకరించారు. ముఖ్య అతిథిగా వైణిక విద్వాంసులు కె ఎస్ గోవిందరాజన్, ప్రత్యేక, ఆత్మీయ అతిథులుగా కొమ్మాజోస్యుల సద్గురు చరణ్, మోదుమూడి సుధాకర్ లు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత పరిరక్షణకు, భవిష్యత్తరాలకు అందించే క్రమంలో సమితి నిర్వహిస్తున్న విభిన్న రీతుల కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ప్రశంసించారు.

## కూడలి శ్రీ సంగమేశ్వర స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు తంగిరాల సౌమ్య విశేష పూజలు

నందిగామ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: భక్తులకు అన్నప్రసాద వితరణ కూడలి శ్రీ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో ఆద్మాత్మిక వాతావరణం నడుమ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి



నేతలతో కలిసి విశేష పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రత్యేక ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి సన్నిధిలో శివపార్వతుల ఆశీస్సులు పొందిన అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, లోక కళ్యాణార్థం సముద్ర మథనంలో ఉద్భవించిన గరళాన్ని తన గొంతులో దాచుకుని భువనాలను రక్షించిన మహాదేవుడు శివయ్య మహిమను స్మరించుకోవాలని పేర్కొన్నారు. శివపార్వతుల కరుణ కటాక్షాలు సర్వలోకాలకు శాంతి, సమృద్ధి కలిగించాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యల్బిఆర్సిఇలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**మైలవరం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హానరరీ చైర్మన్ కో ఫౌండర్ లకిరెడ్డి జయ ప్రకాష్రెడ్డి, చైర్మన్ లకిరెడ్డి ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఆ క్రమంలో జయ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు వివిధ దేశాలలో ఉన్నతమైన ఉద్యోగాలను నిర్వహిస్తున్నం దుకు హర్షం వ్యక్తం చేశారు పూర్వ విద్యార్థులు తమకు వీలున్నప్పుడు కళాశాలకు విచ్చేసి తగు సలహాలు ప్రస్తుత విద్యార్థులకు వారి యొక్క అనుభవాలను పంచుకోవాలని తెలిపారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరమని పూర్వ విద్యార్థిని, విద్యార్థులు దేశ, విదేశాల నుండి పాల్గొని వారి విలువైన సలహాలను పంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి రెండవ శనివారంను పూర్వ విద్యార్థుల దినోత్సవం"గా జరుపుతున్నామని, కళాశాలలో ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్కు పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయం చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ప్రసంగిస్తూ యల్.బి.ఆర్.సి.ఇ విద్యార్థిని, విద్యార్థులు వివిధ రంగాలలో ఎంతో ప్రతిభ కనపరుస్తున్నారని, వివిధ స్థాయిలలో కంపెనీ యజామాన్యాల నుండి, ప్రతినిధుల నుండి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఈ కళాశాలలో చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకున్నందుకు ఆనందంగా ఉన్నదని తెలిపారు. అనంతరం కళాశాలకు విచ్చేసిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు తమ పని చేస్తున్న కంపెనీలోని అనుభవాలను తమ అధ్యాపకుల ముందు వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో 2001-2005 బ్యాచ్ విద్యార్థులు రీ యూనియన్ మరియు మిగతా సంవత్సరాల వివిధ విభాగాలకు చెందిన 200 మందికి పైగా పూర్వ విద్యార్థిని, విద్యార్థులు, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల లకిరెడ్డి బాలిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టీలు లకిరెడ్డి, పసంద్ కుమార్ రెడ్డి, లకిరెడ్డి రాజ్ కుమార్ రెడ్డి, గోగులమూడి సాంబశివా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, వివిధ విభాగాలకు చెందిన కో ఆర్డినేటర్స్ మరియు స్టూడెంట్ కో ఆర్డినేటర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్గా టి. అనిల్ రాజు వ్యవహరించారు.

## ప్రేమకు సరికొత్త భాషగా వాలెంటైన్స్ డే బహుమతులు

**విజయవాడ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** వాలెంటైన్స్ డే సందర్భంగా బహుమతులు ఇవ్వడం అనేది మరింత వ్యక్తిగతంగా, ఆలోచనాత్మకంగా కేవలం రొమాంటిక్ భాగస్వాములనే కాకుండా స్నేహితులు, కుటుంబ సభ్యులు, తమను తాము కూడా సెలబ్రేట్ చేసుకోవడానికి అర్థవంతమైన, ఉపయోగకరమైన బహుమతుల కోసం చాక్లెట్లు, పూల కంటే భిన్నమైన, ఆధునిక ప్రత్యామ్నాయంగా కాలిఫోర్నియా బాదం ఒక ఆలోచనాత్మక బహుమతి ఎంపికగా ఆవిర్భవించింది. అద్భుతమైన రుచికి తోడు రోజువారీ పోషణను ఇవి అందిస్తాయి.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కమిషనర్



**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# డ్రోన్లతో పటిష్ట బందోబస్తు

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త** మహా శివరాత్రి సందర్భంగా దేవాలయాలు,ఘాట్ల వద్ద డ్రోన్లతో పోలీసులు పటిష్ట బందోబస్థును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుండే నదిలో స్నానాలు చేసి పూజలు నిర్వహించిన అనంతరం దేవాలయాల్లో దర్శనం చేసుకుంటారని,ఈ క్రమంలో దేవాలయాల్లో,ఘాట్ల వద్ద భద్రత దృష్ట్యా ఎటువంటి



అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సిపి రాజశేఖరబాబు అధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా పటిష్టమైన బందోబస్థు ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి నుండే అన్ని పోలీస్ స్టేషన్ల ఏరియాల్లోని అన్ని దేవాలయాలు,ఘాట్ల వద్ద డ్రోన్స్ ద్వారా రద్దీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ భక్తులు దీపాలు వెలిగిస్తూ,పూజలు చేస్తూ ఆథ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించే విధంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్థు నిర్వహించారు. అవసరమైన ప్రదేశాల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేయడం ద్వారా,అధికారులు సిబ్బందికి తగు సూచనలు చేస్తూ భక్తులు శాంతియుత వాతావరణంలో దర్శనాలు పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 42 డ్రోన్లను ఉపయోగించి రద్దీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు,జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# వైభవంగా ఉమా గౌరీ శంకర స్వామి కళ్యాణం

**గంపలగూడెం ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కొత్తపల్లి సమీపాన గల ఉమా గౌరీ శంకర ఆలయంలో ఉమా గౌరీ శంకర కళ్యాణం పురోహితులు అప్పికట్ల అప్పయ్య శాస్త్రీ ఘనంగా నిర్వహించారు. ఆలయం సమీపంలోని గోపాల స్వామి మడుగు వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్య



స్నానాలు ఆచరించారు. భక్తుల సౌకర్యార్థం బల్లకట్టు ఏర్పాటు చేసి, అంటు తీర్చుకునేందుకు జల్లు స్నానాల ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంలో భక్తులు పిండ ప్రధానం చేసి, పూల, మైల తెప్పలు నీళ్లలో వదిలారు. అనంతరం స్నానమాచరించి, స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. మేడూరు బ్రమరాంబిక రామలింగేశ్వర స్వామి, గంపలగూడెం బాల త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ చంద్రమోళీశ్వర స్వామి ఆలయం, మేడూరు శ్రీ భ్రమరాంబిక రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. పెనుగలను, గోసవీడు, ఊటుకూరు గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

## అక్రమ పొగాకు వాణిజ్య నియంత్రణకు నిబద్ధతే బలోపేతంగా ఫిలిప్ మోరిస్ ఇండియా

**విజయవాడ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** స్మగ్లింగ్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఫిలిప్ మోరిస్ ఇండియా ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నిరంతర సమిష్టి చర్య ప్రభుత్వ సహకారానికి పిలుపునిచ్చింది. అక్రమ పొగాకు ఉత్పత్తులు, అక్రమ సిగరెట్ ఉత్పత్తుల అక్రమ వాణిజ్యానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో పరిశ్రమ నాయకులు సహకార విధానాన్ని తీసుకోవడానికి కట్టుబడి ఉండాలి. ట్రాక్ అండ్ ట్రేస్ యంత్రాంగాన్ని అమలు చేయడంతో భారత ప్రభుత్వం ఎన్ఫోర్స్మెంట్ యంత్రాంగాన్ని బలోపేతం చేస్తుంది. ఫిలిప్ మోరిస్ ఇండియా 2025లో, 500 పైగా మార్కెట్ క్లస్టర్లలో 10 రాష్ట్రాల్లోని 3000 దుకాణాలలో మార్కెట్ సర్వేలో నిషిద్ధ సిగరెట్లపై సమాచారాన్ని సేకరించింది. అక్రమ వ్యాపారం చట్టబద్ధమైన వ్యాపారాలను బలహీనపరచి, ఖజానాకు కీలకమైన ఆదాయాన్ని కోల్పోతుందని ఫిలిప్ మోరిస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవనీల్ కర్ అన్నారు.

పల్నాడు జిల్లా వార్త





## త్రికోటేశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి 'గొట్టిపాటి'

### -స్వామివారిని దర్శించుకున్న పలువురు మంత్రులు

నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండపై వేంచేసి యున్న త్రికోటేశ్వరస్వామివారికి పల్నాడు జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టు సమర్పించారు. ఆదివారం శివరాత్రి సందర్భంగా నిర్వహించిన కోటప్పకొండ



జాతరకు గొట్టిపాటితో పాటు, రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రప్రభుత్వ చీఫ్ విఫ్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రతి ఏడాది సంప్రదాయంగా రాష్ట్ర పండుగ హోదా కల్గిన తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరుపున పట్టు అందించారు. వారికి ధర్మకర్త రామకృష్ణ కొండలరావు బ హుదూర్, ఆలయ ఇవో, సహాయ కమీషనర్ డి. చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పట్టు వచ్చిన మంత్రి గొట్టిపాటికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర చీఫ్ విఫ్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లకు స్వామి వారి శేష ప్రసాదాలు అందించారు. ప్రత్యేకంగా ఆలయ ధర్మకర్త రామకృష్ణ కొండలరావు బహుదూర్ వారికి త్రికోటేశ్వరుని చిత్రపటాలు అందించారు. ఆలయ చరిత్రను, స్వామి వారి మహిమను అర్చకులు వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడు స్తోతూ త్రికోటేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. పల్నాడు ప్రాంత అభివృద్ధిలో భాగంగా కోటప్పకొండ శైవ క్షేత్రా న్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రులు వివరించారు.

## కోటప్పకొండ భక్తుల వసతుల కోసం రూ. 10 లక్షల విరాళం

### కలెక్టర్‌కు చెక్కు అందజేసిన క్వారీ అసోసియేషన్

నరసరావుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ::కోటప్పకొండ మహాశివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తుల సౌకర్యార్థం సంతమాగులూరు మండలం గురిజెపల్లికి చెందిన శ్రీ త్రికోటేశ్వర గ్రానైట్ క్వారి అసోసియేషన్ రూ. 10 లక్షల భారీ విరాళాన్ని అందజేసింది. ఆదివారం ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాకు అందజేశారు. దాతలను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ భక్తులకు



మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో క్వారి అసోసియేషన్ వారు సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి దాతృత్వం ఇతరులకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## కోటప్పకొండలో రద్దీతో స్పృహ కోల్పోయిన యువతి

నరసరావుపేట క్రైమ్,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ లో ఆదివారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. స్వామి దర్శనానికి మెట్ల మార్గంలో పైకి వస్తున్న యువతి హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోయింది. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో 10 సంవత్సరాల పాప నందిని స్పృహ కోల్పోయింది. మెట్ల మార్గంలో అటుపైన కాకుండా ఇటు కింద కాకుండా మధ్యలో ఉండటంతో నందినికి అక్కడికక్కడ వైద్య సేవలు అందించడం కష్టంగా మారింది. పోలీసులు, స్థానిక యువకులు నందిని చేతుల మీద ఎత్తుకొని



మెట్ల మార్గంలో కిందకు పరుగులు తీశారు.కొండ మెట్ల మార్గంలో భక్తుల రద్దీ పెరగడంతో ఊపిరి ఆడక అస్వస్థత స్థితిలోకి వెళ్లిన 10 ఏళ్ల పాప కు ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు తెలిపారు.700 మెట్ల దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది.పాప నందిని ని చికిత్స నిమిత్తం 108 వద్దకు తీసుకువెళ్లేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చింది.గురవయ్య గ్రామం కు చెందిన నందిని ని ఎట్టకేలకు 108 వాహనంలో హాస్పిటల్ కు పోలీసులు తరలించారు.

## రోడ్డు భద్రత అవగాహన స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్

నరసరావుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ::మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కోటప్పకొండ తిరునాళ్లలో కొండ దిగువున ఏర్పాటుచేసిన వివిధ ప్రభుత్వ స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ప్రారంభించారు. పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు ఆర్. కనకదుర్గ వద్దుల, రోడ్డు భద్రత అవగాహన స్టాల్ ద్వారా భక్తులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించేలా స్టాల్ ను ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో గాయపడిన వారికి సహాయం చేయడం, డ్రైవర్లు ఫస్ట్ ఎయిడ్ గురించి తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సి.పి.ఆర్ పై అవగాహన, రిఫ్లెక్టర్స్ వాటి అవశ్యకత గురించి ఆడియో ద్వారా రోడ్డు భద్రతా అంశాలు వివరించడం జరిగింది. ఈ యొక్క స్టాల్ సందర్శించిన వారికి చల్లటి మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

## కోటప్పకొండలో విషాదం: కాలువలో కొట్టుకుపోయిన యువకుడు

నరసరావుపేట క్రైమ్,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ::మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో విషాదం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం సింగమనేనిపల్లి గ్రామానికి చెందిన యువకుడు 21 సంవత్సరాల రోహిత్ మేజర్ కాలువలో దిగి కొట్టుకుపోయాడు. ప్రకాశం జిల్లా నుండి ఐదుగురు యువకులు మొక్కు తీర్చుకునేందుకు వచ్చారు. మార్గమధ్యంలో నరసరావుపేట మండలం పరిధిలోని పెట్లూరివారిపాలెం వద్ద ఉన్న చిలకలూరిపేట మేజర్ కాలువలో స్నానానికి దిగగా, నీటి ప్రవాహానికి



రోహిత్ (21) కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.







# శివోహం... శివనామ స్మరణతో మార్మోగిన కోటప్పకొండ

నరసరావుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:"శ్రీ మేధా దక్షి ణామూర్తి యేనమ:ఓంనమ: ప్రణమార్థాయ శుద్ధజ్ఞానైక మార్తాయేనిర్మలాయ ప్రశాంతాయ దక్షి ణామూర్తాయనమఃహరహర చేదుకోకోటయ్య చేదుకోవయ్యా..."శంకరా...శంకించుకురా..వంకజాబిలిని జడన ముడుచుకుని..విషపు నాగులను చంకనెత్తుకొని...నిలకడ ఎరుగని గంగనేలి.. ఏ వంకలేని నా వంక కడగంటి చూపు.. వడనీయవేమిరా..కింకరునిగా .. సేవించుకుంద రా......."హరహర మహాదేవ అంటూ గరళకంఠునికి ప్రణమిల్లుతూ స్వామి నామస్మరణతో కోటప్పకొండ త్రికోటేశ్వరుని ఆలయం మార్మోగింది. లక్షలాది మంది భక్తజనులు స్వామివారిని చేరి భక్తితో ఆరాధించారు. సంస్థ మానవాళికి సృష్టిస్థితి లయకారకుడైన వరమేశుని ప్రత్యేక సేవలో, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి రోజు మొత్తం గడిపి తరించారు.మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ త్రికోటేశ్వరుని ఆలయ ప్రాంగణాలు రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన లక్షలాది మంది భక్తజనులతో కిక్కిరిసిపోయాయి. శివరాత్రి వేళ కొండ వద్ద జాగరం చేసేందుకు భక్త జులు పోటెత్తారు. అధికారుల అంచనాలకు తగిన విధంగా భక్తులు తెల్లవారుజాము నుండే స్వామివారి చెంతకు నెమ్మదిగా తరలివచ్చారు. ప్రజా ప్రతినిధులు, మంత్రులు, అధికారులు, శాసనసభ్యులు స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్లు మధ్యాహ్నం నుండి లక్షలాది మంది భక్తులతో కిక్కిరిసి కిపోయాయి. స్వామివారికి ప్రత్యేక అలంకరణల కోసం బెంగుళూరు నుంచి తెప్పించిన రకరకాల పుష్పాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు రెండు లక్షాలకు పైగా లడ్డులను, లక్షకు పైగా అరిసెలను ప్రసాదంగా

**సంద్రాన్ని తలపించిన భక్తజనం కనువిందు చేసిన విద్యుత్ ప్రభలు**
**భక్తుల సేవలో ప్రభుత్వ శాఖలు, వివిధ సామాజిక వర్గాల అన్నదాన సత్రాలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు**
**3 వేల మందితో భారీ బందోబస్తు నిర్వహించిన పోలీస్ శాఖ**
**త్రికోటేశ్వరునికి ప్రముఖల తాకిడి : పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి కృష్ణారావు**
**ఆర్టీసీ బస్సు సర్వీస్లలో భక్తులకు ఇక్కట్లు**
**క్యూలైన్లలో ఆరకొరగా పాలు, లడ్డు ప్రసాదాలు, బిస్కెట్ ప్యాకెట్లు**

భక్తులకు అందుబాటులో ఉంచారు. దర్శనం గంటలకొద్ది సమయం పట్టటంతో మధ్యమధ్యలో భక్తులు ఆసంతృప్తి వ్యక్తం చేసారు. కోటప్పకొండకు వెళ్ళే మార్గంలో వలు ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు పలు ప్రైవేట్ వాహనాలైన ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, జీవులు భారీ సంఖ్యలో కొండకు భక్తులను తరలించాయి. ఘాట్ రోడ్డు మార్గంలో, కొండ దిగువున



పలుమార్లు వగలు, రాత్రి సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. స్నానాల ఘాట్ వద్ద భక్తజనులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. వివిధ ప్రభుత్వశాఖలు, ప్రైవేట్ సంస్థలు కొండ దిగువున ఏర్పాటు చేసిన స్టాల్స్ విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన రూపెషెడ్లు, టెంట్లు, చలువపందిళ్ళు ఎండ తగలకుండా భక్తులకు కొంతమేర ఉపశమనాన్ని ఇచ్చాయి. ఘాట్ రోడ్డు మార్గంతో పాటు సోపాన మార్గంలో భక్తులు మొకు



స్త్రీలు తీర్చుకునేందుకు స్వామివారి చెంతకు చేరారు. స్వామివారి మూలవిరాట్ ఉన్న ఆలయంతో పాటు పాత కోటయ్య, దక్షి ణామూర్తి దే వాలయం, గొల్లభామగుడి, సాలఅంకయ్య దేవాలయం, ధ్యాన శివుడు. నాగేంద్రస్వామి వుట్ట, యోగశాల, నవగ్రహ మండపారాధన తదితర ప్రాంతాల్లో భక్తులతో కిటకిటలాడాయి. కొండ దిగువున



అంధ కళాకారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాటకచ్చేరి భక్తులను ఆకట్టుకుంది. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నాలుగు లక్షల మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. కనువిందుచేసిన విద్యుత్ ప్రభలు.. ఈ ఏడాది



కోటప్పకొండకు 23కి పైగా విద్యుత్ ప్రభలు తరలివచాన్నయి. దేశంలోనే ప్రభల పండుగగా పేరుగాంచిన కోటప్పకొండ జ తరకు విద్యుత్ ప్రభలు పండుగ కళ తెచ్చాయి. తిరునాళ్ళకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విద్యుత్ ప్రభలను రూ.10 లక్షల నుండి రూ.20 లక్షల రూపాలయల పైగా వ్యయంచేసి నిర్మించి కొండకు తరలించారు. కాకాని, మద్దిరాల, యడవల్లి, అమీన సాహెబ్పాలెం, ఉప్పలపాడు, అవిశాయ పాలెం, కావూరు, అప్పాపురం, గోవిందాపురం, పురుషోత్తపట్నం, కమ్మవారిపాలెం, కాకాని, ఎల్లమంద వంటి గ్రామాల నుండి విద్యుత్ ప్రభలు తరలిరాగా, లింగంగుంట్ల, యల్లమంద తదితర గ్రామాలతో పాటు నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల నుండి బాల ప్రభలు, మొక్కు కుడి ప్రభలు, తడిక ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలివచ్చాయి. భక్తుల కొరకు ప్రభల నిర్వాహకులు వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలను తెల్లవారుజాము వరకు నిర్వహించారు. పర్యాటక కేంద్రం అంతా సందడే.. ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రం భక్తులు,. యాత్రికులు, ఆబాల గోపాలంతో సందడి వాతావరణం నెలకొంది. బోటెషికారు, పిల్లల రాజ్యం, పార్కులు జింకల పార్కు పక్షుల కిలకిల రావాలు, మత్స్య మ్యూజియం, మయూరాల కేంద్రాలు వంటివి భక్తులతో నిండిపోయాయి. దైవదర్శనంతో పాటు యాత్రికులు వర్యాటక కేంద్రంలో విహరించి స్వాంతన పొందారు. ఘాట్ రోడ్డులో పెంచిన వివిధ పూల మొక్కలు యాత్రికులను ఆనందింప చేసాయి. అదే





విధంగా చతుర్మఖ బ్రహ్మ, శేషశయనంపై విష్ణుమూర్తి, కాళిందిమడుగు. తాండవ కృష్ణుడు, విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కిక్కిరిసిన అన్నదాన సత్రాలు. భక్తుల సేవలో స్వచ్ఛంధ సేవా సంస్థలు.. కోటప్పకొండ దిగువన ఉన్న అన్నదాన సత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుండే సత్రాల్లో సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు తెల్లవారులు కొనసాగుతూనే ఉన్నాయి. దూర ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులకు ఆయా సత్రాల్లో సేదతీరేందుకు, భోజనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా యోగి వేమారెడ్డి, కాకతీయ. ఆర్యవైశ్య. శ్రీకృష్ణదేవరాయలు, ముదిరాజులు, శాలివాహన, మాల సామాజికవర్గం, నాయీ బ్రాహ్మణ, ఆదిశైవ, వడియరాజులు, బ్రాహ్మణ, ఎరుకల, యానాది, తదితర సత్రాల్లో అన్నదాన కార్యక్రమం భారీగా జరిగింది. స్వచ్ఛంద సేవా సంస్థలైన స్కౌట్స్ అండ్స్ ఎన్ఎస్ఎస్, ఎన్సెసి వాలంటీర్లు కూస్యలైన్లలో భక్తులకు సహాయపడ్డారు. స్వచ్ఛంద సేవా సంస్థలు మంచినీరు, మజ్జిగ, పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆకట్టుకున్న ప్రభుత్వ, ప్రైవేట్ స్టాల్స్.. కొండ దిగువన ప్రభుత్వ, ప్రైవేటు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బిఎస్ఎన్ఎల్. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టమెంట్, గ్రామీణ నీటిసరఫరా శాఖ. వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, విద్యామిషన్, రాష్ట్ర గృహనిర్మాణశాఖ, తూనికలు,



కొలతల శాఖ. ద్వాక్రా గ్రూపులు. వైద్యశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాయి. అదేవిధంగా ప్రైవేటు శాఖలు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ చేసిన ఏర్పాట్లు భక్తులను ఆకర్షించాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ... వివిధ ప్రభుత్వశాఖలు కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ బి. కృ ష్ణారావు ఆయాశాఖల ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షి ంచారు. స్థానిక శాసనసభ్యులతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నిర్వహించింది. కమాండొకంట్రోల్ ఏర్పాటు మంచి ఫలితాలు ఇచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమ్లాలు జిల్లా వైద్యశాఖాధికారులు పర్యవేక్షి ంచారు. ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో 600కు పైగా బస్సులు నడపగా, ఆ సంస్థ జిల్లా ఉన్నతాధికారులు తాత్కాలిక బస్టేషన్లలో బస చేసి ప్రయాణికులకు అవసరమైన సలహాలు, సూచనలు తెలియజేస్తూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా బిఎస్ఎన్ఎల్, విద్యుత్, రెవిన్యూ, ఆర్అండ్బి, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ప్రజా ఆరోగ్యశాఖ, అటవీశాఖ. అగ్నిమాపకశాఖ, జిల్లా అధికారులు కొండ దిగువున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరాలలో బస చేసి ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు. అదే విధంగా కేంద్ర సమాచారశాఖ ఆధ్వర్యంలో కాయచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యుత్శాఖ జనరేటర్లను, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు చేసింది. తిరునాళ్ళలో ప్రభుత్వ శాఖాల సమన్వయ లోపం.. భక్తులు, మీడియా ప్రతినిధులకు తిప్పాలు.. ఈ ఏడాది కోటప్పకొండ జాతరలో ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం, సరైన పర్యవేక్షణ. అవగాహన లోపంతో తిరునాళ్ళలో వలు ఇబ్బందులు తలత్రేయి. ఆర్టిసి అధికారులు భక్తులకు అరకొర సేవలు, సౌకర్యాలు కల్పించడంతో కొండ వరక ప్రయాణం చేసేందుకు, అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన బస్టాండ్ నుండి కిలో మీటర్ నడిచి కొండ దిగువునా ఏర్పాటు చేసిన బస్టాండుక్కు చేరుకునే పరిస్థితి ఏర్పాడింది. దీంతో కొండ పైకి చేరుకునే భక్తులలో పెద్దవారు. చిన్నారులు. నడకతో తీవ్ర అలసటకు గురయ్యారు, ఎండ అధికంగా ఉండటంతో ఇబ్బందులు వడ్డారు. అదే విధంగా క్యూలైన్లలో ఉచిత లడ్డు ప్రసాదం, మంచినీటి బాటిల్స్. చిన్నారులకు పాలు, బిస్కెట్ల పంపిణి అరకొరగా 2.3గంటలు మాత్రమే అమలు చేయటంతో భక్తులు సమస్యలు ఎదుర్కొన్నారు. మీడియా గ్యాలరి ఏర్పాటు చేసిన పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక పోవటం, నాణ్యత లేని బిస్కెట్లు పంపిణి చేయటం, కనీసం బాత్రూమ్లు





## భక్తులకు సేవలందించిన ఏ.ఎం.రెడ్డి కళాశాల

నరసరావుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ::ఏఎం.రెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలోని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కోటప్పకొండలో ఎన్ఎస్ఎస్ యూనిట్ భక్తులకు సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించడానికి వచ్చిన వేలాది మంది భక్తులకు చల్లని మజ్జిగ, పులిహోర, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. సుమారు 5,000 లకు పైగా మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర ప్యాకెట్లు, తాగునీటి ప్యాకెట్లు భక్తులకు అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి మాట్లాడుతూ, విద్యాసంస్థల తరఫున గత 10 సంవత్సరాలుగా మహాశివరాత్రి రోజున కోటప్పకొండలో భక్తులకు సేవా కార్యక్రమం నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భార్గవభూషణ్ రావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కృష్ణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎ. పావని గారు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

గురజాల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త : మహా శివరాత్రి వేడుకలను ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే శివాలయాలకు చేరుకున్నారు. హర నామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. మండలంలోని దైద కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానం భక్త జన సంద్రంగా మారింది. కృష్ణానదిలో భక్తులు స్నానమాచరించి బిలంలో కొలువైవున్న అమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భజన మండపంలో భక్తులు భజనలు నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించిన వాటర్ బాటిళ్లను భక్తులకు అందించారు. పులిపాడు అమరలింగేశ్వరస్వామి సేవా ట్రస్ట్ మజ్జిగను పంపిణీ చేసి అన్నదానం నిర్వహించింది. ప్రభల ద్వారా మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ, పోలీసు శాఖల అధికారులు పర్యవేక్షించారు. రాత్రివేళ శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. గురజాలలోని ఇష్టకామేశ్వ రస్వామి, శ్రీముక్కంటేశ్వరస్వామి, శ్రీఅమరలింగేశ్వర స్వామి, శ్రీవీరభద్రస్వామి ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాలకు భక్తులు తరలివెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక సుంకరకుంట అమరేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఇష్టకామేశ్వం స్వామి ఆలయంలో దాత సాయంతో ప్రసాదాలు పంపిణీ చేశారు.







### దైద శ్రీఅమరలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'యరపతినేని'

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన దైద అమరలింగేశ్వరస్వామిని ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బిలంలో కొలువైవున్న అమరలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఆలయం వద్ద అమరలింగేశ్వరస్వామి ట్రస్ట్ ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణలో ఆయన పాల్గొన్నారు. అనంతరం దైద గ్రామ శివారులోని శ్రీగంగా భ్రమరాంబ సమేత బుగ్గ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మండలంలోని గోగులపాడులో కొలువైన శ్రీగంగా పార్వతి సమేత నీలకంటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యకక్రమంలో దేవాదాయ శాఖ ఈవో పూర్ణచంద్రరావు, దేవస్థానం చైర్మన్ వెంపటి సాంబశివరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే 'యరపతినేని' ఆర్థికసాయం

మండలంలోని దైద గ్రామినికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ జానీబాషా అనారోగ్యంతో బాధపడుతూ మందులు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే యరపతినేని గ్రామంలోని జానీబాషా ఇబ్బందులను తెలుసుకొని స్వయంగా అతని ఇంటికి వెళ్లి పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

# ఘనంగా 'పిన్నెల్లి' పుట్టినరోజు వేడుకలు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 56వ జన్మదిన వేడుకలు విజయపురిసౌత్ గ్రామ అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక లాంచీస్టేషన్ వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, త్వరలో బెయిల్ మంజూరు కావాలని భగవంతుని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మహిళా అధ్యక్షురాలు లాకా వెంకటరమణ, సీనియర్ నాయకులు వంకాయలపాటి రామదాసు, మాచర్ల మండల ముస్లిం మైనార్టీ నాయకులు, ఇస్మాయిల్, మట్టపల్లి బ్రహ్మం, చర్మకారుల అధ్యక్షుడు బీర్నీడి కుమార్, బ్రహ్మం, కృష్ణారెడ్డి, అప్పలస్వామి, పూరి, మల్లి, ఫణి, శ్రీను, సైదులు, సుమన్, శ్రీనివాసరావు, రాజు, సాగర్‌బాబు, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, జుబేర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# బుగ్గమల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు



వెల్దుర్తి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో కొలువుదీరిన శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీబుగ్గమల్లయ్య స్వామి వారికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భాలయంలోని స్వామివారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలను అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ధనమల్లయ్య స్వామి తిరునాళ్ల

కారంపూడి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామ శివారు కొండల్లో స్వయంభువుగా వెలసిన శ్రీధన మల్లయ్య స్వామి తిరునాళ్లను వేద పండితులు విశ్వనాథం అయ్యగారు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో నిత్య పూజలు నిర్వహించారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ వేలాది మంది భక్తులఉ ధనమల్లయ్య స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. పూర్వం నుంచి కొనసాగుతున్న ఆచారాలు సంప్రదాయాల ప్రకారం ప్రతి ఏటా శ్రీధన మల్లయ్య స్వామి తిరునాళ్ల వేడుకలు నిర్వహిస్తున్నారు. భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం భక్తులకు రవాణా సౌకర్యంలో ఆటంకం లేకుండా టీడీపీ రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి పంగులూరి పుల్లయ్య తన సొంత నిధులతో రూ.3 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు.



# కారంపూడిలో ఘనంగా 'పిన్నెల్లి' జన్మదిన వేడుకలు

కారంపూడి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలోని 1వ వార్డు ముస్లిం బజారు జెండాచెట్టు వద్ద మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్, కారంపూడి పట్టణ వైసీపీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ నాయకులు షేక్ అక్బర్ జానీబాషా, జడ్పీటీసీ షఫీ పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పిన్నెల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. సంబంధం లేని కేసులో కూటమి ప్రభుత్వం పిన్నెల్లి సోదరులను ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో కారంపూడి



పట్టణ యూత్ అధ్యక్షులు జిలానీ, టౌన్ మైనార్టీ అధ్యక్షులు జానీ, మొహిద్దీన్, యాసిన్, కరెంటు సైదా, రబ్బానీ, కరిముల్లా, జానీ, బాషా, ఫారిద్ బాబా, సైదా, దర్గా సుభాని, ప్రసాద్, ఖలీల్, రఫీ, బజార్ మీరా తదితరులు పాల్గొన్నారు. అలాగే కారంపూడి పట్టణ వైసీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పిన్నెల్లి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బొమ్మిన అల్లయ్య, యువజన విభాగం అధ్యక్షులు చిలుకూరి చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు అక్బర్ జానీబాషా, జడ్పీటీసీ షఫీ, పల్నాడు ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్, బొంకూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి దొంత అంజిగౌండ్, చిలుకూరి రవీంద్రరెడ్డి, జిలాని, మర్రి శేషయ్య, అంతరగడ్డ ఏసోబు, గుండెబోయిన శివ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిలాల్ మసీదును సందర్శించిన 'దరువూరి'



సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: సుమారు 100 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన చిన్న మసీదు బిలాల్ మసీదు మరలా పునర్నిర్మాణం చేసుకుంది. నూతనంగా ప్రారంభోత్సవం సందర్భంగా బిలాల్ మసీదును స్థానిక ప్రముఖుడు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు సందర్శిం చారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

# పల్నాడు జిల్లా వార్త



# కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన శిబిరం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని నరసరావుపేట సెంటర్ వద్ద కోటప్పకొండ యాత్రికుల కోసం ప్రత్యేక అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షులు తేల సుబ్బారావు, అధ్యక్షులు పీ పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి దండా గోపి, ఉపాధ్యక్షులు ఇ వెంకటరావు సేవా సమితి నాయకులు తొండపు వెంకయ్య, కొడాలి నాగేశ్వరరావు, సాదినేని కోటేశ్వరరావు, జంపని శేషగిరిరావు, ఇంటూరి శేషగిరి, తొండపు హరిబాబు, రాయని శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి దండా విజయ శ్రీ తదితరులు పాల్గొని కోటప్పకొండ వెళ్లే యాత్రికులకు పులిహోర, పెరుగన్నం పంపిణీ చేశారు



# టెంపుల్ టూరిజం సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలన్నదే సిఎం లక్ష్యం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోటప్పకొండ త్రికోటేశ్వరుని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి సతీమణి వెంకట కుమారి గారితో కలిసి వెళ్లారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కోటయ్యస్వామి దర్శనానంతరం అర్చకులు ప్రత్తిపాటికి వేదాశ్వీరచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందచేశారు. స్వామి దర్శనానంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ఆలయాల నిర్వహా ణకూటమి ప్రభుత్వంలో సర్వమత సమానత్వం ఉప్పొంగుతోందని, అన్ని మతాల ప్రజలు సంతోషంగా తమ ఆచారవ్యవహారాలు, పండుగలు జరుపుకుంటున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఎక్కడా కూడా భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా ఆలయాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. కోటప్పకొండకు వచ్చే మార్గంలో శివరాత్రి సందర్భంగా పలుచోట్ల ఇతర మతాల వారు కూడా అన్నదాన శిబిరాలు, మజ్జిగ..మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి లక్షలాది భక్తుల ఆకలిదప్పులు తీరుస్తున్నారని, ఇది నిజంగా ఎంతో గర్వించాల్సిన విషయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలన్నీ శోభాయమానంగా కోట్లమంది భక్తుల కేరింతలు, ఉత్సాహంతో కళకళలాడుతున్నాయన్నారు. 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 202627 బడ్జెట్ రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజల ఆకాంక్షలు తప్పక నెరవేర్చేలా ఉందని, అన్నివర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమప్రాధాన్యం కల్పించారని ప్రత్తిపాటి తెలియచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమంతో పాటు.. రైతులు, యువత, మహిళల ఆశల సాకారానికి బడ్జెట్ తప్పకుండా దోహదపడుతుందన్నారు. అమరావతి, పోలవరం సంపూర్తితో పాటు.. ఎన్నికల మేనిఫెస్టో అమలుకు బడ్జెట్ ఉపకరిస్తుందని ప్రజలే చెబుతున్నారని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. 15 ఏళ్ల పాటు కూటమిప్రభుత్వం అధికారంలో ఉంటే పేదరికం లేని సమాజం.. ప్రజలు కలలు గంటున్న స్వర్ణాంధ్రప్రదేశ్ తప్పకుండా సాకారమవుతుందన్నారు.మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనా దృక్పథంతో యువతకోసం ఉద్యోగాలే ఎదురుచూస్తాయి విద్య, ఐటీ శాఖల మంత్రి, యువనేత లోకేశ్ వినూత్న ఆలోచనా ధృక్పథంతో విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రారంభించారన్నారు. వాటి ఫలితంగా భవిష్యత్ లో యువతకోసం ఉద్యోగాలు వెల్లువలా వస్తాయని, నేటి విద్యార్థులు..రేపటి యువకులుగా మారే నాటికి వారికోసం ఉద్యోగాలే ఎదురుచూసే పరిస్థితులు వస్తాయని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. పెట్టుబడుల ఆకర్షణలో మంత్రి లోకేశ్ పాదరసంలా స్పందిస్తూ... వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, దానివల్లే రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణలో జాతీయస్థాయిలోనే అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు.పలు చోట్ల అన్నదాన శిబిరాలు, విద్యుత్ ప్రభలు ప్రారంభించిన ప్రత్తిపాటి మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చిలకలూరిపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో కోటప్పకొండకు భక్తులను తరలించేందుకు ఏర్పాటు చేసిన 150 ప్రత్యేక బస్సులను పట్టణంలోని అడ్డరోడ్డు వద్ద ప్రత్తిపాటి ఉదయం ప్రారంభించారు. అనంతరం పట్టణంతో పాటు.. కోటప్పకొండ వెళ్లే మార్గంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాల్ని ఆయన ప్రారంభించి, స్వయంగా భక్తులకు అన్నవితరణ చేశారు. చిలకలూరిపేట పట్టణంలోని అడ్డరోడ్డు కోటప్పకొండ వెళ్ళే దారిలో శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసిన అనంతరం కాకతీయ సేవా సంఘం, శాలివాహన సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, పాడురంగరావు మిత్ర మండలి, మల్లెల రాజేష్ నాయుడు ఫౌండేషన్, తేలప్రోలు రామ్మూర్తి ఆధ్వర్యంలో, కాపు సంఘం, జనసేన నాయకులు మండలనేని చరణ్ తేజ, రాజా రమేష్ ఆధ్వర్యంలో, అచ్చుకోల విజయ భాస్కర్ మిత్ర మండలి, రాధ రంగ మిత్ర మండలి, కరణం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, శివ వెల్డింగ్ వర్క్, పురుషోత్తమపట్నం నందు 30వ వార్డు నాయకులు మొహిద్దిన్ ఆధ్వర్యంలో, పురుషోత్తమపట్నం వాసుదేవ్ ఆధ్వర్యంలో, పోతవరం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో, కోటప్పకొండ లో కాకతీయ కమ్మ సత్రం, జి.డి.సి.సి. బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. కోటప్పకొండలో బాలాజీ అగ్రికల్చర్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టాల్ ప్రారంభం చేశారు.




# ఏడాదిలో ముస్లిం మైనారిటీ బాలికల విద్యాలయం అందుబాటులోకి తెస్తాం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: నియోజకవర్గంలోని వారే కాకుండా, చుట్టుపక్కల నియోజకవర్గాల్లోని ముస్లిం మైనారిటీ బాలికల విద్యకోసం ప్రత్యేక విద్యాలయం ఏర్పాటు చేయనున్నట్టు, ఏడాదిలో దాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని సుభానీ నగర్ లో ఉన్న ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ మరమ్మతు పనులను ఆయన కూటమినాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ఏడాదిలో మైనారిటీ బాలికల విద్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం నియోజక వర్గంలోని ముస్లిం బాలికల విద్య, వసతికోసం 2015లో టీడీపీ ప్రభుత్వ హాయాంలో శంకుస్థాపన చేసిన మైనారిటీ విద్యాలయం నిర్మాణాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మైనారిటీల ఓట్లు దండుకొని ఆ వర్గానికి గత పాలకులు తీవ్ర అన్యాయం చేశారని ప్రత్తిపాటి చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించతలపెట్టిన మైనారిటీ బాలికా విద్యాలయాన్ని ఏడాదిలో పూర్తయ్యేలా చూస్తామని, దాని నిర్మాణంపై ఇప్పటికే మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ తో మాట్లాడటం జరిగిందని ప్రత్తిపాటి తెలియచేశారు. కూటమిప్రభుత్వం మైనారిటీ సంక్షేమలో రాజీపడదని, వారి అభ్యున్నతి, రక్షణకు కట్టుబడి ఉంటుందని ప్రత్తిపాటి చెప్పారు.ధనవంతులైన ముస్లింలు పేద మైనారిటీ కుటుంబాలకు అండగా నిలవాలి రూ.30 లక్షలతో చేపట్టిన ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ మరమ్మతులు పూర్తై అందుబాటులోకి వచ్చాక, పై అంతస్తు నిర్మాణంపై దృష్టి సారిద్దామని ప్రత్తిపాటి మైనారిటీ నేతలకు సూచించారు. మైనారిటీలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ పై అంతస్తు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి ముస్లిం పెద్దలు, నాయకులు కలిసి మెలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి, మాజీ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు జమాల్ బాషా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, వివిధ విభాగాల నాయకులు, వార్డు ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..



# జిడిసిసిబి మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీగా అన్నదానం



చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట: జి డి సి సి బి మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం భారీగా అన్నదానం చేశారు. చిలకలూరిపేట, కోటప్పకొండ మార్గంలో గల యూటీ సమీపంలోని మానం వెంకటేశ్వర్లు కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో శివరాత్రిని పురస్కరించుకొని ప్రతి ఏడాది ఈ అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు పదివేల మంది పైగా భక్తులకు ఈ అన్నదానం చేశారు. ఈ అన్నదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు వైద్యులు సందర్శించి భక్తులకు అందిస్తున్న సేవలకు అభినందనలు తెలియజేశారు . ఈ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు డాక్టర్ మానం సురేంద్ర , దగ్గు మళ్ళీ సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు. కాగా పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభలకు వారి కుటుంబ సభ్యులు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

# మహాశివరాత్రి సందర్భంగా వినుకొండలో గిరిప్రదక్షిణ

వినుకొండ,ఫిబ్రవరి15,ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ వినుకొండ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా కొండమెట్ల వద్దగల శ్రీ వరసిద్ధి వినాయకునికి, శివలింగ ప్రతిమకు భక్తి ప్రపత్తులతో పూజలు చేసి సంఘ సభ్యులు ఘోష్ వాదన సమర్పించారు. అనంతరం శివలింగ ప్రతిమను ఊరేగింపుగా వివిధ వాహనాలలో భజన బృందాలు సతంగ సభ్యులు భజనలతో వెంటరాగా వందల మంది కాషాయ జండాలతో అలంకరించిన ద్విచక్ర వాహనాలపై శివనామం స్మరిస్తూ శ్రీరామలింగేశ్వర స్వామి వారి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్,సమరసత విభాగ అధ్యక్షులు గజవల్లి నాగ పవన్ కుమార్,రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పారా లక్ష్మయ్య,జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు,పట్టణ పురోహితులు డా.ఎడవల్లి శ్రీనివాస్ శర్మ,వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు శ్రావణ్,ఆలయ కమిటీ చైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు,చిలంకూరి కోటేశ్వరరావు,తెలగంశెట్టి పావని,పట్టణ ప్రముఖులు,పరిషత్ కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.



# జీ.వీ, 'మక్కెన'ను కలిసిన నూతన కమీషనర్

వినుకొండ,ఫిబ్రవరి15,ప్రభాతవార్త: వినుకొండ పురపాలక సంఘం నూతన కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శివరామ్ ప్రసాద్ ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ




చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ పరిధిలోని సమస్యల పరిష్కారం కొరకు కృషి చేసి అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా కమీషనర్ తెలిపారు.


# దాతల సహాయంతో భరతమాత అన్నప్రసాద వితరణ పథకం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని యానాది కాలనీలో భరతమాత అన్నప్రసాద వితరణ పథకం 779 వ రోజు మహాశివరాత్రి పర్వదిన శుభ సందర్భంగా రాజమహేంద్రవరం (రాజమండ్రి )కి చెందిన గాలి కిషోర్ బాబు మరియు కుటుంబ సభ్యులయొక్క ఆర్థిక సహాయంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నిరుపేదలకు మరియు వృద్ధులుకు ఉచితంగా భోజనం అందించటం జరిగింది. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనాటి దాతకు వీరి కుటుంబ సభ్యులకు మరియు నేటి కార్యక్రమంలో సేవలు అందించిన పోతుగంటి రామాకోటేశ్వరరావు కు, దమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు కుమారుడుకు, ఆ ప్రాంత యువతకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.



# సత్తెనపల్లిలో బిలాల్ మసీదు పున ప్రారంభం, దువా.

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని ఎన్జీవో సెంటర్ లో నూట పది సంవత్సరాల క్రితం ఢిల్లీ నిజాముద్దీన్ అనుసంధానంగా పవిత్రమైన బిలాల్ మసీద్, చిన్న మసీద్ నిర్మాణం జరిగినది ఆ మసీదు శిధిలావస్థకు చేరుకోవటంతో ఇటీవల దాన్ని కూల్చివేసి నూతన మసీదు నిర్మాణం కోసం చిలకలూరిపేట ముఫ్తీ అబ్బాస్ సహకారంతో ముస్లిం సోదరులు శ్రీకారం చుట్టారు విరాళాలు సేకరించి రెండు కోట్ల 11 లక్షలతో అన్ని హంగులతో కూడిన మసీదు నిర్మాణం పూర్తి చేశారు ఆదివారం ఢిల్లీ హైదరాబాద్ లకు చెందిన ప్రముఖ మత గురువులు ఈ మసీదును ప్రారంభించారు. మసీదును విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టారు



# మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: సత్తనపల్లి టిడిపి నాలుగో వార్డు అధ్యక్షుడు దూపుగుంట్ల జానకి రామారావు నాలుగో వార్డు జెండా చెట్టు వీధిలో టిడిపి విద్యా శాఖ నారా లోకేష్ ఫీజు రియంబర్స్మెంట్ 1200 కోట్ల రూపాయలను విద్యార్థులకు ఇచ్చినందుకు శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి వార్డులో పాలాభిషేకం చేశారు.



# ఎమ్మెల్యే ఆనందబాబును మర్యాదపూర్వకంగా కలిసిన షేక్ చిన్నఅబ్దుల్లా



సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును ఆదివారం ఆయన నివాసంలో పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు షేక్ చిన్న అబ్దుల్లా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలపై ఆయన ఆనందబాబుతో చర్చించారు.

# ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు విజిల్స్, టోపీలు అందజేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకు సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లకు కండక్టర్లకు విఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజిల్స్, టోపీలను డిపో మేనేజర్ నాగమణి పంపిణీ చేశారు సంస్థ నిర్వాహకులు తన్నీరు విజయలక్ష్మి దేవిని ఆమె అభినందించారు కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఫాతిమా రాయల్ బాబు, ఎలమంద జవహర్ యేసయ్య కంపెనీ సీఈఓ సుభాని తదితరులు పాల్గొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో చిలకలూరిపేట డిపోలో కూడా విజిల్స్, టోపీలను పంపిణీ చేశారు.



# భక్తులకు మజ్జిగ పంపిణీ



చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: మహాశివరాత్రి సంద ర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వ రస్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అవసరమైన ఆహారం మరియు చల్లని మజ్జిగ తయారు చేసి ప్రయాణికుల మరియు భక్తుల కు వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి , పట్టణ మాజీ అధ్యక్షులు పొత్తూరి బ్రహ్మానందం , నాదెండ్ల మండల మాజీ అధ్యక్షులు ఆల శివకోటిరెడ్డి , గోరంట్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

# కోటప్పకొండ యాత్రికులకు చిలకలూరిపేట ఆధ్యాత్మిక స్వాగతం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: చిలకలూరిపేట: దక్షిణ కాశీగా పేరుగాంచిన కోటప్పకొండ క్షేత్రానికి వెళ్లే యాత్రికులకు ఇప్పుడు చిలకలూరిపేటలోనే ఆధ్యాత్మిక అనుభూతి మొదలవుతోంది. మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండకు వెళ్లే భక్తులు తప్పనిసరిగా నరసరావుపేట లేదా చిలకలూరిపేట మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో, చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్‌లోని కోటప్పకొండ ఆర్చి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పరమశివుని విగ్రహం, ఫౌంటెన్ పర్యాటకులను, భక్తులను విశేషంగా ఆకట్టుకుం టున్నాయి.ఎంట్రన్స్ లోనే ఈశ్వర దర్శనం సాధారణంగా కోటప్పకొండ దిగువన మాత్రమే పరమశివుని విగ్రహాలు, స్వాగత తోరణాలు కనిపిస్తుంటాయి. కానీ, దానికి భిన్నంగా చిలకలూరిపేట పట్టణ ప్రవేశంలోనే, అదీ ప్రధాన కూడలిలో గంగాధరుని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులు, ఫౌంటెన్ల మధ్య కొలువుదీరిన శివుని విగ్రహం పట్టణానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక కృషి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ విగ్రహ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.



16-2P8exHMNWJQE 8 VJA_16-2P8exHMNWJQE.qxd 15/Feb/26 11:14 PM Page 1



# జెండా మోసిన కార్యకర్తలకే మున్సిపల్ చైర్మన్ పీఠం

## జగిత్యాల ఎపిసోడ్‌కు ఫుల్‌స్టాప్..

## ఒక్కటైన జీవన్‌రెడ్డి, సంజయ్

## ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ..

## అధిష్ఠానం కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గత కొద్దిరోజులుగా జగిత్యాల కాంగ్రెస్ రాజకీయాల్లో సెగలు పుట్టించిన అంతర్గత విభేదాలు ఎట్టకేలకు సద్దుమణిగాయి. ఏఐసిసి సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ రంగ ప్రవేశం చేసి, ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో జగిత్యాల ఎపిసోడ్‌కు ముగింపు పలికినట్లయింది. ఆదివారం ఏఐసీసీ సెక్రటరీ సవాంగ్.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డిలతో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరిం చారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు.

ఐక్యత చాటాలని, రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతం దృష్ట్యా నేతలు కలిసి పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో అత్యంత కీలకమైన నిర్ణయం పదవుల కేటాయింపు పై జరిగింది. పార్టీ కోసం కష్టపడి, జెండా మోసిన నిజమైన కార్యకర్తలకు, పాత తరం నాయకులకే మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఇది జీవన్‌రెడ్డి వర్గానికి కొంత ఊరటనిచ్చే అంశంగా కనిపిస్తోంది. తొలి నుంచి జీవన్ రెడ్డి వాదిస్తున్నట్లుగా.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలన్న సూచనను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. సంజయ్ కుమార్ కూడా పార్టీ ప్రయోజనాల దృష్ట్యా సర్దుకుపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఈ భేటీతో జగిత్యాల కాంగ్రెస్‌లో నెలకొన్న అనిశ్చితి తొలిగిపోయింది. నేతలు ఇద్దరూ కలిసి పనిచేస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పదవుల పంపకంలో పార్టీ విధేయతకే పెద్దపీట వేయాలని నిర్ణయించడం ద్వారా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం కాంగ్రెస్ అధిష్టానం చేస్తోంది.

**ప్రజాభవన్‌లో జగిత్యాల పంచాయితీ**

ఆదివారం ఉదయం ప్రజాభవన్‌లో తన వర్గం కౌన్సిలర్లతో ఏఐసీసీ సెక్రటరీని జీవన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హైకమాండ్.. జగిత్యాల నాయకుల ముందు రెండు ప్రతిపాదనలు ఉంచినట్లు తెలుస్తోంది. ఒకటి.. చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికి, వైస్ చైర్మన్ పదవి జీవన్ వర్గానికి. రెండో ప్రతిపాదనగా చెరో రెండున్నరేళ్లు చైర్మన్ పీఠం పంచుకునేలా ఇరు వర్గాలకు సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ జెండా మోసిన వారికే చైర్మన్ పీఠం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వర్గంతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాగా, కాంగ్రెస్ బిఫామ్‌పై గెలుపొందినవారు, ఇండిపెండెంట్లు, ఎంఐఎం కౌన్సిలర్లు కలిపి మొత్తం 23 మందితో కలిపి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారమే ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు.

ఈ క్రమంలో శనివారం 14 మంది అభ్యర్థులతో జీవన్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. రెండు వర్గాలు క్యాంప్ రాజకీయాలు మొదలు పెట్టడంతో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.

# బయోఏషియా-2026తో గ్లోబల్ టెక్-బయో పవర్‌హౌస్‌గా తెలంగాణ

## కొత్త ఆవిష్కరణలు.. సరికొత్త ఆలోచనలకు కీలక వేదిక

## 17, 18 తేదీల్లో జరిగే సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 15:** గ్లోబల్ టెక్-బయో రంగంలో తెలంగాణను పవర్ హౌస్ గా తీర్చిదిద్దేందుకు బయో ఏషియా 2026 సదస్సును ప్రజా ప్రభుత్వం హైదరాబాదులో ఫిబ్రవరి 17,18 తేదీల్లో నిర్వహిస్తున్నది. హెచ్ఐసీసీ 2 రోజుల పాటు బయోఏషియా సదస్సు జరగనున్నది. ప్రధానంగా హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్ చేస్తుండగా, సుమా రు 50 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా బయో ఏషియా సదస్సుకి ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఈ సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సంయుక్తంగా కలిసి ప్రారంభించ నున్నారు. 'టెక్-బయో అన్‌లీష్:ఏఐ, ఆటోమేషన్ బయాలజీ రివల్యూషన్' అనే థీమ్ మీద సదస్సు జరగనున్నది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆలోచనలకు రాష్ట్రాన్ని వేదిక చేసేందుకు హైదరాబాద్‌లో ప్రజా ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రతిష్టాత్మకంగా బయో ఏషియా సదస్సు నిర్వహిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా బయోటెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు ఈ బయోఏషియా సదస్సులో పాల్గొన నున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సీఈఓలు, ప్రతినిధులు సంబంధిత రంగాల్లో నిపుణులు, ఆవిష్కర్తలు ఈ వేదికపై జరిగే చర్చలు, సమావేశాల్లో పాలుపంచుకుంటారు. లైఫ్ సైన్సెస్ రంగంలో వస్తున్న సరికొత్త మార్పులు, శాస్త్ర పురోగతి, ఏఐ ప్రభావం ఈ సదస్సులో చర్చిస్తారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐతో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే కొత్త ఆవిష్కరణలు, గ్లోబల్ బయో ఎకానమీని బలోపేతం చేయడం, ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ మోడల్స్ తదితర అంశాలను ఎజెండా అంశాలుగా ప్రతినిధులు చర్చించనున్నారు. బయో రంగంలో కొత్త ఆవిష్కరణలు, దేశ విదేశాల సహకారాలు, హెల్త్ కేర్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఈ సదస్సు ప్రధానంగా తెలంగాణకు ఉపయోగపడనుంది. బయో ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ హెల్త్, వైద్య పరికరాలు, అధునాతన చికిత్స విధానాలు, అత్యాధునిక వైద్యం, ఆరోగ్య సంరక్షణ విధానాలపై ఈ సదస్సులో పాల్గొనే ప్రతినిధులు చర్చించనున్నారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ స్థాయిలో హెల్త్ కేర్ హబ్, ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయం విదితమే. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో బయో ఏషియా 2026 సదస్సు లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది.

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షించనుంది. ఆధునిక సాంకేతికత వ్యవస్థ హెల్త్ ఇండస్ట్రీలో ఎటువంటి మార్పులు తీసుకువస్తుందనే అంశంపై కీలక చర్చలు ఈ సదస్సులో జరగనున్నాయి. అమ్జెన్, సానోఫీ, ఎలీ లిల్లీ, మిల్టెనీ బయోటెక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో కీలక ప్రసంగం చేయనున్నారు. బయోటెక్నాలజీ, ఔషధాలు, ఆరోగ్య సేవలు, మెడికల్ టెక్నాలజీ, అర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) వంటి రంగాల మీద కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ సదస్సులో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన క్యాన్సర్ జీన్ థెరపీ నిపుణులు ప్రొఫెసర్ బ్రూస్ ఎల్. లెవిన్, అమ్జెన్ సంస్థ సీఎస్‌వో డా. హోవర్డ్ వై. చాంగ్, జర్మనీకి చెందిన మిల్టెనీ బయోటెక్ వ్యవస్థాపకులు డా. స్టెఫాన్ మిల్టెనీ, సానోఫీ సంస్థ ఈవీపీ మాడలీన్ రోచ్ వంటి ప్రముఖులు కీలకంగా మాట్లాడనున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ కూడా హాజరుకానున్నారు.

భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారు(సైన్స్) ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్, డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డా. రాజీవ్ సింగ్ రఘువంశీ ఈ బయో ఆసియాలో ప్రసంగించనున్నారు. 'ఫార్మా బయోటెక్ భవిష్యత్తు' అంశంపై ఒక ప్రత్యేక సీఈఓ కాన్‌క్లేవ్ నిర్వహించనుండగా, అందులో డాక్టర్ రెడ్డీస్, జైడస్, బయోకాన్, సిప్లా వంటి భారతీయ ప్రముఖ సంస్థల సీఈఓలు పాల్గొననున్నారు. అలాగే నోవార్టిస్, రోష్, నోవో నార్డిస్క్, మెడ్ట్రానిక్, మెర్క్, అస్ట్రాజెనెకా వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ప్యానల్ చర్చలు జరుగుతాయి.

ఈ చర్చల్లో ప్రధానంగా కొత్త తరహా బయోలాజిక్ ఔషధాలు, సెల్ జీన్ థెరపీలు, ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీ వంటి అంశాలపై సమాలోచనలు జరపనున్నారు. బయోఏసియా-2026 సదస్సు ద్వారా హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ రంగాల్లో హబ్‌గా గుర్తింపు పొందనుంది. టెక్-బయోతో వ్యాధులపై సుదీర్ఘంగా అధ్యయనం చేయడం, అర్థం చేసుకునే విధానం, చికిత్సలను రూపకల్పన చేసే పద్ధతి, వైద్య సేవలను అందించే విధానం పూర్తిగా మార్పు చెందనన్నతున్నది.

గత కొన్ని సంవత్సరాలుగా, హైదరాబాద్ మహానగరం ప్రపంచ ఫార్మా, బయోటెక్ రంగంలో జీసీసీ(గ్లోబల్ కెపాసిటీ సెంటర్) వేగంగా విస్తరణ జరుగుతున్నది. బయో లాజిక్స్, వ్యాక్సిన్ తయారీ సామర్థ్యం, బయోప్రాసెస్ డిజైన్, అధునాతన చికిత్సలు, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్‌లో తెలంగాణకి కొత్త పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ సదస్సులో తెలంగాణలో బయో ఉత్పత్తుల పరిధి మరింత పెంచేందుకు, అవసరమైన భాగస్వామ్యాలను కలుపుకుపోయేందుకు సమగ్రంగా చర్చలు చేయను న్నారు. జీవశాస్త్రంలో వస్తున్న పరివర్తనాత్మక మార్పులు, లైఫ్ సైన్సెస్ రంగంలో నిరంతర వృద్ధి ద్వారా నడిచే గణనీయమైన పురోగతిని ఈ సంవత్సరం సూచిస్తుంది. జీవశాస్త్రం ఏఐ ఆటోమేషన్‌తో కలిసి పని చేసే ఒక అవకాశం కనిపిస్తున్నది. సీఆర్‌డీఎంఓ సేవలలో తెలంగాణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూ, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ వేదికపై హైదరాబాద్‌ను ప్రముఖ పాత్ర పోషించే విధంగా చేశాయి. ఈ ఏడాది ప్రారంభంలో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటన, కీలకమైన వ్యూహాత్మక పెట్టుబడులతో పాటు, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ తదితర రంగాల్లో హైదరాబాద్ అగ్రభాగాన ఉన్నది.

బయో ఏషియా- 2026 లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టం పరిణామాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడనున్నది. ఈ కార్యక్రమంలో ప్లీనరీలు, భవిష్యత్తులో చేపట్టేటు వంటి అంశాలను ప్యానెల్ సంభాషణలు జరగనున్నాయి.

# కీసరగుట్టకు పోటెత్తిన భక్తజనం

## పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

## పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మైనంపల్లి రోహిత్



శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కల్యాణోత్సవం సందర్భంగా ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు శ్రీస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పవిత్రపుణ్య శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి ఆలయం శివ నామస్మరణతో మారు మోగింది. ఆదివారం మహాశివరాత్రి పండుగను పురస్కరిం చుకుని కీసరగుట్టకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు రెండు లక్షల మంది వరకు భక్తులు విచ్చేసి ఉంటారని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున శనివారం అర్ధ రాత్రి శ్రీస్వామి వారి కల్యాణోత్సవంను పురస్కరించుకుని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు దంపతులు (సతీసమేతంగా) విచ్చేసి శ్రీస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి శ్రీస్వామి వారిని దర్శించుకుని ఆ తరువాత జరిగిన కల్యాణోత్సవంలో వారు కూర్చున్నారు. అదే విధంగా మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కూడ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కూడ విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆ తరువాత బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు క్యూలీ నిలబడి శ్రీస్వామి వారిని దర్శించుకోవటం, భారీ సంఖ్యలో భక్తజనం రావటంతో భక్తులతో కిటకిటలాడింది. కీసరగుట్టపై ఆలయ ప్రాంగణంలో ఆరుబయట పరిసరాల్లో ఉన్న శివలింగాలను భక్తులు దర్శించుకోవటం శివనామస్మరణతో మారుమోగింది. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఆదివారం సాయంత్రం తమ ఉపవాసాలు ఉండి విడిచారు. కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ నెల 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగను న్నాయి. అయితే ఆదివారం సాయంత్రం సమయంలో కీసరగుట్ట రోడ్డులో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ కావటం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు స్పందించి ట్రాఫిక్ అంతరాయం లేకుండ వాహనాలను పంపారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భారీ ఎత్తున మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు గట్టి భద్రతా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# మంత్రి కొండా సురేఖ మనవడిని అభినందించిన హీరో ప్రభాస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మనవడు, చిన్నారి కొండా మురళీకృష్ణ పటేల్ భక్తి, ఆధ్యాత్మికత పట్ల చూపిన ఆసక్తి ఎంతో అభినందనీయమని ప్రముఖ హీరో ప్రభాస్ కొనియాడారు. రెండున్నరేళ్ల వయసులోనే మురళీకృష్ణ పటేల్ పఠించిన లింగాష్టకం విడియోకు హీరో రెబల్‌స్టార్ ప్రభాస్ వాయిస్ ఓవర్ అందించారు. ఈ సందర్భంగా రెండు న్నరేళ్ల చిన్న వయసులోనే భక్తిశ్రద్ధలతో లింగాష్టకం పఠించిన చిన్నారి ప్రతిభను ప్రశంసించారు. మిగతా చిన్నారులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని, కొండా మురళీకృష్ణ పటేల్‌కు భగవంతుడు ఆయు రారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నానని ప్రభాస్ తెలిపారు.

# యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టండి

## ప్రొఫెసర్లు లేక ఇబ్బంది పడుతున్నాం..

## ప్రభుత్వానికి విసిల వేడుకోలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సరిపడా ప్రొఫెసర్లు లేకపోవడంతో.. బోధన ఇబ్బందిగా మారుతోందని వెంటనే యూనివర్సిటీల్లో నియామకాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వర్సిటీల ఉప కులపతులు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 20న జరిగిన ఉన్నత విద్యా మండలి ఈసీ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు ఇదే అంశంపై మాట్లాడారు. ఆ తరువాత ఈ నెల 4న జరిగిన వీసీల మీటింగ్‌లోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని వీసీలు కోరుతున్నారు. నియామకాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో.. 2012 నుంచి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల నియామకాలు చేపట్టలేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత 2017లో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అచార్య పోస్టులను భర్తీ చేయడానికి అప్పటి ప్రభుత్వం అనుమతించడంతో.. ఆర్థిక శాఖ కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. అయితే అప్పటి నుంచి నియామకాలను చేపట్టడంలో ఎలాంటి పద్ధతిని అవలంభించాలనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీల్లో నియామకాల కోసం ప్రత్యేక నియామక బోర్డును ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ.. అప్పటి గవర్నర్ అందుకు ఆమోదం తెలపకపోవడంతోపాటు ఆ ఫైల్‌ను కాస్త రాష్ట్రపతికి పంపించారు. దీంతో ఈ ప్రక్రియ కాస్త పెండింగ్‌లో పడింది. ఇప్పుడు నియామకాలు చేపట్టాలన్నా దానిపై స్పష్టత రావల్సి ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతేడాది డిసెంబర్10న ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన సందర్భంలో వర్సిటీల్లో నియామకాలను చేపడతామని.. ఆయా నియామకాల్లో ఎవరి జోక్యం ఉండబోదని.. ఎవరైనా జోకనయం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆ తరువాత జరిగిన ఉన్నత విద్యా మండలి ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో పాల్గొన్న యూనివర్సిటీల వీసీలు నియామకాల గురించి ప్రస్తావించారు. సమావేశంలో పాల్గొన్న విద్యాశాఖ కార్యదర్శి ప్రభుత్వ పరిశీలనలో ఉందని.. ప్రభుత్వ నిర్ణయం రాగానే నియామకాలు చేపడతామని తెలిపారు. ఆ తరువాత వీసీలతో విద్యా శాఖ కార్యదర్శి ప్రత్యేకంగా ఈ నెల 4న సమావేశం ఏర్పాటు చేశారు. అందులోనూ ఇదే అంశాన్ని వీసీలు ప్రధానంగా ప్రస్తావించారు. యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టకపోవడంతో బోధనకు ఇబ్బందులు వస్తున్నాయని, పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు సైతం ఇబ్బంది అవుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియామకాల కోసం కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురు వీసీలతో ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను సమర్పించింది. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 70 శాతానికిపైగా ఆచార్యుల కొరత ఉంది. 11 యూనివర్సిటీల్లో 2878 అధ్యాపక పోస్టులు మంజూరు కాగా వాటిల్లో 2125 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మొత్తం కలిపి 2878 పోస్టులు మంజూరు చేయగా.. వాటిలో కేవలం 753 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మంజూరైన ప్రొఫెసర్ పోస్టుల్లో ఉస్మానియా, తెలంగాణ, జేఎన్‌టీయుహెచ్, జెఎన్ఎఫ్ఏయూలో మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన కాకతీయ, మహాత్మాగాంధీ, శాతావాహన, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్‌జీయుకేటిల్లో ఒక్క ప్రొఫెసర్ కూడా లేరు. అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు, అసిస్టెంట్ ప్రొపెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి, ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీల్లోనూ కొత్తగా నియామకాలను చేపట్టలేదు. కొద్దిరోజుల క్రితం ఉస్మానియా యూనివర్సిటీలో కెరీర్ అడ్వాన్స్ స్కీమ్(సీఏఎస్)లో భాగంగా అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటికే ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ఖాళీలకు అదనంగా మరో 20 నుంచి 30 ఖాళీలు ఏర్పడ్డాయి. రాష్ట్రంలోని స్టేట్ యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి 2017లోనే సుమారు 1000కిపైగా పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 8 సంవత్సరాలుగా నియామక ప్రక్రియ ప్రారంభం కాకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా నిలిచిపోయింది.

# ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలి

## ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపాలని కుట్ర

## ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్(ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. మేడారం జాతరలో కోవా బన్ వ్యాపారి షేక్ జావేద్‌అలీపై యూట్యూబర్ల గుంపు లక్ష ్యంగా చేసుకుని దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ తెలిపారు. ఈ ఘటన చట్ట పరిపాలనపై దాడిగా అభివర్ణించారు. ఫుడ్ జిహాద్ పేరుతో కలహాలు రేపే కుట్ర చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఖాద్రీ డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతమైతే తమ సంఘం తరపున ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. ముస్లింలపై జరుగుతున్న ద్వేష ప్రచారాలను తక్షణం ఆపాలని, లౌకిక విలువలను కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముస్లింలు, పేదలపై జరుగుతున్న ద్వేషప్రచారాలకు వ్యతిరేకంగా పోరాడా లని, సమాజంలో ఐక్యత, సమానత్వాన్ని కాపాడేందుకు ఏకమై పని చేయాలని పిలుపునిచ్చారు. మతం పేరుతో చిన్న వ్యాపారులు, కూలీలను లక్ష ్యంగా చేసుకోవడం అమానుషమని, ఇది సామాజిక శాంతి, సామ రస్యానికి తీవ్రముప్పని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, ప్రతి పౌరుడి గౌరవం, భద్రత, సమాన హక్కుల కోసం అవగాహన కార్యక్రమాలు, ప్రజాస్వామ్య ఆందోళనలు, ఐక్యత చర్యలను కొనసాగిస్తామని స్పష్టం సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో 50.48 లక్షల యూరియా బుకింగ్

## అన్ని జిల్లాల్లోనూ యాప్ సేవలు

## వ్యవసాయ శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** ప్రస్తుత యాసంగి సీజనులో 50.48 లక్షల బస్తాల మేర యూరియాను రైతులు బుక్ చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలకే పరిమితమైన యాప్ ద్వారా యూరియా బుకింగ్‌ను అన్ని జిల్లాలకు విస్తరింపచేస్తున్నట్లు ఆదివారం తెలిపింది. ఇప్పటి వరకూ వరకు 12.73 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 50.48 లక్షల యూరియా సంచులు బుక్ చేసుకున్నారని తెలిపారు. ఈ విధంగా బుక్ చేసుకున్న వాటిలో 46.13 లక్షల బ్యాగ్‌లను రైతులు ఇప్పటికే కొనుగోలు చేశారన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది.

యూరియా బుకింగ్‌లో రైతులకు ఎదురవుతున్న సమస్యలను అధిగమించేలా అవసరమైన సవరణలు చేస్తూ యూరియా యాప్ అమలు కొనసాగించ బడుతోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. ఈ యాప్ ద్వారా పట్టాదార్ పాస్ బుక్ కలిగిన రైతులు, అటవీ హక్కుల చట్టం లబ్దిదారులు, భూమిని నిజంగా సాగు చేస్తున్న రైతులు మాత్రమే యూరియాను బుక్ చేసుకునే విధంగా నిబంధ నలు అమలు చేస్తున్నట్లు పేర్కొంది. దీని దీనివల్ల ఎరువులు నిజమైన రైతులకే చేరేలా పర్యవేక్షణ జరుగుతోందని తెలియచేసింది.

రైతు బుక్ చేసుకునే యూరియా సంచుల సంఖ్య పంట రకం, సాగు విస్తీర్ణం వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా నిర్ణయించబడుతోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.

# సేవాలాల్ మహారాజ్ జీవితం బిజెపి సిద్ధాంతాలకు ఎంతో చేరువ

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం భారతీయ జనతా పార్టీ నమ్మే సిద్ధాంతాలకు ఎంతో దగ్గరగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశాన్ని విదేశీ శక్తుల ఆధిపత్యం నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పాటు, ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు ఆయన జీవితాంతం అంకితమయ్యారని తెలిపారు. బంజారా సమాజానికి సంత్ సేవాలాల్ మహారాజ్ ఆరాధ్య దైవమని, పర్యావరణాన్ని కాపాడే దేవుడిగా ఆయనను గిరిజన సమాజం భావిస్తుందని అన్నారు. విదేశీ పాలన కాలంలో ఒకవైపు విదేశీయులపై పోరాటం చేస్తూనే, మరోవైపు ప్రకృతి పరిరక్షకుడిగా నిలిచిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. జగదాంబ మాత ఉపాసకుడిగా, భక్తిశ్రద్ధలతో జీవించిన సేవాలాల్ మహారాజ్ బోధనలు నేటి తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. అందుకే దేశవ్యాప్తంగా గిరిజన సమాజం సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకుంటోందన్నారు. గిరిజనుల సంక్షేమానికి సంబంధించి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది నరేంద్ర మోడీ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ట్రైబల్ కమిషన్ ఏర్పాటు, ప్రత్యేకంగా ట్రైబల్ మినిస్ట్రీ, గిరిజన సంక్షేమానికి అత్యధిక నిధుల కేటాయింపులు చేశారన్నారు. ఇవన్నీ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలేనని గుర్తుచేశారు. ములుగులో సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు విస్తరించాయని తెలిపారు. అలాగే మహారాష్ట్రలో సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం చేపట్టడం గిరిజన సంస్కృతికి ఇచ్చిన గౌరవంగా అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గిరిజనుల విద్య, ఉపాధి, ఆరోగ్య సంక్షేమం కోసం అనేక పథకాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. గిరిజన సమాజాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే బిజెపి ప్రభుత్వ లక్ష ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16-2Pg5ff 9_16-2Pg5ff.qxd 15/Feb/26 11:44 PM Page 1



# ‘ఆధార్’తో మరింతగా వ్యక్తిగత భద్రత




## మార్పులు, చేర్పులతో కొత్త కార్డులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఆధార్ మోసాలను అరికట్టేందుకు కొత్తగా విశిష్టగుర్తింపు ప్రాధికార సంస్థ మార్పులుచేర్పులు చేస్తోంది. ఆధార్ కార్డు ఫోటోకాపీల ద్వారా జరుగుతున్న మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ కీలక మార్పులను ప్రతిపాదించింది. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, భౌతిక ఆధార్ కార్డుపై ఇకపై వ్యక్తిగత వివరాలు కనిపించవు. ప్రస్తుతం మనం బ్యాంకు ఖాతా తెరిచేందుకు, సిమ్ కార్డు కొనుగోలు చేసేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డు ఫోటోకాపీలను ఇస్తున్నాం. ఈ కార్డు లపై 12 అంకెల ఆధార్ నంబర్‌తో పాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా వంటి అత్యంత సున్నితమైన సమాచారం ముద్రించి ఉంటోంది. ఈ ఫోటోకాపీలు నేరగాళ్ల చేతికి చిక్కితే గుర్తింపు చోరీ (ఐడెంటిటీ థెఫ్ట్), ఆర్థిక మోసాలు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని యూఐడీఏఐ గుర్తించింది. ఈ సమస్యను అధిగమించేందుకు, కొత్తగా జారీ చేయబోయే ఆధార్ కార్డులపై కేవలం కార్డుదారుడి ఫోటో, ఒక ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్ మాత్రమే ప్రదర్శించాలని యూఐడీఏఐ యోచిస్తోంది. ఆధార్ నంబర్, చిరునామా వంటి వివరాలన్నీ ఈ క్యూఆర్ కోడ్‌లో భద్రంగా నిక్షిప్తమై ఉంటాయి. గుర్తింపు ధృవీకరణ అవసరమైనప్పుడు, సంబంధిత సంస్థలు తమ వద్ద ఉన్న అధీకృత యాప్‌ల ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను సరిచూసుకుంటాయి. దీనివల్ల కేవైసీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, వ్యక్తిగత సమాచారానికి పూర్తి భద్రత లభిస్తుంది. గత ఏడాది నుంచే ఈ మార్పులపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. ఆధార్ ఫోటోకాపీల ద్వారా జరిగే దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నామని యూఐడీఏఐ సీఈవో భువనేశ్ కుమార్ ఇటీవలే ఒక సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల విడుదల చేసిన కొత్త ఆధార్ మొబైల్ యాప్‌లో కూడా లాగిన్ అయిన తర్వాత కేవలం ఫోటో,

క్యూఆర్ కోడ్ మాత్రమే కనిపించేలా మార్పులు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదన అమలైతే ఆధార్ గోప్యత మరింత పటిష్ఠం అవుతుందని, మోసాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# రేపు బంగ్లాలో కొత్త సర్కార్

## ప్రధాని మోడీకి ప్రత్యేక ఆహ్వానం

### భారత్ తరపున స్పీకర్ ఓం బిర్లా హాజరు

**న్యూఢిల్లీఢాకా:** బంగ్లాదేశ్‌లో మంగళవారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చైర్మన్ తారిక్ రెహమాన్ నేతృత్వంలో సర్కారు ఏర్పాటు కానుంది. ఇటీవల ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇదిలుండగా, ప్రధానమంత్రిగా తారిక్ రెహమాన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి రావాలంటూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఆ దేశ ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఇప్పటికే తారిక్ రెహమాన్‌కు ప్రధాని మోడీ ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు, కొత్తగా ఎన్నికైన బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా భారత ప్రభుత్వం తరపున పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. “స్పీకర్ ఈ ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొనడం భారతదేశం, బంగ్లాదేశ్ ప్రజల మధ్య లోతైన, శాశ్వతమైన స్నేహాన్ని నొక్కి చెబుతుంది, ఇది మన రెండు దేశాల బంధం, ప్రజాస్వామ్య విలువలకు భారతదేశం దృఢమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది“ అని పేర్కొంది. “భాగస్వామ్య చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవం ద్వారా ఐక్యమైన పొరుగువారిగా, తారిక్ రెహమాన్ నాయకత్వంలో ఎన్నికైన ప్రభుత్వానికి బంగ్లాదేశ్ పరివర్తనను భారతదేశం స్వాగతిస్తుంది, ఆయన దార్శనికత, విలువలు ప్రజల అఖండ ఆదేశాన్ని పొందాయి“ అని అది పేర్కొంది. బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో ఎన్నికైన సభ్యులు మంగళవారం, ఫిబ్రవరి 17న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎ.ఎం.ఎం. నాసిర్ ఉద్దీన్ నిర్వహిస్తారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు కార్యాలయం, న్యాయ మంత్రిత్వ శాఖ, తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేశాయి. జాతీయ సంసద్ సచివాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇప్పటికే సన్నాహాలు జరుగుతున్నాయి. సాంప్రదాయకంగా, ఈ వేడుక జాతీయ సంసద్ భవన్‌లోని నియమించబడిన ప్రమాణ స్వీకార గదిలో జరుగుతుంది. ఫిబ్రవరి 17, మంగళవారం సాయంత్రం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని జాతీయ సంసద్ సెక్రటేరియట్ కార్యదర్శి కనిజ్ మోలా తెలిపారు.

## గవర్నర్‌ను దూషించిన కేసులో డీఎంకెనేతకు జైలు

**చెన్నై, ఫిబ్రవరి 15:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో డీఎంకే నేత శివాజీ కృష్ణమూర్తి కి మూడేళ్ల జైలుశిక్ష పడింది. గవర్నర్‌తోపాటు బీజేపీ నాయకురాలు ఖుష్బూ, అన్నాడీఎంకే నేతలపై కూడా గతంలో ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ చెన్నైలోని ఎగ్మోర్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పునిచ్చింది. కాగా 2023లో రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో కొన్ని అంశాలను చదవకపోవడాన్ని తప్పుబడుతూ.. కృష్ణమూర్తి అవమానకరమైన వ్యాఖ్యలు చేసినట్లు గవర్నర్ తరఫు న్యాయవాది చెప్పారు. ఆయన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారడంతో అప్పట్లోనే చెన్నైలోని కొడుంగయ్యూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం డీఎంకే నేతకు జైలుశిక్ష విధించింది.

# సైన్యానికి బదులు పొట్ట పెంచుతున్నారు

## హంగరీ ప్రధానిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎద్దేవా



**కీవ్, ఫిబ్రవరి 15:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు సన్నిహితుడైన హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్‌పై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర విమర్శలు చేశారు. రష్యాతో యుద్ధంలో కీవ్‌కు మద్దతు ఇవ్వడానికి హంగరీ వెనకడుగు వేస్తుండడంపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. విక్టర్ ఓర్బన్ ప్రాంతీయ భద్రత కంటే దేశీయ రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఐరోపా దేశాల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన దేశంలో సైన్యాన్ని పెంచకుండా.. పొట్టను పెంచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు రష్యాతో కొనసాగుతోన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ ఉత్పత్తుల తయారీని వేగవంతం చేయాలని ఐరోపా దేశాలను కోరారు. యుద్ధ విరమణ అమలు కోసం మాస్కోపై ఒత్తిడి పెంచాలని.. లేదంటే రష్యా మరిన్ని దాడులకు పాల్పడే అవకాశం ఉందన్నారు. రష్యాతో యుద్ధాన్ని ఆపడానికి ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తుండగా.. హంగరీ మాత్రం రష్యాకు సహాయం చేస్తూ వస్తోంది. ఆ దేశంపై యూరప్ దేశాలు విధించే ఆంక్షలను పలుమార్లు అడ్డుకోవడానికి ప్రయత్నించింది. యుద్ధం సమయంలో కీవ్‌కు అదనపు నిధులు, ఆయుధాలు నేరుగా సరఫరా చేయాలని ఇయు దేశాలు ఇచ్చిన పిలుపును ప్రతిఘటించింది. అంతేకాకుండా పుతిన్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా ఉక్రెయిన్, రష్యా ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అబుదాబి వేదికగా ఇటీవల నిర్వహించిన రెండు విడత భేటీలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ తదితరులు పాల్గొన్నారు. అయితే, ఇరుపక్షాలూ పరస్పరం ప్రత్యేకమైన డిమాండ్లను వీడకపోవడంతో ఎటువంటి పురోగతి లభించలేదు. డాన్‌బాస్ నుంచి వైదొలగాలని కీవ్‌పై మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును ఎప్పటికీ అంగీకరించబోమని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది.

## అరుదైన కప్ప విషంతో అలెక్స్ నవాల్ని హత్య

**మ్యూనిచ్, ఫిబ్రవరి 15:** రష్యన్ విపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతిపై అత్యంత అరుదైన కప్పవిషం ఇచ్చి హత్యచేసారన్న వివరాలు సంచలనం కలిగించాయి. ఈ ఉదంతం వెనుక రష్యా ప్రభుత్వ హస్తం ఉందని బ్రిటన్‌తో సహా ఐదు యూరోపియన్ దేశాలు తీవ్రంగా ఆరోపించాయి. ఆ దేశాలు సంయుక్త ప్రకటన కూడా విడుదల చేశాయి. నావల్నీ శరీరం నుంచి సేకరించిన నమూనాలను పరిశీలించగా, “ఎపిబాటిడిన్” అనే శక్తివంతమైన న్యూరోటాక్సిన్ ఆనవాళ్లు ఉన్నట్లు ఈ దేశాలు ధృవీకరించాయి. దక్షిణ అమెరికాలో కనిపించే విషపు కప్పల చర్మం నుంచి ఈ విషాన్ని సేకరిస్తారు. రష్యాలో ఇది సహజంగా లభించదని,

ఈ విషాన్ని ఉపయోగించే సామర్థ్యం, ఉద్దేశం, అవకాశం రష్యా ప్రభుత్వానికి మాత్రమే ఉన్నాయని ఆ దేశాలు స్పష్టం చేశాయి. ఈ ఆరోపణలతో బ్రిటన్,

ఫ్రాన్స్, జర్మనీ, స్వీడన్, నెదర్లాండ్స్ దేశాలు రష్యాపై రసాయన ఆయుధాల నిషేధ సంస్థకు ఫిర్యాదు చేశాయి.

## ఓ పక్క సిఎం పదవికోసం ఆధిపత్యపోరు!



### మరోపక్క ఐక్యత చాటుతూ విగ్రహాల ఆవిష్కరణ

**బెంగళూరు, ఫిబ్రవరి 15:** కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్ధరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా విస్తుపోయే సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ఉందనే ప్రచారానికి పూర్తి చెక్ పెట్టినట్లు కనిపిస్తోంది. సిద్ధరామయ్య నాయకత్వంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. పార్టీలో ఐక్యతను, సమష్టి కృషిని ప్రజలకు చాటడమే ఈ కార్యక్రమం లక్ష్యమని డీకే శివకుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ పథకాల అమలులో సిద్ధరామయ్య పోషించిన పాత్రను కొనియాడుతూ, ఆయన చరిత్రలో ప్రజా నాయకుడిగా నిలిచి పోతారని అన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత సిద్ధరామయ్యకు డీకే శివకుమార్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇద్దరూ ఒకే వేదికపై కనిపించడం, ఒకరినొకరు గౌరవించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. సిద్ధరామయ్య సైతం తన విగ్రహాన్ని డీకే ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, కాంగ్రెస్ పార్టీ సమష్టి కృషికి దక్కిన గుర్తింపని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి రేసులో ఎప్పుడూ పోటీపడే ఈ ఇద్దరు నేతల మధ్య ఇలాంటి ఐక్యతను చూపడం రాష్ట్ర రాజకీయాలకు కొత్త సంకేతంగా మారింది.

# ఎవరి ఒత్తిళ్లకూ భారత్ తలొగ్గదు

## - రష్యా చమురు కొనుగోళ్లలోనూ అంతే: జైశంకర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రష్యన్ ముడి చమురు కొనుగోళ్లను అరికట్టడానికి భారత్ అంగీకరించిందని వాషింగ్టన్ నుండి వచ్చిన తాజా వాదనల మధ్య, భారతదేశం తన స్వంత నిబంధనలపై తన ఇంధన విధానాన్ని నిర్ణయిస్తుందని పునరుద్ఘాటించింది. మ్యూనిచ్ భద్రతా సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మాట్లాడుతూ, ఇంధన ఎంపికలు “ఖర్చులు, నష్టాలు, లభ్యత“ ద్వారా మార్గనిర్దేశం చేయబడతాయని అన్నారు, కొత్తగా ప్రకటించిన అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందం, రష్యన్ చమురు దిగుమతులపై ఒత్తిడి ఉన్నప్పటికీ భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో భారతదేశం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి దృఢంగా కట్టుబడి ఉందని జైశంకర్ పేర్కొన్నారు. “మేము వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి చాలా కట్టుబడి ఉన్నాము ఎందుకంటే ఇది మన చరిత్ర, మన పరిణామంలో చాలా భాగం. ఇది చాలా లోతైనది, ఇది రాజకీయ వర్ణపటాన్ని కూడా కత్తిరించే విషయం“ అని ఆయన అభిప్రాయపడ్డారు. అదనపు రష్యన్ చమురు కొనుగోలును ఆపడానికి భారత్ అంగీకరించిందని డొనాల్డ్ ట్రంప్, మార్కో రూబియో చేసిన వాదనల మధ్య జైశంకర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. చమురు కంపెనీలు తమ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకునే ముందు లభ్యత, ఖర్చులు, నష్టాలను పరిశీలిస్తాయని జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాతో ఇటీవల జరిగిన వాణిజ్య ఒప్పందం ప్రకారం భారతదేశం రష్యన్ చమురు కొనుగోలును ఆపివేస్తుందా అని అడిగినప్పుడు, భారతదేశం స్వతంత్ర దృక్పథంతో ఉంటుందని, ఇతరులతో పొత్తు పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన బదులిచ్చారు.

## సంక్షిప్తంగా..

### అణుఒప్పందంపై రాజీకి ఇరాన్ సిద్ధం!



**టెహ్రాన్, ఫిబ్రవరి 15:** అమెరికాతో చర్చలు కొనసాగుతున్న వేళ.. అణు ఒప్పందంపై రాజీకి వచ్చేందుకు ఇరాన్ సిద్ధమైంది. యుఎస్‌తో న్యూక్లియర్ డీల్ కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, తమపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని షరతు పెట్టింది. ఈ మేరకు ఇరాన్ మంత్రి మాజిద్ తఖ్తా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మాజిద్ మాట్లాడుతూ.. ఒప్పందం కుదుర్చుకోవడానికి బంతి అమెరికా కోర్టులో ఉందని వ్యాఖ్యానించారు. ‘ఆంక్షలను ఎత్తివేయడం గురించి మాట్లాడేందుకు వారు సిద్ధమైతే.. మా అణు కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. అయితే, అన్ని ఆంక్షలు ఎత్తివేయాలా? లేదా పాక్షిక ఉపశమనం కోరుకుంటున్నారా? అనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు.

### బిల్‌బోర్డు కూలిన ప్రమాదంలో సమాజ్‌వాది నేత మృతి




లక్నో,ఫిబ్రవరి 15: రోడ్డుపై వెళ్తున్న కారుపై హైమాస్ట్ బిల్‌బోర్డ్ స్తంభం కూలింది. ఆ కారు నడుపుతున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సంఘటన చూసి స్థానికులు షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం అంటూ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబుగంజ్ మార్కెట్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కొత్తగా హైమాస్ట్ బిల్‌బోర్డ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోడ్డుపై ఒక కారు వెళ్తున్నది. అయితే కొత్తగా నిర్మిస్తున్నహైమాస్ట్ బిల్‌బోర్డ్ పోల్ కూలిపోయింది. కదులుతున్న కారుపై అది పడింది. కారు డ్రైవ్ చేస్తున్న 48 ఏళ్ల ఎస్పీ నేత లాల్ బహదూర్ యాదవ్ తీవ్రంగా గాయపడ్డారు. కారులోనే ఆయన మరణించారు.

### మ్యూనిచ్ సదస్సులో ఆసిమ్‌మునీర్‌కు చేదు అనుభవం!



**మ్యూనిచ్(జర్మనీ), ఫిబ్రవరి 15:** పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు జర్మనీలో ఓ ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. మ్యూనిచ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ భద్రతా సదస్సుకు హాజరైన ఆయనను ఓ సెక్యూరిటీ అధికారి అడ్డుకున్నారు. ఆయన తన గుర్తింపు కార్డు (ఐడీ కార్డ్)ను సరిగా ప్రదర్శించలేదని అభ్యంతరం తెలిపారు. ఈ ఘటనకు సం బంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సదస్సు ప్రాంగణంలోకి ప్రవేశించడానికి కొద్ది క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. అసిమ్ మునీర్ మెడలో ఐడీ కార్డు లేకపోవడంతో, సెక్యూరిటీ అధికారి ఆయనను ఆపారు. దాంతో, మునీర్ పక్కనున్న మరో పాక్ సైనికాధికారి తన చేతిలో ఉన్న కార్డును చూపించడంతో, ఆ సెక్యూరిటీ అధికారి ముందుకు పోయేందుకు అనుమతించారు.

### అదృశ్యం అయిన సాకేత్ మృతదేహం లభ్యం

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఫిబ్రవరి 15:** అమెరికాలో భారతీయ విద్యార్థి అదృశ్యం కేసు విషాదాంతంగా ముగిసింది. యూనివర్సిటీకి కిలోమీటర్ దూరంలోని అటవీ ప్రాంతంలో సాకేత్ శ్రీనివాసయ్య (22) మృతదేహం లభించింది. ఈ విషయాన్ని అమెరికాలో పోలీసులు వెల్లడించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య ఐఐటీ మద్రాస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. అనంతరం ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లాడు. బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన అతను కనిపించకుండా పోయాడు. సాకేత్ స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### జమ్ముకాశ్మీర్‌లో ఎనిమిదివేల బ్యాంకు ఖాతాల స్తంభన

**శ్రీనగర్, ఫిబ్రవరి 15:** జమ్ముకశ్మీర్‌లో భారీ డిజిటల్ హవాలా రాకెట్ బయటపడింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన 8వేల బ్యాంకు ఖాతాలను దర్యాప్తు సంస్థలు స్తంభింపజేశాయి. జమ్ముకశ్మీర్‌లో భారీ ముఠాకు ఈ ఖాతాల నెట్‌వర్క్ ఉన్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఈ ఖాతాల్లోకి చేరే డబ్బు చివరికి వేర్పాటువాదం లేదా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నట్లు అధికారులు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో గత మూడ్లేళుగా జమ్ముకశ్మీర్‌లో సుమారు 8వేలకు పైగా ఇలాంటి బ్యాంకు ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. జమ్ముకశ్మీర్‌లోకి అక్రమ ఆర్థిక నిధులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దృష్టి సారించింది.

# పెళ్లయిన 58 యేళ్లకు విడాకులు కోరిన జంట

## ఇవ్వలేమని తేల్చి చెప్పిన రాజస్థాన్ హైకోర్టు

**జైపూర్, ఫిబ్రవరి 15:** వివాహంజరిగిన 46 ఏళ్లకు, పిల్లలు కూడా పెద్దవాళ్లైన తర్వాత ఒక జంట విడాకులకు దరఖాస్తు చేసుకుంది. 2014లో ఈ దరఖాస్తుచేసారు.అప్పటిక వారి వివాహమై 58 ఏళ్లు. ఇప్పుడు కూడా అదే విడాకుల కేసు కోర్టులో ఉంది. వివాహమైన 58 ఏళ్ల తర్వాత ఈ జంట కోరుకుంటున్నట్లుగా విడాకులు ఇచ్చేందుకు రాజస్థాన్ హైకోర్టు నిరాకరించింది. దంపతుల పేర్లు వెల్లడికానప్పటికీ రాజస్థాన్‌కు చెందిన ఒక జంట జూన్ 29, 1967లో పెళ్లి చేసుకుంది. వారికి పిల్లలు కూడా ఉన్నారు. 46 ఏళ్లపాటు కలిసే ఉన్నారు. ఈ మధ్యలో చిన్నచిన్న తగాదాలు సహజమే. కానీ, 2013లో మాత్రం వీరి మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. దీంతో వివాహమైన 47 ఏళ్లకు అంటే మే 26, 2014లో వీరు విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లోనే భర్త దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను భరత్‌పూర్ ఫ్యామిలీ కోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన తిరిగి రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. ఇంతకాలం ఈ కేసు విచారణ సాగుతూనే ఉంది. తాజాగా జస్టిస్ సుదేశ్ బన్సల్, జస్టిస్ అనిల్ కుమార్ ఉప్మన్‌తో కూడిన హైకోర్టు బెంచ్ వీరి విడాకులపై విచారణ జరిపింది. విడాకులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఇందుకు సంబంధించి కేసు విచారణ వివరాల్ని కోర్టు వెల్లడించింది. తమ పేరు మీద ఉన్న ఆస్తిని తన పెద్ద కొడుక్కు ఇవ్వాలని భార్య నిర్ణయించుకుంది. ఇద్దరు కొడుకులకు సమానంగా ఇవ్వాలని భర్త అన్నారు. దీంతో ఈ అంశంపై ఇద్దరిమధ్యా బేధాభిప్రాయాలున్నాయి. తమ ఆస్తిని భర్త విడదీయాలనుకుంటున్నారని భార్య ఆరోపించింది. తన భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఒకసారి ఆమెను తమ ఇంటికే తీసుకొచ్చాడని కూడా భార్య ఆరోపించింది. ఇదే సమయంలో తన భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇవన్నీ విన్న ధర్మాసనం ఇవేమీ విడాకులు తీసుకోవడానికి తగిన కారణాలుగా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది.

ఏవో కుటుంబ కలహాల కారణంగా ఒక జంటకు విడాకులు ఇవ్వలేమని, ఈ కారణాలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా కలిసున్న ఈ జంట ఒకరినొకరు అర్థం చేసుకున్నారని, వారి మధ్య సహనం, అవగాహన ఉందని కోర్టు భావించింది. అందువల్ల ఈ చిన్న కారణాలకు 58 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత విడాకులు ఇవ్వలేమని చెప్పిన హైకోర్టు విడాకుల పిటిషన్‌ను కొట్టివేసింది.


## స్లీపర్‌క్లాస్‌లో కెనడా దంపతులకు వింత అనుభవం!

### మైమరపించిన భారతీయుల ఆతిథ్యం!

**జల్గావ్, ఫిబ్రవరి 15:** భారత్‌లో పర్యటిస్తున్న కెనడాకు చెందిన జంటకు భారతీయ రైలులో ఓ విచిత్రమైన, మధురమైన అనుభవం ఎదురైంది. పొరపాటున ప్రైవేట్ క్యాబిన్ బదులు స్లీపర్ క్లాస్ టికెట్ బుక్ చేసుకోవడంతో, ఏడు గంటల ప్రయాణంలో వారికి నిద్రే కరువైంది. అయినప్పటికీ, తోటి ప్రయాణికుల ఆప్యాయత, పిల్లల అల్లరికి ముగ్ధులై, ఈ అనుభవాన్ని ఎప్పటికీ మర్చిపోలేమంటూ సోషల్ మీడియాలో పంచుకున్న ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. కెనడాకు చెందిన కిమ్ గ్రీన్‌వుడ్, తన స్నేహితుడితో కలిసి జల్గావ్ జంక్షన్ నుంచి చంద్రపుర వరకు 7 గంటల రైలు ప్రయాణం కోసం టికెట్లు బుక్ చేసుకున్నారు. ప్రశాంతంగా నిద్రపోవచ్చని భావించి స్లీపర్ క్యాబిన్ అనుకుని బుక్ చేయగా, అది అందరూ కలిసి ప్రయాణించే సాధారణ స్లీపర్ క్లాస్ అని రైలెక్కిన తర్వాత వారికి తెలిసింది. మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అక్కడి వాతావరణంలో వారు పూర్తిగా లీనమైపోయారు. కొద్దిసేపటికే వారి బెర్త్ చుట్టూ పిల్లలు చేరిపోయారు. విదేశీయులను చూడాలన్న కుతూహలంతో వారితో ఆటలు, మాటల్లో మునిగిపోయారు. తోటి ప్రయాణికులు తమ ఇంట్లో వండిన ఆహారాన్ని పంచుకోవడమే కాకుండా, స్టేషన్లలో ఆగినప్పుడు చాయ్, ఇతర తినుబండారాలు కొనిచ్చారని కిమ్ తన పోస్టులో పేర్కొన్నారు. “ఓ పెద్ద కుటుంబంలా అందరూ కలిసిపోవడం చూసి ఆశ్చర్యపోయాను. ఈ 7 గంటల నిద్రలేని ప్రయాణంలో పొందిన అనుభూతి వెలకట్టలేనిది“ అని ఆమె వివరించారు. తాము పొందిన ఈ ప్రత్యేక అనుభవాన్ని “మా జీవితంలోనే అత్యంత సరదా రాత్రి“ అంటూ కిమ్ గ్రీన్‌వుడ్ షేర్ చేసిన వీడియో, పోస్ట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది.

# రైతులకు ద్రోహం చేస్తున్నట్లే!

## వాణిజ్య ఒప్పందంపై ప్రధానికి రాహుల్ ప్రశ్నలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోన్న తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులు మోస పోవడాన్ని కళ్లారా చూస్తున్నామని, దేశ వ్యవసాయ సార్వభౌమత్వాన్ని రాజీ పడేలా చేస్తోందని ఉద్ఘాటించారు. ఇది తాత్కాలిక అంశం కాదని, రైతుల భవిష్యత్‌కు సంబంధించినదన్న ఆయన.. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి ఐదు ప్రశ్నలు సంధించారు. డిడిజి (డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్) దిగుమతి చేసుకోవడం అంటే ఏమిటి? జన్యుమార్పిడి చేసిన అమెరికన్ మొక్కజొన్న నుంచి తయారైన దాణాను భారతీయ పశువులకు తినిపించడం కాదా? ఇది మన పాల ఉత్పత్తి అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా? జన్యుమార్పిడి చేసిన సోయాబీన్ ఆయిల్‌ను అనుమతిస్తే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయాబీన్ రైతులపై ప్రభావం పడదా? మీరు చెబుతున్న ఆ ‘అదనపు ఉత్పత్తులు’ అంటే ఏమిటి? కాలక్రమేణా పప్పు ధాన్యాలతోపాటు ఇతర అమెరికన్ పంటల దిగుమతులకు ద్వారాలు తెరవడమేనా? వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడం అంటే ఏమిటి? జన్యు మార్పిడి పంటలపై తన వైఖరిని మార్చడం, ధాన్యం సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర లేదా బోనస్‌లను తగ్గించడంపై భవిష్యత్తులో భారత్ ఒత్తిడిని ఎదుర్కోనుంది.

# గోవాడ బాల కోటేశ్వర స్వామిని దర్శించుకున్న రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త: సర్వేశ్వరుని యొక్క ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ మరియు రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామివారికి మంత్రి అనగాని పట్టు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ కు వేదమంత్రాలు, పూర్ణకుంభంతో ఆలయ పురోహితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అనగాని మాట్లాడుతూ సదాశివుని యొక్క ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని రాష్ట్రం దినదినాభివృద్ధి చెందుతూ ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ ఆర్గనైజేషన్ సెక్రటరీ మల్లాది రామకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ మత్తి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు, చేనేత సంఘ నాయకులు దివి రాంబాబు, పూషడుపు కుమారస్వామి, సొంటి సుబ్బయ్య, వంగర చక్రవర్తి, దివి శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు దంపతులు

గుంటూరు వెస్ట్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త : మహాశివరాత్రి పవిత్ర సందర్భంగా గుంటూరు జిల్లా పెదకాకానిలోని ప్రసిద్ధ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు స్వామివారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు మంత్రి దంపతులకు ఆశీర్వచనం అందించారు, స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందచేశారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో శివనామస్మరణతో వాతావరణం ఆధ్యాత్మికతతో పరవశించింది. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మహాశివరాత్రి వంటి పర్వదినం రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శుభం, శ్రేయస్సు ప్రసాదించాలి. పరమేశ్వరుడి కృపతో రాష్ట్రం సుభిక్షంగా, సుసంపన్నంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను. శివుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నిలవాలని అని ఆకాంక్షించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. దేవస్థానం ఈవో పర్యవేక్షణలో దర్శనాలు, క్యూలైన్లు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సహాయం వంటి సదుపాయాలను సమర్థవంతంగా ఏర్పాటు చేశారని ప్రశంసించారు. భక్తులు ప్రశాంతంగా పూజలు నిర్వహించేలా ఆలయ సిబ్బంది క్రమశిక్షణతో అభినందనీయమని పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో జరుపుకోవాలని, శివనామస్మరణతో జీవితంలో ధైర్యం, దైవబలం పొందాలని మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.



## మహాశివరాత్రి సందర్భంగా శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్టు ఆధ్వర్యంలో

# భారీ అన్నదానం

మంగళగిరి ఫిబ్రవరి 15, ప్రభాతవార్త : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని బచ్చు గురుమూర్తి స్థలంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పందేటి సాంబశివరావు మాట్లాడుతూ మహాశివరాత్రి పవిత్ర దినాన పరమశివుని ఆశీస్సులతో అన్నదానం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని శివదర్శనం అనంతరం అన్నదాన శిబిరానికి పదివేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. మహాశివరాత్రి పుణ్యకాలంలో శివుని ఆశీస్సులతో అన్నదానం నిర్వహించడం తమకు గొప్ప భాగ్యమని తెలిపారు. ప్రజలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని, భక్తుల విశేష స్పందన తమకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. మన్నెం శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది సభ్యులతో ప్రతి నెల అమావాస్య సందర్భంగా నిరంతరంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా మహాశివ రాత్రి పర్వదినాన కూడా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్ర మమని కొనియాడారు. సమాజంలో సేవాభావాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని ట్రస్ట్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కర్నాటి శివ సత్యనారాయణ, కె సుబ్బరాజు, కగ్గ శ్రీనివాసరావు, పంచుల శివన్నారాయణ, గండికోట అచ్చియ్య, పందేటి శ్రీను, కటారి విష్ణుమూర్తి, రామకృష్ణారెడ్డి, వేల్పూరి శంకర్, చిరుమామిళ్ల రంగారావు, పేరుమళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

గుంటూరు ఫిబ్రవరి 15 ప్రభాత వార్త ప్రతినిధి : తెనాలికి చెందిన డా. వడ్లమూడి బాబు రాజేంద్ర ప్రసాద్ జీరో పావర్టీ పి4 కార్యక్రమం కింద



పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10 లక్షల విరాళాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందించారు. వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ తరఫున ఇచ్చిన ఈ విరాళం తెనాలి నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి ఉపయోగపడనుంది. జీరో పావర్టీ కార్యక్రమ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా రంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ఈ విరాళం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, సమాజాభివృద్ధికి ఇది ఆదర్శప్రాయమైన ముందడుగు అని పేర్కొన్నారు. సమాజంలోని ఇతర దాతలు కూడా ఇలాంటి సేవాకార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్వో లక్ష్మీ కుమారి, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జెట్టి సౌలరాజు, యంగ్ ప్రొఫెషనల్ సురేష్ పాల్గొన్నారు.

# మహాశివరాత్రి జాగరణ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి15,ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని నంబూరు హైవే సమీప దశావతార ఆలయం పక్కన ఉన్న మైదానంలో "మహా గ్రూప్"



ఆధ్వర్యంలో నిర్వహించిన "శివోహం జాగరణ" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా బందోబస్తు ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ని ఎస్పీ మర్యాదపూర్వకంగా కలుసుకొని, ముఖ్యమంత్రి భద్రతా చర్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకున్న సమయం నుంచి పూజా కార్యక్రమాలు ముగిసి తిరిగి ప్రయాణించే వరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశించారు. రాకపోకల మార్గాల్లో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సభా ప్రాంగణంలో ఏర్పాటు



చేసిన సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, డ్రోన్ కెమెరాల ద్వారా గగనతల గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీల భద్రత దృష్ట్యా కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు, సందర్శకులను జిల్లా భద్రతా విభాగ సిబ్బంది ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే ప్రాంగణంలోకి అనుమతించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన కేడింగ్ అమలు చేయాలని, అత్యవసర పరిస్థితుల దృష్ట్యా అంబులెన్స్, ఫైర్ సర్వీసు బృందాలను సిద్ధంగా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు భద్రతా తనిఖీల సమయంలో పోలీసు శాఖకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (లి వీ) ఏటీవీ రవికుమార్, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐలు అలహారి శ్రీనివాస్, రాంబాబు, పెద్దకాకాని సీఐ నారాయణ స్వామి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలలో పటిష్ట బందోబస్తు

గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి15,ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు శైవ క్షేత్రాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, శాంతి భద్రతలను కాపాడే దిశగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టబడ్డాయి. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా దేవుని దర్శనం చేసుకునేలా జిల్లా పోలీసులు సమగ్ర భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. తెల్లవారుజామున నుంచే భక్తులు ఆలయాలకు తరలివస్తున్న నేపథ్యంలో, వారి సౌకర్యార్థం సూచిక బోర్డులు ఏర్పాటు చేయబడ్డాయి. ఆలయ ప్రాంగణాలలో భారీ కేడింగ్ ఏర్పాటు చేసి, క్యూలైన్లు సక్రమంగా నిర్వహించబడుతున్నాయి. మైక్ ప్రకటనల ద్వారా భక్తులకు అవసరమైన





సూచనలు అందిస్తున్నారు. ప్రతి ముఖ్య ఆలయం వద్ద పోలీస్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు తక్షణ సహాయం అందించేందుకు పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో గగనతల గస్తీ నిర్వహిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులు సందర్శకుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి, పోలీస్ సిబ్బందిని నియమించి సక్రమ పార్కింగ్ సదుపాయాలు కల్పించబడ్డాయి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రూట్ బందోబస్తు, ట్రాఫిక్ సిబ్బంది నియామకం, నిరంతర పెట్రోలింగ్ ద్వారా రవాణా సౌకర్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా ఇంటెలిజెన్స్ బృందాలను నియమించి, ముందస్తు సమాచార సేకరణ చేపట్టి శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటు న్నారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలు, శైవ క్షేత్రాలలో జరుగుతున్న జాతరలు, ఊరేగింపులు, విద్యుత్ ప్రభలు, తిరునాళ్ల కార్యక్రమాలను కింది అధికారులు పర్యవేక్షిస్తున్నారువడ్లమూడి క్వారీ తిరునాళ్ల వద్ద జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్. పెద్దకాకాని శివాలయం వద్ద: నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ. పేరేచర్ల కైలాసగిరి కొండపై తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, మేడికొండూరు సీఐ మధుసూదన్. తాళ్లాయపాలెం శైవ క్షేత్రం వద్ద తుళ్లూరు సీఐ కె. చేసిన శ్రీనివాసరావు. తెనాలి వైకుంఠపురం శివాలయం వద్ద తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, రూరల్ సీఐ నాయబ్ రసూల్. తాడేపల్లి కృష్ణా నది తీరం వద్ద తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, ఎస్బై ఖాజావలి. వీరి నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గ్రామాలు ఇతర ప్రాంతాలలోని ఆలయాల వద్ద కూడా తగిన భద్రతా ఏర్పాట్లు చేయబడ్డాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలకు విచ్చేసే భక్తులు పోలీస్ అధికారులు సిబ్బందికి సహకరించి, వారు ఇచ్చే సూచనలు పాటించాలని, అందరూ ప్రశాంత వాతావరణంలో దేవుని దర్శనం పొందేలా సహకరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ విజ్ఞప్తి చేశారు.





# మహిళ అదృశ్యం

గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి15,ప్రభాతవార్త : ఓ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అమె తండ్రి ఆరెండల్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంజయ్ గాంధీ నగర్ కు చెందిన బోరుగడ్డ డేవిడ్ తన కుమార్తె దీప్తిని బాపట్ల జిల్లా నగరం మండలం వెనిగల్ల గ్రామానికి చెందిన దాసరి కళ్యాణ్ తో 2005లో వివాహం జరిపించారు. కళ్యాణ్ బాంబే లో ఉద్యోగం చేస్తూ ఉంటాడు. అయితే 10 రోజుల క్రితం అతను బాంబే వెళుతూ తన భార్య దీప్తిని గుంటూరు లోని దీప్తి తల్లిదండ్రులు వద్ద వదిలి వెళ్ళాడు. ఈ నెల14వ తేదీన ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్ళిపోయినది. అంతటా విచారించిన తన కుటుంబ సభ్యులకు జాడ తెలియక పోయేసరికి దీప్తి తండ్రి డేవిడ్ ఆరండల్ పేట్ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## శివనామస్మరణతో మారుమ్రోగిన

# పెదకాకాని శివాలయం

### -మహాశివరాత్రి సందర్భముగా పోటెత్తిన భక్తులు
### కనులపండువగా శ్రీ భ్రమరాం సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల దివ్య కళ్యాణం

గుంటూరు వెస్ట్ క్రైమ్, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త : పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము మహాశివరాత్రి పర్వదినమున భక్తులతో కిటకిటలాడినది. శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ స్వర్ణ కవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించినారు. తెల్లవారుజాము 3.00 నుండి భక్తులను దర్శనము అనుమతించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని





జిల్లా నలుమూలలు నుండే కాక ఆయా ప్రాంతముల నుండి వేలాదిగా భక్తులు తరలివచారు . ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మారుమ్రోగింది ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, ధర్మకర్తలమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ధర్మకర్తలమండలి సభ్యులు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యముగా క్యూలైనులు ఏర్పాటు చేసి భక్తులకు సకాలములో స్వామి వారి దర్శనము కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 11.00





సమయములో ఆలయ ప్రాంగణము అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. క్యూలైనులలో భక్తుల సౌకర్యార్థము త్రాగునీరు, మజ్ గ, పాలు పంపిణీచేశారు. మహాశివరాత్రి సందర్భముగా ఆలయాన్ని పుష్పమాలలతో శోభాయమానముగా అలంకరించినారు. భక్తులు పొంగలి నైవేద్యములతో ఆలయము చుట్టు ప్రదక్షణలు చేసి శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని మ్రె క్కలు చెల్లించుకున్నారు. భక్తులందరికి తీర్థ ప్రసాదములు అందజేసినారు. దాతలు, దేవస్థానము సహాకారముతో ఆలయానికి వచ్ న భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఆర్యవైశ్యసంఘం, కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేసినారు.

**స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు....**

శివరాత్రి పర్వదినమున ఉదయం శ్రీ మల్లేశ్వరస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని పూజ కార్యక్రమములలో పాల్గొన్నారు. పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు శ్రీ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించినారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, రాష్ట్ర వ్యవసాయశాఖమాత్యులు కింజరపు అచ్ ంనాయుడు దంపతులు, కురుపాం శాసనసభ్యులు జగదీశ్వరీ, హైకోర్టు న్యాయమూర్తి రవీంద్రబాబు, సినీ







దర్శకులు బోయపాటి శ్రీనివాసరావు గుంటూరు 5వ నెంబరు జిల్లా జడ్ నీలిమ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకొని పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. ఆలయ అర్ స్వ్కములు, వేదపండితులు వేదఆశ్వీరవచనము చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి చిత్రపటము, ప్రసాదాలు అందజేసినారు. శివరాత్రి పర్వదినమున రాత్రి 11.00 గంటలకు లింగోద్భవకాలమున స్వామ వారికి ఏకాదశ ద్రవ్యములతో రుద్రాభిషేకము జరిగింది. 12.00 లకు గజవాహనముపై ఎదుర్కోలోత్సవము తెల్లవారుజామున 2.00 లకు శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి కళ్యాణము అత్యంత వైభోపేతముగా జరిగింది. ఆలయ పునః నిర్మాణ దాతలు శ్రీ కొల్లిపర వంశీకులు వారిచే అమ్మవారికి పట్టు వస్త్రములు ముత్యాల తలంబ్రాలు సమర్పించారని ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమారు, పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, సభ్యులు తెలిపారు. సోమవారము శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారములో భక్తులను అనుగ్రహించెదరని తెలిపినారు. మంగళవారము సాయంత్రం 4.00 లకు శ్రీ స్వామి వారి శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల దివ్య రథోత్సవము పంచ వాద్యములు, విశేష వేషధారణలతో విద్యుత్ దీపాలతో అత్యంత వైభవముగా జరుగునని తెలిపినారు అలాగే బుధవారము మధ్యాహ్నం 4.00 నుండి శ్రీభ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల తెప్పోత్సవము అత్యంత వైభవోపేతముగా వివిధ శాఖల సహకారముతో నిర్వహించబడునని అధిక సంఖ్యలో భక్తులు తెప్పోత్సవములో పాల్గోన్ని జయప్రదం చేయవలసినదిగా ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమారు, పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు కోరారు.

# అసెంబ్లీకి రాని వాళ్లా బడ్జెట్ పై ప్రేలాపనలు : తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు వెస్ట్ క్రైమ్ , జనవరి 15,ప్రభాతవార్త : అసెంబ్లీకి పట్టుమని పది నిమిషాలు కూడా ఉండకుండా ఇంటి దగ్గర కూర్చుని బడ్జెట్ పై వైసీపీ నాయకులు ప్రేలాపనలు చేస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే నసీర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సంకల్పం ఉన్న చోట సాధనకు మార్గం ఉంటుందనే నినాదాన్ని ప్రస్తుత బడ్జెట్ నిజం చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ అసమర్థ పాలనలో చితికిన రాష్ట్రానికి ఆశా దీపమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సంక్షేమాన్ని నిచ్చెనగా మార్చుకుని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేలా సీఎం నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ రూపొందించారని తెలిపారు. అమరావతి, పోలవరం రెండు కళ్లుగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. సామాన్యుల నుంచి వ్యాపారుల వరకు, యువకుల నుంచి మహిళలు, రైతుల వరకు అన్ని వర్గాలకూ మేలు చేసేలా బడ్జెట్ ఉందన్నారు. అమృత్ 2.0 కింద 117 ప్రాజెక్టులకు రూ.400 కోట్లు, 204 నుంచి 275కు అన్న క్యాంటీన్ల పెంపు, ఎన్టీఆర్ నగర్ పేరిట రూ.2 లక్షల ఇళ్ల నిర్మాణం, తల్లికి వందనానికి 9,660 కోట్లు, స్కిల్ డెవలప్ మెంట్ కు రూ.1232 కోట్లు, క్రీడలకు రూ.438 కోట్లు, 639 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ.2499 కోట్లు, వంద కోర్టు భవనాల నిర్మాణానికి రూ.349 కోట్లు, వివిధ శాఖల్లో బకాయిల చెల్లింపులకు 24,811 కోట్లు, మైనారిటీల సంక్షేమానికి రూ.6099 కోట్లు ఇలా అన్ని రంగాలకూ ప్రాధాన్యమిచ్చారని వివరించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో 163 కేంద్ర ప్రభుత్వ పథకాలు నిర్వీర్యమైతే ..కూటమి ప్రభుత్వం రూ.18,701 కోట్లు కేటాయించి 87 పథకాలను మళ్లీ అమల్లోకి తీసుకొచ్చిందని తెలిపారు. దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే రావడం శుభపరిణామమని చెప్పారు.



# గ్రీవెన్స్ రద్దు

గుంటూరు క్రైమ్, ఫిబ్రవరి15,ప్రభాతవార్త: శివరాత్రి పర్వదినం బందోబస్తు నేపథ్యంలో నేడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వ హించే గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు .కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి, పోలీస్ వారికి సహకరించవలసినదిగా విజ్ఞప్తి చేయడం జరిగింది..

# భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**కొల్లిపర,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దీనిలో భాగంగా మండల పరిధిలోని మున్నంగిలో చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీశీవేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అదేవిధంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో ఉదయమే బిందెతీర్థం,నిత్యహోమం,



బలిహరణ విధి వంటి పూజలతో పాటు 108 మట్టి లింగాలకు అర్చన వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొల్లిపర పిచ్చయ్యశర్మ,కొల్లిపర నిరంజన్‌శర్మలు అత్యంత ఘనంగా నిర్వహించారు.మహాశివరాత్రి..ఓం నమః శివాయః నామస్మరణతో మహాన్యాసపూర్వకముగా ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. కళ్యాణ పందిరి జగజ్యోతి మహోత్సవం జరిగింది.భక్తులు స్వామివారిని దర్శించుకుని ఓం నమః శివాయః నామస్మరణతో మార్మోగించారు. రాత్రి స్వామివారికి నిత్యహోమం, బలిహరణ విధి వంటి కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం జరిగింది. శ్రీవిఘ్నేశ్వర స్వామి పూజ, పుణ్యాహ వచన, పాణిగ్రహణ విధి,కళ్యాణ పీఠార్చనవిధి, మహాసంకల్పం, మంగళాష్టకాని వాచయేత్, చూర్ణికా మహోత్సవం సుముహూర్తం,దర్భణే ప్రతిబింబదర్శన విధి,మాంగళ్యధారణ లోకకళ్యాణార్థం కళ్యాణ మహోత్సవం, తలంబ్రాలు, బ్రహ్మగ్రంధి విధి,మంగళ ధీపోత్సవం వంటి ప్రత్యేక పూజలు స్వామి వారికి నిర్వహించారు.అర్చకులు పిచ్చయ్యశర్మ వివాహం కాని వారికి శుభం కలుగుతుంది.. మహాశివరాత్రి జాతర,జాగరణ చేసిన వారికి శుభం కలుగుతుంది.అంటూ దీవించారు.మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని వివిధ శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.స్వామి వారి కళ్యాణాన్ని చూడటానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయాలు విద్యుత్ దీపాలతో దగదగ మెరిసాయి. శివనామస్మరణతో ఆలయాల్లో భక్తులు మారుమ్రోగించారు. శివాలయ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాల ఈవోలు పద్మలత, శ్రీనివాసరెడ్డి భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారు.



## కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రత్తి పాడు ఎమ్మెల్యే దంపతులు

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం పల్నాడు జిల్లా, కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా మాజీ కలెక్టర్, పబ్లిక్



అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, జయమ్మ దంపతులు ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ శైవక్షేత్రాన్ని దర్శించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై మాటామంతి నిర్వహించారు. ఈ పర్వదినాన భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శివనామస్మరణతో వాతావరణాన్ని ఆధ్యాత్మికంగా మార్చుకున్నారని వివరించారు.ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించి సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ...మహా శివరాత్రి హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినం అన్నారు. ఈ రోజు ఉపవాసం, జాగరణ, శివారాధన ద్వారా మనసును పవిత్రం చేసుకునే అవకాశం కలుగుతుందని, పరమశివుని అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు.పరమశివుని కటాక్షంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి పోలవరం పూర్తి కావాలని, రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని త్రికోటేశ్వర స్వామి వారిని ప్రార్థించిన్నట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు.అనంతరం ప్రజలందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు మర్రి సాంబశివరావు, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ మీడియా సెల్ కన్వీనర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి అవినాష్, బాలాజీ, తదితర కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## శ్రీ మహాలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ప్రత్తి పాడు వైకాపా సమన్వయకర్త బలసాని


**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం, మల్లవరం గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మహాలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారిని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాన్ని దర్శించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి బలసానికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమై మాటామంతి నిర్వహించారు. ఈ పర్వదినాన భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి శివనామస్మరణతో వాతావరణాన్ని ఆధ్యాత్మికంగా మార్చుకున్నారని వివరించారు.వైసీపీ సమన్వయకర్త కిరణ్ కుమార్ కు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వైసిపి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించి సత్కరించారు.ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ..మహా శివరాత్రి హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినం అన్నారు. ఈ రోజు ఉపవాసం, జాగరణ, శివారాధన ద్వారా మనసును పవిత్రం చేసుకునే అవకాశం కలుగుతుందని, పరమశివుని



అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు లభించాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనసారా కోరుకుంటున్నాట్లు తెలిపారు.పరమశివుని కటాక్షంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, కూటమి నేతలకు మంచిబుద్ధి కలగాలని, రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని స్వామి వారిని ప్రార్థించిన్నట్లు చెప్పారు. అనంతరం ప్రజలందరికీ మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. బలసాని వెంట వైసిపి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. అనంతరం గుంటూరు నందన హాస్పిటల్ లో కిడ్నీ ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న రాష్ట్ర మాజీ ఆర్ అండ్ బి డైరెక్టర్, పార్టీ సీనియర్ నాయకురాలు పిల్లి మేరి ని కలిసి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రలు భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. ముట్లూరు, వట్టిచెరుకూరు, కాట్రపాడు, చమళ్ళమూడి,వింజనంపాడు, యామర్రు,



కొర్నెపాడు, చింతపల్లిపాడు, పల్లపాడు, అనంతవరప్పాడు, తైతల గ్రామాల్లోని శివాలయాలు శివాలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలకు రావడం జరిగింది.ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, రుద్రాభిషేకం, బిల్వ అర్చన, అలంకరణ, పూజ కార్యక్రమాలను నిర్వహించి, మహా మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. మహాశివరాత్రి ఆదివారం ప్రారంభమై శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం ఫిబ్రవరి 16న ముగియడం చాలా విశేషం అన్నారు. ఈరోజు సర్వార్ధ సిద్ధియోగం ఉండడం వల్ల భక్తులు చేసే పూజలకు రెట్టింపు ఫలితం లభిస్తుందని వివరించారు. విష్ణుమూర్తికి ఇష్టమైన శ్రవణ నక్షత్రం ఈ సమయంలో ఉండడం వల్ల శివకేశవుల అనుగ్రహం ఒకేసారి పొందే అవకాశం లభిస్తుందని అర్చకులు తెలియజేశారు. గ్రహాల స్థితి అనుకూలంగా ఉండడం వల్ల ఈ రాత్రి చేసే జాగరణ మరియు ధ్యానం, మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఆలయంలో మహాశివ రాత్రి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభించారు.పార్వతి పరమేశ్వర కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహాశివ రాత్రి సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దేవాలయాల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఎస్సై బాబురావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆనందమయి జీవితానికి యోగ,ధ్యానం చాలా అవసరం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ఆరోగ్యసభలో ప్రముఖ యోగాచార్యులు ప్రొఫెసర్ కొండయ్య,సాంబశివరావు లు యోగాభ్యాసాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకొని జీవించాలని ప్రశాంత తకు ఆనందంగా ఉండేందుకు యోగా,ధ్యానం,ప్రాణాయామం చాలా అవసరమని అన్నారు.అవగాహన కార్యాలయంలో యోగ ధ్యానం ప్రాణాయామలతో ఆరోగ్యం అన్న అంశంపై జరిగిన ఆరోగ్యసభకు అవగాహన యోగాకేంద్రం అధ్యక్షులు యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అధ్యక్షత వహించారు.ప్రొఫెసర్ కొండయ్య గురూజీ మాట్లాడుతూ చాలా మందికి వారి అస్తవ్యస్త విధి జీవితాల నుంచి యోగా ఉపశమనాన్ని ఇవ్వగలరని యోగా చేయడం వల్ల శరీరానికి నూతన ఉత్సాహం కలుగుతుందన్నారు.ప్రముఖ యోగాచార్యులు ప్రొఫెసర్ గుంటుపల్లి సాంబశివరావు మాట్లాడుతూ ప్రాణాయామం,ధ్యానం యొక్క సమ్మేళనమే యోగ అన్నారు.యోగాచార్యులు కేశవరావు గురూజీ మాట్లాడుతూ ప్రాణాయామం లాంటి శ్వాస వ్యాయామాలు కార్టిసాల్ స్థాయిని తగ్గిస్తాయని ,ధ్యానం మనస్సును శాంత పరుస్తుందని ఆందోళనను తగ్గిస్తుందన్నారు.శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని యోగాచార్యులు కొండయ్య,సాంబశివరావు, కేశవరావు గురూజీ లను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభలో యోగా శిక్షకులు ఎన్.సదాశివం అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఉప్పుటూరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ, పాలు, త్రాగునీరు పంపిణీ

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లా, అమరావతి పుణ్యక్షేత్రంలో ఉప్పుటూరి సేవా ట్రస్ట్, యుఎస్‌ఏ ఎన్నారై మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ, పాలు, త్రాగునీరు అందించ నున్నట్లు ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధ్యక్షులు, పుల్లడిగుంట గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఉప్పుటూరి చిన రాములు, ప్రముఖ ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్ చౌదరి ఆది వారం తెలిపారు. ఈ సందర్భంగా చిన రాములు మాట్లాడుతూ.. మహాశివ అవకాశాలు లభించాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి హిందూ సంప్రదా యంలో అత్యంత పవిత్రమైన పర్వదినం అన్నారు. ఈ రోజు ఉపవాసం, జాగారణ, శివారాధన ద్వారా మనసును పవిత్రం చేసుకునే అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పల్నాడు జిల్లా, పెదకూరపాడు శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ అమరావతి పుణ్యక్షేత్రాన్ని దర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలిస్తున్న




రాత్రి ఉత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లాలోని అమరావతి పుణ్యక్షేత్రానికి వచ్చిన భక్తులకు 6వందల లీటర్ల పాలు, పది వేల మజ్జిగ ప్యాకెట్లు, పదివేల వాటర్ బాటిళ్లతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు వాలంటీర్స్ తో అందించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అమరావతి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు త్రాగునీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్స్ ప్యాకెట్లను అందిస్తున్నట్లు చెప్పారు. మహాశివ రాత్రి పర్వదినం సందర్భం గా అమరావతి పుణ్య క్షేత్రాన్ని దర్శించిన భక్తులందరికీ మంచి జరగాలని, పరమశివుని కటాక్షంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి క్రమంలో గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టి చెరుకూరు మండలం, పుల్లడి గుంట గ్రామానికి చెందిన ఉప్పుటూరి సేవా ట్రస్ట్ వారు భక్తులకు ఉచితంగా మజ్జిగ, పాలు, తాగునీరు అందించడం చూసి ఆనందం వ్యక్తం చేసి భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఉప్పుటూరి సేవా ట్రస్ట్‌ను అభినందించారు. తాను కూడా భక్తులకు ఉప్పుటూరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, పాలు, మంచినీరు బాటిల్స్ ను తన చేతులు మీదుగా భక్తులకు అందించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, దేవుని కృపకు పాత్రులయ్యారు.


### శివనామస్మరణతో మార్మోగిన

# సంగమేశ్వరాలయం

- -వివిధ రకాల విద్యుద్దీపాలతో అలంకరణ
- -భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు
- -వేకుజాము నుంచే రుద్రాభిషేకాలు ప్రారంభం
- -కనువిందు చేస్తున్న విద్యుత్ ప్రభలు
- -గ్రామాల్లో రంగవల్లులను తీర్చిదిద్దిన మహిళలు

**ఆరెమండ(పొన్నూరు), ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివాలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగిపోయాయి. శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు వివిధ ప్రాంతాల నుంచి దేవాలయాలకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని సంబధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీశైలంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ప్రతి దేవాలయం వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బంది కూడా విధులు నిర్వహించారు. వేకువ జామునుండే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాల్లో పాల్గొన్నారు. దేవాలయాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో, బంతి, కారబంతి, అరటి బోదెలు, కొబ్బరి మంటలతో దేదీప్య మానంగా అలంకరించారు. భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో భగవంతుని దర్శనం చేసుకొనేందుకు పెద్ద పెద్ద క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున విద్యుత్ ప్రభలను సిద్దం చేశారు. మండల పరిధిలోని తాళ్ళపాలెం, ఆరెమండ గ్రామాలకు సంబంధించిన సంగమేశ్వరస్వామి వారి దేవాలయం వద్ద దేవాలయం మేనేజర్ మల్లెల రమేష్ ఆధ్వర్యంలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు. శ్రీ గంగా పార్వతీ సమేత సంఘమేశ్వరస్వామివారికి పూజాధికార్యక్రమాలు





శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పెద్ద ఎత్తున రంగవల్లులు తీర్చిదిద్ది స్వాగతం పలికారు. పొన్నూరు నుంచి పొట్టేళ్ళతో ఆరెమండ సంగమేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళిన ప్రభ విశేషంగా ఆకట్టుకుంది. తాళ్ళపాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన ప్రభ వద్ద జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపారు. అనంతరం కార్యకర్తలు ప్రభను ఆరెమండ సంగమేశ్వం స్వామి దేవాలయం వద్దకు తరలించారు. సంగమేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన డొక్కు వెంకటేశ్వర్లు, డొక్కు నవీన్‌కుమార్ తదితరులు ఏర్పాటు చేసిన ప్రభ విశేషంగా ఆకట్టుకొంది. దేవాలయం వద్ద భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు, దాతల ఆధ్వర్యంలో వివిధ రకాల పులిహోర, చక్కెరపొంగలి, దద్యోధనము, కేసరి తదితరాలను పంపిణీ చేశారు. పలు చోట్ల మంచినీరు, మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి నేతృత్వంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం!

-పిలుపునిచ్చిన వైకాపా రాష్ట్ర ఎస్సీసెల్ మాజీ కార్యదర్శి డక్కుమళ్ళ రవి

**పొన్నూరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బూత్,వార్డు స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి డక్కుమళ్ళ రవి పిలుపునిచ్చారు. పురపాలక సంఘ పరిధిలోని9వ వార్డులో వార్డు అధ్యక్ష కమిటీలతోపాటు వివిధ అనుబంధ సంఘాలకు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డక్కుమళ్ళ రవి మాట్లాడుతూ మన జగన్మోహనరెడ్డి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసినప్పటికీ ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో పూర్తిగా విఫలమయ్యామని అందుకే ఓటమి పాలు కావాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైఫల్యాలను, వారి చెప్పే అసత్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలన్నారు. పార్టీ అనుబంధ కమిటిలు చురుగ్గా పనిచేస్తే రాన్నున్న 2029 ఎన్నికల్లో మళ్ళీ మన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావచ్చన్నారు. మైనార్టీసెల్ నియోజకవర్గ నాయకుడు షేక్ నాజర్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్టానం దృష్టి సారించిందన్నారు. పార్టీ అనుబంధ సంఘాల నియామకం పూర్తయ్యాక ప్రతి సభ్యుడికి ఐడి కార్డు ఇవ్వడంతోపాటు పార్టీకి సంబంధించిన పలు బాధ్యతలను అప్పగించేందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ప్రణాళికలను రూపొందిస్తున్నారన్నారు. పార్టీ గెలుపుకు



కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు,పట్టన మైనార్టీ అధ్యక్షుడు పీర్‌సాహెబ్, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు షేక్ గౌస్ బాష,పట్టణ యువజన నాయకుడు బండారు నాగరాజు, నాయకులు చొప్పర రవి, బలగాని నాగరాజు, పలగాని రమేష్, కాటూరి విజయ్, సాంబయ్య, పుట్లూని రవి, ఈవూరి శ్రీనివాస్, పాలపర్తి విజయ్, పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 15(ప్రభాతవార్త):** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుఝామునుండే భక్తులు తరలివచ్చి,ఆ పరమశివునికి అభిషేకాలు విశేషపూజలతో,మొక్కులు చెల్లించుకుంటున్నారు. క్యూలైనలో ఎలాంటి రద్దీ ఏర్పడకుండా ఆలయఅధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. స్థానిక గంగానమ్మపేట లోని శ్రీ పర్వతవర్ధినీ సమేత శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో,ఆలయ కార్య నిర్వాహణాధికారి రమణకుమారి ప్రత్యేక పర్యవేక్షణలో,అర్చకులు, సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించారు. ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఫిబ్రవరి 17 వరకు ఆరురోజుల పాటు కొనసాగుతాయని ఈఓ రమణకుమారి






తెలిపారు.అలాగే రామలింగేశ్వరపేట లోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో, కార్యనిర్వాహణాధికారి హరి ప్రసాద్ ,అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర శివ వరప్రసాద్, ఆధ్వర్యంలో ఆలయంలో,భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలతో ఎప్పటికప్పుడు అర్చకులు, సిబ్బంది సహకారంతో ఏర్పాట్లు చేశారు.దేవాలయం వద్ద భక్తులకు అవసరమైన త్రాగునీరు,ఉచిత ప్రసాద వితరణ అందుబాటులో ఉంచామని ఈఓ హరి ప్రసాద్ తెలిపారు.

## సహస్రలింగేశ్వరస్వామికి విశేషార్చనలు


పొన్నూరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త: పట్టణంలో కొలువై ఉన్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామివారి దేవాలయంలో



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి విశేషార్చనలు నిర్వహించారు. వేకువ జామునుంచే గణపతి హోమాలు, రుద్రహోమాలు, రుద్రాభిషేకాలు, తదితర పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ సహస్రలింగేశ్వరస్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాల నిర్వహించారు. మూలవిరాట్‌కు ఉన్నటువంటి గంధాన్ని ఒలిచి నిజరూప దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారికి చందనాన్ని సమర్పించారు. రాత్రి స్వామివారికి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అత్యంత మహిమ గల స్వామివారుగా, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ళ సందర్భంగా దేవాలయ ప్రాంగణమంతా రంగు రంగుల విద్యుద్దీపాలతో, మామిడి తోరణాలతో, అరటి బోదెలతో, కొబ్బరి మట్టలతో ఘనంగా అలంకరించారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## భక్తిశ్రద్ధలతో శాంతి కళ్యాణం

**పొన్నూరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** పట్టణంలో కొలువై ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ సహస్రలింగేశ్వరస్వామి వారి శాంతి కళ్యాణాన్ని తిలకించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి శ్రీ స్వామివారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. ముందుగా ఉభయ దాతలుగా పేర్లు నమోదు చేసుకున్నవారు స్వామివారికి ముత్యాల తలంబ్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకస్వాములు పోగుల శ్రీనివాసశర్మ, పొన్నూరు నాగమారుతీసాయి, పొన్నూరు రఘు కిషోర్ శర్మ కళ్యాణోత్సవానికి సంబంధించిన పూజాధికార్యక్రమాలను పూర్తి చేశారు. కళ్యాణం ఆద్యంతం భక్తులను భక్తిపారవశ్యంలోకి ముంచెత్తింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. శివరా త్రి సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుదీకరణభక్తులను విశేషంగా ఆకట్టుకొంది. చూపరులకు కనువిందు చేసింది. దేవాలయం కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ నేతృత్వంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.



## ఓం నమశ్శివాయ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

పెదనందిపాడు ఫిబ్రవరి 15(ప్రభాతవార్త) శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం వేకువ జాము నుండే శైవ క్షేత్రాలలో అభిషేకాలు కోలాహలంగా ప్రారంభమైనాయి. పెదనందిపాడు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర శర్మ. సోమరాజు పల్లి వెంకటేశ్వర్లు .పొన్నూరు భార్గవ కుమార్. శరత్ కుమార్ శర్మలు గణపతి హోమం. లక్ష్మీ గణపతి హోమం.రుద్ర హోమం. దుర్గా స్థపతి (చండి) హోమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ దాసరి శేషగిరిరావు. అధ్యక్షులు ముద్దన నగరాజుకుమారి. తడవర్తి సురేష్. దాసరి సత్యనారాయణ. వెలినేని కృష్ణారావు. లక్ష్మీ శివరామ ప్రసాదు. వీరేంద్ర గుప్తా.అర్జున్ రావుల నేత్రత్వంలో వేలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి స్వామివారి కల్యాణము. లింగోద్భవ. అన్నాభిషేకం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.



16-2pg10 12 VJA_16-2pg10.qxd 16/Feb/26 12:07 AM Page 1






# ఇషాన్‌దార్

## కొలంబోలో భారత్ శివతాండవం

## బుమ్రా మ్యాజిక్ - చిత్తుగా ఓడిన పాక్

*దాయాది పాకిస్థాన్‌పై చరిత్ర పునరావృతమైంది. బంగ్లాదేశ్ సమస్యలో దూరి బాయ్ కాట్ చేస్తానంటూ ఆగ్నికి ఆజ్యం పోసిన పాకిస్థాన్‌పై కొలంబో ప్రేమదాస స్టేడియంలో భారత్ శివతాండవం చేసింది. మొదట బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో ఓ ఆటేసుకుంది. ఇషాన్ కిషన్ షాన్ ధార్ ఇన్నింగ్‌కు పాక్ బౌలింగ్ దాసోహం అంటే...బూమ్ బూమ్ బుమ్రా, హార్దిక్ మైసైల్స్‌కు పాక్ బ్యాట్స్‌మెన్ తోక ముడిచారు. ఇక స్పిన్లర్లు పాక్ చాపచుట్టేశారు.*

| భారత్ | ఓవర్లు | పాకిస్థాన్ |
|---|---|---|
| 1/1 | 1 | 0/1 |
| 16/1 | 2 | 13/3 |
| 25/1 | 3 | 21/3 |
| 30/1 | 4 | 25/3 |
| 41/1 | 5 | 34/4 |
| 52/1 | 6 | 38/4 |
| 65/1 | 7 | 47/4 |
| 82/1 | 8 | 57/4 |
| 89/2 | 9 | 66/4 |
| 92/2 | 10 | 71/4 |
| 98/2 | 11 | 73/5 |
| 108/2 | 12 | 78/5 |
| 118/2 | 13 | 84/7 |
| 125/2 | 14 | 89/7 |
| 127/4 | 15 | 94/7 |
| 136/4 | 16 | 97/9 |
| 140/4 | 17 | 106/9 |
| 154/5 | 18 | 114/10 |
| 159/5 | 19 | |
| 175/7 | 20 | |

**కొలంబో:** భారత అభిమానుల అంచనాలను నిలబెడుతూ టీ20 ప్రపంచకప్ హైవోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా... చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 176 పరుగుల లక్ష్యచేధనలో దాయాది జట్టు బ్యాటింగ్ పేకమేడలా కూలింది. భారత బౌలర్ల ధాటికి మరో రెండు ఓవర్లు ఉండగానే 114 పరుగులకు కుప్పకూలింది.

**బూమ్ బూమ్ బుమ్రా**

176 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌ను భారత బౌలర్లు ఆడుకున్నారు. ఫర్హాన్‌ను డకౌట్ చేసి హార్దిక్ పాండ్య పాక్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాతి ఓవర్లో యార్కర్ల కింగ్ బుమ్రా మ్యాజిక్ చేశాడు. మొదటి బంతికి అయూబ్‌కు లక్కీ సిక్స్ లభించినా, రెండో బంతికి పర్‌ఫెక్ట్ యార్కర్‌తో బోల్తా కొట్టించాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘాను కూడా వచ్చిన దారినే పెవిలియన్‌కు పంపాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన అక్షర్ పటేల్ కూడా బాబర్ ఆజమ్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో పాకిస్థాన్ 34 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

**సరిపోని ఉస్మాన్ మెరుపులు**

పాక్ శిబిరంలో కాసేపైనా ఆనందం ఉందంటే ఉస్మాన్ ఖాన్ ఆడినంతసేపే. అతని మెరుపులు కూడా పాక్‌ను గట్టెక్కించలేకపోయాయి. 34బంతుల్లో 6 బౌండరీలు, ఒక సిక్స్‌తో 44 పరుగులు చేసిన అతన్ని అక్షర్ పటేల్ తెరదించాడు. ఆ తర్వాత పాక్ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. వచ్చిన బౌలర్ వచ్చినట్లే వికెట్లు తీస్తూ పోయారు. ఆఖరుకు తిలక్ వర్మకు కూడా వికెట్ దక్కింది. దీంతో పాకిస్తాన్ ఇన్నింగ్స్ 114 రన్స్‌కే కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా, హార్దిక్, అక్షర్, వరుణ్ చక్రవర్తిలు రెండేసి వికెట్లు.. కుల్‌దీప్, తిలక్ ఒక్కో వికెట్‌తీశారు.

**నిరాశపరిచిన అభిషేక్**

టాస్ నెగ్గి మొదట భారత్‌ను బ్యాటింగ్‌కు దింపిన పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా.. సర్‌ప్రైజింగ్‌గా తనే బౌలింగ్‌కు దిగాడు. జట్టులోకి వచ్చిన అభిషేక్‌తో కలిసి ఇషాన్ కిషన్ భారత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. రెండో బంతికి సింగిల్ తీసి పరుగుల ఖాతా తెరిచాడు. తొలి బంతికే సిక్స్‌తో విరుచుకుపడే విధ్వంసకర ఓపెనర్ అభిషక్ తన శైలికి భిన్నంగా మొదటి మూడు బంతులు డాట్‌గా ఆడాడు. చివరి బంతికి భారీ షాట్ ఆడే ప్రయత్నంలో మిడాన్‌లో షహీన్ అఫ్రిదికి తేలికైన క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ ఒక పరుగుకే తొలి వికెట్ కోల్పోయింది.

**ఇషాన్‌ధార్ ఇన్నింగ్**

క్రీజ్‌లోకి వచ్చిన తిలక్‌వర్మతో కలిసి ఇషాన్ కిషన్ షాన్‌ధార్ ఇన్నింగ్ ఆడాడు. స్పిన్‌నే నమ్ముకున్న పాక్‌పై చెలరేగాడు. శివరాత్రి నాడు శివతాండవం చేశాడు. షహీన్ అఫ్రిదిని సిక్స్‌తో ఆహ్వానించిన ఇషాన్.. ఆ ఓవర్లో మరో రెండు బౌండరీలు బాదాడు. క్రీజ్‌లో ఉన్నంత సేపు ఇషాన్ విభిన్న షాట్లతో అలరించాడు. అయిదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన అబ్రార్‌ను సిక్స్, ఫోర్‌తో వెల్‌కమ్ చెప్పిన ఇషాన్... అయూబ్ ఓవర్లో మరో రెండు ఫోర్లతో భారత్ స్కోరును 50 పరుగులు దాటించాడు.

**శివతాండవం**

అబ్రార్ మరో ఓవర్‌లో ఇషాన్ వరుసగా మూడు ఫోర్లు కొట్టి టీ20ల్లో తొమ్మిదో హాఫ్ సెంచరీ నమోదుచేశాడు. ఆ తర్వాత కూడా ఇషాన్ జోరు తగ్గలేదు. షాదాబ్ వేసిన 8ఓవర్లో ఓ సిక్స్, ఓ ఫోర్‌తో సహా మొత్తం 17రన్స్ సాధించాడు. బౌలింగ్‌కు దిగిన మరో స్పిన్నర్ అయూబ్ ఓవర్లో రివర్స్‌షాట్ ఆడి బౌండరీ సాధించిన ఇషాన్.. తరువాతి బంతికి మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బౌల్డ్ అయ్యాడు. 40 బంతుల్లో 10 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 77 పరుగుల ఇషాన్ మెరుపు ఇన్నింగ్ ఈ విధంగా ముగిసింది.

**ఒక్కసారిగా తడబాటు**

ఇషాన్ ఇన్నింగ్స్ తర్వాత భారత్ ఒక్కసారిగా తడబడింది. సూర్యకుమార్, తిలక్ మధ్యమధ్యలో బౌండ రీలు బాదినా అనుకున్న రీతిలో పరుగుల వేగం పెంచలేకపోయారు. 36బంతుల్లో కేవలం 38 పరుగులే చేశారు. అయూబ్ ఈ దశలో ఒక్కసారిగా ఝలక్ ఇచ్చా డు. 25 రన్స్ చేసిన తిలక్‌ను ఎల్బీ చేసిన అయూబ్... తరువాతి బంతికే హార్దిక్‌ను డకౌట్ చేశాడు. హాట్రిక్ మీదున్న అయూబ్.. దూబేను కూడా దాదాపు అవుట్ చేసినంత పనిచేశాడు. 15ఓవర్లకు భారత్ స్కోరు 127 పరుగులే.

**దూబే మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో దూబే బ్యాట్‌కు పనిచెప్పాడు. 17 బంతుల్లోనే మూడు ఫోర్లు ఓ సిక్స్‌తో 27 రన్స్ చేశాడు. నిలకడగా ఆడిన సూర్యకుమార్ (29 బంతుల్లో 32) తారిక్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడి అవుటయ్యాడు. షహీన్ అఫ్రిది వేసిన చివరి ఓవర్లో రింకూ సింగ్ ఓ సిక్స్, బౌండరీ సాధించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 రన్స్ చేసింది. పాక్ బౌలర్లలో అయూబ్ మూడు వికెట్లు తీశాడు.

**స్పిన్‌నే నమ్ముకున్న పాక్**

టీమిండియాతో మ్యాచ్‌లో పాకిస్థాన్ స్పిన్నర్లనే నమ్ముకుంది. ఎంతలా అంటే ఆజట్టు పేస్ అటాక్ షహీన్ అఫ్రిదిని కేవలం రెండు ఓవర్లకే పరిమితం చేసేంతగా. మిగతా 18 ఓవర్లంతా స్పిన్నర్లే. పాక్ ఏడుగురు బౌలర్లలో ఆరుగురు స్పిన్నర్లు.



## పాక్‌పై భారత్-ఎ విమెన్ టీమ్ ఘనవిజయం



**బ్యాంకాక్:** మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్‌లోనూ పాకిస్థాన్‌కు భారత్ షాకిచ్చింది. దాయాదిని భారత్-ఎ మహిళల టీమ్ చిత్తు చిత్తుగా ఓడించింది. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాక్-ఎ జట్టు 18.5 ఓవర్లలో 93 రన్స్‌కే ఆలౌటైంది. భారత బౌలర్లు సైమా, రాధా, ప్రేమా రావత్ తలో రెండు వికెట్లు తీసి పాక్ పతనాన్ని శాసించారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత-ఎ మహిళల జట్టు 10 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పయి అందుకుంది. పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయినా.. వ్రిందా దినేష్ 55 రన్స్, అనుష్క శర్మ 24 రన్స్‌తో రాణించి విజయాన్ని అందించారు.

## సూపర్-8లో వెస్టిండీస్

**ముంబయి:** వెస్టిండీస్ హ్యాట్రిక్ విజయాలతో టీ20 ప్రపంచకప్ సూపర్8లో ప్రవే శించింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్-సీ మ్యాచ్‌లో వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘనవిజ యం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్‌ను విండీస్ బౌలర్లు కుప్పకూల్చారు. జాసన్ హోల్డర్ బౌలింగ్ ధాటికి నేపాల్ 46 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో దీపేంద్ర సింగ్ క్రీజ్‌లో నిలదొక్కుకుని 47 బంతుల్లో 58 రన్స్ చేశాడు. లోయర్ ఆర్డర్‌లో సోంపాల్ 26 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 133 రన్స్ చేసింది.

ఈ లక్ష్యాన్ని విండీస్ ఒక వికెట్ కోల్పోయి 15.2 ఓవర్లలోనే చేధించింది. బ్రాండమ్ కింగ్‌తో తొలి వికెట్‌కు 43 పరుగులు చేసిన షాయ్ హోప్... రెండో వికెట్‌కు హెట్మైర్‌తో కలిసి రెండో వికెట్ కు అజేయంగా 81 రన్స్ చేసి విండీస్‌కు విజయాన్ని అందించాడు.

## నమీబియాపై అమెరికా సూపర్ విక్టరీ



**చెన్నై:** క్రికెట్ కూనల మ్యాచ్‌లో అమెరికా సూపర్ విక్టరీ సాధించింది. గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో నమీబియాపై 31 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా బ్యాటింగ్‌లో ఇరగ దీసింది. ఓపెనర్ మోనాక్ పటేల్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. 30 బంతుల్లో 52 రన్స్ చేశాడు. మిడిల్ ఆర్డర్‌లో సంజయ్ కృష్ణమూర్తి కూడా ధాటిగా ఆడడంతో అమెరికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 రన్స్ చేసింది. కృష్ణమూర్తి 33 బంతుల్లో వేగంగా 68 రన్స్ చేశాడు.

200 పరుగుల లక్ష్యాన్ని సాధించలేక నమీబియా చతికిలపడింది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 రన్స్ మాత్రమే సాధించగలిగింది. ఓపెనర్ స్టీన్‌కంప్ 58 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అమెరికా బౌలర్లలో షాండ్లేవాన్ రెండు వికెట్లు తీశాడు.

## వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే పతకాల పంట



**మిలాన్:** ఇటలీలో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో నార్వే దూసుకుపోతోంది. మొత్తం 22 మెడల్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతోంది. ఇందులో 11 స్వర్ణాలు, నాలుగు సిల్వర్, ఏడు బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. అతిథ్య ఇటలీ ఆరు స్వర్ణాలతో సహా 17 మెడల్స్‌తో రెండో స్థానంలో ఉంది. అమెరికాకు ఈసారి మెడల్స్ సాధించడంలో వెనకబడిది. కేవలం అయిదు స్వర్ణాలు మాత్రమే అమెరికా సాధించింది. నార్వేకు చెందిన క్రాస్ కంట్రీ స్కియర్ జోహాన్స్ క్లీబో ఏకంగా నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాడు. స్విట్జర్లాండ్ కు చెందిన ఫ్రాంజజో వాన్ అల్మైన్.. ఆల్పైన్ స్కియర్ విభాగంలో మూడు స్వర్ణాలు గెలుపొందాడు. భారత్ నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నా... ఇప్పటివరకు మెడల్స్ బోణీ చేయలేదు.




## టాప్ ఆరు కంపెనీల్లో రూ.3లక్షల కోట్ల ఎంక్యాప్ కోత

**ముంబయి, ఫిబ్రవరి 15:** మార్కెట్‌లోని టాప్ పదికంపెనీల్లో ఆరు కంపెనీల మార్కెట్‌విలువలు రూ.3 లక్షలకోట్లు కోతకు గురయ్యాయి. ఐటి మేజర్ కంపెనీలు టిసిఎస్, ఇన్ఫోసిస్ వంటి రెండు కంపెనీలు కూడా భారీగా మార్కెట్ విలువలు కోల్పోయాయి. ఈక్విటీల్లో నెలకొన్న మందగమనమే ఇందుకు కారణమని తెలుస్తోంది. టిసిఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతి ఎయిర్‌టెల్ వంటివి వాటి మార్కెట్‌విలువల్లో తగ్గుదలను చవిచూసాయి. స్టేట్‌బ్యాంకు, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఐసిఐసిఐబ్యాంకులు లాభాలు పొందినట్లుతెలుస్తోంది. టిసిఎస్ మార్కెట్ విలువలు 90,198.92 కోట్లు క్షీణించి రూ.9,74,043.43 కోట్లుగా ఉంది. ఇన్ఫోసిస్ విలువలు కూడా 70,780.23కోట్లు క్షీణించి రూ.5,55,287.72 కోట్లుగా ఉంది. ఇక హెచ్‌డిఎఫ్‌షిబ్యాంకు మారెనకట్ విలువలు రూ.54,627.71 కోట్లు క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.41,883 కోట్లు క్షీణించి రూ.19,21,475.79 కోట్లకు చేరింది. జీవితబీమా సంస్థ మార్కెట్ విలువలు కూడా 23,971.74 కోట్లు క్షీణించి 5,46,226.80 కోట్లకుచేరితే భారతి ఎయిర్‌టెల్ మార్కెట్‌క్యాప్ రూ.19,244.61 కోట్లు క్షీణించి రూ.11,43,044,03 కోట్లుగాఉంది. ఇక ఎస్‌బిఐ విలువలుమాత్రం రూ.1,22,213.38 కోట్లుపెరిగి రూ.11,06,566.44 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ కూడా రూ.26,414.44కోట్లు పెరిగి రూ.6,37,244.64కోట్లకు చేరింది. ఎల్‌అండ్‌టి కూడా రూ.14,483.9కోట్లు పెరిగి రూ.5,74,028 కోట్లకు చేరింది. ఐసిఐసిఐ బ్యాంకు ఎంకాప్ కూడా 5719.95 కోట్లు పెరిగి రూ.10,11,978.77 కోట్లకు చేరినట్లు తేలింది. టాప్ పదికంపెనీల్లో ఇప్పటికీ రిలయన్స్ టాప్‌లోనే నిలిస్తే ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి ఇన్ఫోసిస్, ఎల్‌ఐసిలు నిలిచాయి.

## ఇండో యుఎస్ ట్రేడ్ డీల్‌తో ట్రాక్టర్ల ఎగుమతులకు మంచి ఛాన్స్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** ఇండో యుఎస్ ట్రేడ్‌డీల్‌తో అమెరికాకు ట్రాక్టర్ల ఎగుమతికి పుష్కల అవకాశాలున్నట్లు కంపెనీలు చెపుతున్నాయి. ఎస్కార్ట్స్ కుబోటా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ 2030 మద్యంతర వృద్ధి ప్రణాళికలో కంపెనీకి ఎగుమతులు మార్కెట్‌పెరుగుతుందని అంచనా వేసింది. కంపెనీ మాతృసంస్థ కుబోటా జపాన్‌కు చెందిన కంపెనీ ఇప్పటివరకూ అమెరికాకు ఎగుమతులుచేయడంలేదని, ఇపుడు సుంకాల సమస్య పరిష్కారం కావడంతో ఎస్కార్ట్ కుబోటా ట్రాక్టర్లను ఇకపై అమెరికాకు సైతం ఎగుమతులుచేస్తామని కంపెనీ పూర్తికాలపు డైరెక్టర్ సిఎఫ్ఒ భారత్ మదన్ తెలిపారు. ఇప్పటివరకూ మా మాతృసంస్థ కుబోటా జపాన్‌నుంచి ఎగుమతులుచేస్తోందని, సుమారు 15శాతం ఎగుమతులు నమోదయినట్లు ఆయన తెలిపారు. అలాగే భారత్‌నుంచి కూడా 18శాతం ఎగుమతులు వెళతాయన్నారు. ఎక్కువ వృద్ధికారక మార్కెట్లపైనే కుబోటా ఫోకస్ పెంచిందని భారత్‌ను తమకు గ్లోబల్ హబ్‌గా మార్చుకుంటుందని కూడా చెప్పారు. అమెరికాకు ఎగుమతులు పెరిగితే కంపెనీకి వ్యయభారం కూడా ఆదా అవుతుందన్న భావనతో సిఎఫ్ఒ ఉన్నారు. ఇక ఇండియా ఈయూ ఎఫ్‌టిఎ పరంగా చూస్తే ఇప్పటికే ట్రాక్టర్లపై సుంకాలు లేవని, ఈ ఒప్పందం తర్వాత ట్రాక్టర్ల ఎగుమతులకు సంబంధించి పెద్దగా ప్రభావం ఉండబోదన్నారు. ఇప్పటికే తాము ఈయూకు ఎగుమతులు చేస్తున్నామన్నారు. దేశీయ మార్కెట్ పరంగా ట్రాక్టర్ రంగం మంచి వృద్ధిపథంలోకి వస్తుందని, జీఎస్టీ రేట్ తగ్గింపుతో మూడోత్రైమాసికంలో 23శాతం వృద్ధిని నమోదుచేసినట్లు కంపెనీ డైరెక్టర్ తెలిపారు.

## లెనోవో నికరలాభం రూ.8145కోట్లు




**ముంబయి, ఫిబ్రవరి 15:** లెనోవో ఇండియా మూడో త్రైమాసికంలో తన నికరలాభాల్లో ఏడుశాతం నమోదుచేసింది. రూ.8145 కోట్లు లాభం ఆర్జించినట్లు ప్రకటించింది. భారత్‌లో ఎఐకి పెరుగుతున్న డిమాండ్, డిజిటైజేషన్‌వెల్లువల కారణంగాపటిష్టమైన పనితీరు చూపించగలిగామని మొబైల్; పిసి ఇతర మౌలికవనరుల బిజినెస్ విభాగాల్లో మంచి పనితీరుచూపింగలిగినట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎండి శైలేంద్ర కత్యాల్ తెలిపారు. దీనికితోడు తమ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం కూడా కలిసొ చ్చిందన్నారు. కంపెనీపరంగా మోటారోలా కీలక వృద్ధిని నమోదుచేసింది. మూడోత్రైమాసికంలో భారత్ లో 8.3శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఇక కోర్ పిసి బిజినెస్; సర్వర్, ఇన్‌ఫ్రా విభాగాలు కూడా రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. గ్లోబల్ టెక్ జైంట్ అయిన లెనోవోకు భారత్ కీలక మార్కెట్ వనరుగా మారింది. నాలుగుశాం లెనెవో గ్లోబల్ రరెవెన్యూలు, మొత్తం ఆసియా పసిఫిక్ రీజియన్ ఆదాయంలో 24శాతం భారత్‌నుంచే వస్తుందని తెలుస్తోంది. 2005నుంచే భారత్‌లో లెనోవో ఉత్పత్తిచేస్తూ వస్తోంది. స్థానికంగానే అమ్ముడుపోతున్నాయి. మోటారోలా ఫోన్లు, పిసిలు, సర్వర్లు, ట్యాబ్‌లు దేశీయ మార్కెట్‌లో మంచి దూకుడుగా ఉన్నాయి. ఇక పిసిబిలు, మదర్‌బోర్డులపరంగా కూడా మరింత కృషిచేస్తున్నట్లు తెలిపారు. లెనోవో హైబ్రిడ్ ఎఐ వ్యూహాన్ని ప్రోత్సహిస్తున్నదని, పబ్లిక్ క్లౌడ్స్, ప్రైవేటు ఇన్‌ఫ్రా, ఎఐ పిసిలు వంటి వాటికి ఎక్కువ ప్రోత్సాహం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. భారత్‌లో కంపెనీకి ఆర్‌అండ్‌డి కూడా ఉంది మొత్తం 3400 మంది భారత్‌లోపనిచేస్తున్నారు. లెనోవో గ్రూప్ పరంగా చూస్తే 22.2 బిలియన్ డాలర్ల రాబడులు సాధించింది.

## మణప్పురం వాటాకొనుగోలులో బెయిన్ క్యాపిటల్స్‌కు ఆర్బీఐ ఆమోదం




**ముంబయి, ఫిబ్రవరి 15:** మణప్పురం ఫైనాన్స్‌లో 41.66శాతం వాటా కొనుగోలుచేయాలనుకన్న బెయిన్ క్యాపిటల్‌కు రిజర్వుబ్యాంకు ఆమోదం తెలిపింది. కంపెనీ అధీకృత మూలధనం, కన్వర్టిబుల్ ఉత్పత్తుల్లో బెయిన్ క్యాపిటల్ అనుబంధ సంస్థలు బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్ ఎక్స్‌ఎక్స్‌వి, బిసి ఏసియా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎక్స్‌ఐవిలు పెట్టుబడులు పెడుతున్నాయి. గత ఏడాది మార్చిలోనే ఇందుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. గోల్డ్‌లోన్ మేజర్‌కంపెనీగా ఉనన మణప్పురానికి ఈ పెట్టుబడులతో యాజమాన్య వ్యవస్థకూడా పూర్తిగా మారుతుంది. కొన్ని షరతులకు లోబడి ఆర్బీఐ అనుతిచ్చింది. 26శాతానికి మించి అధీకృత మూలధనం, వారంట్లు మినహాయించి ఏడాది తర్వాత తీసుకోవాల నుకుంటే మళ్లీ ఆర్‌బిఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్, మణప్పురం హోమ్ ఫైనాన్స్ సంస్థలు కూడా దరఖాస్తులుచేసాయి. వీటి అనుమతులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకసారి ఈ డీల్‌పూర్తయితే భారత్‌లోని నాన్‌బ్యాంకింగ్ రంగంలో అతిపెద్దప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల డీల్‌గా నిలుస్తుంది. అంతేకాకుండా మణప్పురం క్యాపిటల్‌బేస్‌ను పెంచుతుంది. రిటైల్ రుణ విభాగంలో మరింతగా వృద్ధి ప్రణాళికలు అమలుచేసే వీలుంటుంది.

# అణు ఇంధన రంగంలోకి అదానీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేటురంగానికి కేంద్రం మద్దతిస్తుండటంతో ఇతర సంస్థలతోపాటు ఆదానిగ్రూప్ కూడా అణువిద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తోంది. టాటా, జెఎస్‌డబ్ల్యు సంస్థలు ఇప్పటికే ఈ రంగంలో విద్యుత్ ఉత్పత్తికి ఆసక్తిచూపిస్తున్నాయి. గుజరాత్ కేంద్రంగాఉన్న ఆదాని గ్రూప్ కొత్త అనుబంధ సంస్థ ఆదాని ఆటమిక్ ఎనర్జీద్వారా ఈ రంగంలోకి వస్తోంది ఆదానిపవర్‌కు ఈ సంస్థ అనుబంధంగాపనిచేస్తుంది. ప్రభుత్వ విదాననిర్ణయాల్లో మార్పులు, సడలిం పులు చేర్పులు చేయడంతో ప్రైవేటురంగంలో కూడా అణు ఇంధన ఉత్పత్తికి అవకాశం వచ్చింది. దీర్ఘకా లిక స్వచ్ఛ ఇంధనం, ఇంధన భద్రత వ్యూహాలకు అనుగుణంగా కేంద్రం ఇపుడు ప్రైవేటు రంగాన్ని కూడా ప్రోత్సహిస్తోంది. భారత్‌కు ప్రస్తుతం 9 గిగావాట్ల అణుసామర్థ్యం ఉంది. మొత్తం విద్యుత్ ఉత్ప త్తిలో మూడుశాతం వాటాతో ఉంది. ప్రభుత్వం 2047 నాటికి 100 గిగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ఉంది. మొత్తం విద్యుత్‌లో పదిశాతానికిపైగా అణువిద్యుత్ మిక్స్ కూడా ఉంటుం దని అంచనా. ప్రైవేటు కంపెనీలు బిల్డ్, ఓన్, ఆపరేట్ న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. చిన్నపాటి మాడ్యుల్ రియాక్టర్లను భాగస్వామ్య పద్ధతిలోకూడా ఏర్పాటుచేసుకోవచ్చు. విదేశీ పెట్టు బడుల్లో 49శాతం వాటాను అనుమతిస్తారు. యురేనియం తవ్వకాల్లో మాత్రం పూర్తిగా ప్రభుత్వ పట్టు కొనసాగుతుంది. ఇంధన మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వ కస్టడీలోనే ఉంటుంది. అణు ఇంధం రంగంలో చేసిన మార్పులు కేవలం మోడీ సన్నిహితులకు, ఎన్డీయే కార్పొరేట్లకు ప్రయోజనం కల్పిం చేందుకు చేసినవిగానే ఉన్నాయని కాంగ్రెస్ పక్షనేత జైరామ్‌రమేష్ అన్నారు. 2070 నాటికి నెట్‌జీరో ఉద్గారాలు సాధించే లక్ష్యంతో భారత్ అణు ఇంధన ఉత్పత్తిని కూడా భారీస్థాయిలో ప్రైవేటును ప్రోత్సహిస్తోంది.

## సాలిడ్‌రైజ్‌లో లోథా డెవలపర్స్‌కు 80%వాటా




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15:** రియాల్టీ సంస్థ లోథా డెవలపర్స పూణె కేంద్రంగా ఉన్న సాలిడ్‌రైజ్ రియాల్టీలో 80శాతం వాటాను రూ.294 కోట్లకు కొనుగోలు చేసింది. ముంబయి కేంద్రంగాపనిచేసే లోథా డెవలపర్స్ దేశంలోనే లీడింగ్ రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఒకటిగా కొనసాగింది. లోథా బ్రాండ్‌పై స్థిరాస్తులను విక్రయిస్తుంది. కంపెనీ సాలిడ్‌రూజ్ రియాల్టీనుంచి వాటాలకొనుగోలు ఒప్పందం చేసుకుందని వెల్లడించింది. ఈ డీల్‌పూర్తయితో సాలిడ్‌రైజ్ సంస్థ లోథా డవలపర్స్‌లో అనుబంధంగా కొనసాగుతుంది. గతనెలలోనే లోథా డవలపర్స్ ఒకటిశాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదుచేసారు. నికరలాభం రూ.956.9 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.944.4 కోట్లు సాధించింది. మొత్తం రాబడులు కూడా 4775.4 కోట్లు ఉంది. అదే గత ఏడాది 4146.6 కోట్లు మాత్రమే ఆర్జించింది. ముంబయి, డిల్లీ, ఎన్సీఆర్, బెంగళూరుల్లో ఈత్రైమాసికంలో ఐదు స్థలాలను సేకరించింది. ఈ స్థలాల్లోనే వృద్ధిచేస్తే రూ.34 వేల కోట్ల విలువలు నమోదవుతాయని కంపెనీ చెపు తోంది. లోథా డెవలపర్స్ 100 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని ఇప్పటివరకూ అభివృద్ధిచేసింది. ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, పూణె, బెంగళూరు హౌసింగ్ మార్కెట్‌లలో మంచి డిమాండ్‌తో ఉంది. ఇటీవలే ఢిల్లీ ఎన్సీఆర్ రెసిడెన్షియల్ మార్కెట్‌లోకి ప్రవేశించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14